ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 13.03.2025 | సంపుటి : 11 సంచిక : 241 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# మాది రైతు సర్కార్..

## రైతన్నలే మా ఆత్మ

## సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
### అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగం



- అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ రాష్ట్రం అడుగులు
- రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాల అమలు
- 260 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డుస్థాయి వరి ఉత్పత్తి
- తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం
- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు
- గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):** అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు వేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. మా ప్రభుత్వం సామాజిక న్యాయం సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణకు రైతులే ఆత్మ అని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజలకోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలు అని జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పతి చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని ప్రశంసించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగించారు. తెలంగాణ భౌగోళిక ప్రాంతమే కాదని, ఒక భావోద్వేగ ప్రాంతమని, స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు తెలంగాణ అని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో రైతులభాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతివ్వడం వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే తమ బాధ్యత అని, దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలియజేశారు.

మిగతా 2లో..

## అసెంబ్లీకి కేసీఆర్
### స్వాగతం పలికిన భారాస నేతలు

**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీకి హాజరయ్యారు. దాదాపు 50 నిమిషాలు ముందుగానే అసెంబ్లీకి వచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్వాగతం పలికారు. అయితే గత పదిహేను నెలలుగా ప్రధాన ప్రతిపక్షనేతగా కేసీఆర్ అసెంబ్లీకి రావడంలేదన్న విమర్శల నేపథ్యంలో.. ఈసారి అసెంబ్లీకి హాజరుకావాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా 50 నిమిషాలు ముందుగానే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్.. ముందుగా అసెంబ్లీ ఇన్నర్ లాబీలోని

మిగతా 2లో..



## 27 వరకు అసెంబ్లీ సమావేశాలు
### 19న బడ్జెట్.. 17,18 తేదీల్లో బీసీ రిజర్వేషన్లపై చర్చ
#### బీఏసీ సమావేశంలో నిర్ణయం



**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మార్చి 27 వరకు జరుగుతాయి. 14న హోలీ, 16న ఆదివారం, 20, 23న సెలవులు ఉన్నాయి. ఈ నాలుగు రోజులు మినహాయించి 12 రోజులు సమావేశాలు జరగబోతున్నాయి. చాలా రోజుల తర్వాత మాజీ సీఎం కేసీఆర్

మిగతా 2లో..

## కేసీఆర్ పాలనలో ఆర్థిక వ్యవస్థకు
# క్యాన్సర్
### వ్యవస్థకు చికిత్స చేస్తున్నాం: సీఎం రేవంత్



- విద్యారంగానికి మా ప్రభుత్వంలో పెద్దపీట వేస్తున్నాం
- బాధ్యత తీసుకుని లెక్చరర్లు కళాశాలను తీర్చిదిద్దాలి
- గత బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగ సమస్య తీవ్రం
- అధికారంలోకి రాగానే 55 రోజుల్లో నియామకాలు
- ఉద్యోగ నియామకపత్రాలు అందించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రానికి కేసీఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారని.. క్యాన్సర్ ముదురుతుంటే రాష్ట్రం దివాళా తీసిందంటారా అని అంటున్నారని.. వాస్తవాన్ని ఎన్నాళ్ళు దాచిపెడతారని అన్నారు. తాను వాస్తవాలు చెబుతుంటే? దిగిపో దిగిపో అని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం మొత్తం ఫ్యామిలీ ప్యాకేజ్‌లా అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. 'అబద్దాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడపను. వాస్తవాలు మీతో పంచుకుని రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా. తెలంగాణలో భావితరాల భవిష్యత్ నిర్మాణానికి మీ సహకారం అవసరం. ఎంతసేపు సీఎం కుర్చీని లాక్కుంటామంటే ఎలా.. నన్ను పనిచేయనివ్వాలి కదా మీరు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలోని ఇంటర్ కాలేజీలను గొప్పగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత జూనియర్ లెక్చరర్ల మీద ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు వేగంగా చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం సాగదీసి నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైందని..

మిగతా 2లో..

## గవర్నర్ చేత అబద్దాలు చెప్పించారు
### గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం:కేటీఆర్



**హైదరాబాద్(జనంసాక్షి):** గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ మీడియా పాయింట్‌లో విలేక రులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన 420

మిగతా 2లో..

## సంక్షేమాన్ని ఓర్వలేకే విమర్శలు
### బీఆర్‌ఎస్ తీరుపై కాంగ్రెస్ మండిపాటు

**హైదరాబాద్(జనంసాక్షి):**వర్నర్ ప్రసంగాన్ని అవహేళన చేయడం తగదని, కనీసం గవర్నర్ ప్రసంగాన్ని గౌరవించే సంస్కృతి కూడా బీఆర్‌ఎస్ నేతలకు లేకుండా పోయిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ నేతల తీరును తీవ్రంగా విమర్శించారు. గబీఆంఎస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి ముందుగా అసెంబ్లీకి హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రభుత్వ విప్

మిగతా 2లో..

## విపక్షాల విమర్శలను దీటుగా ఎదుర్కోవాలి

- అసెంబ్లీ సమావేశాలకు విధిగా హాజరు కావాలి
- ప్రతి విషయంలోనూ అవగాహనతో ఉండాలి
- సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ ఆదేశాలు



**హైదరాబాద్(జనంసాక్షి):** అసెంబ్లీ సమావేశాలకు అందరు ఎమ్మెల్యేలు తప్పని సరిగా హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతిపక్షాలు గందరగోళం చేసే ప్రయత్నం చేస్తాయని, సంయమనంతో వ్యవహరించాలని సీఎం సూచించారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన


మిగతా 2లో..

## డిలిమిటేషన్‌పై త్వరలో అఖిలపక్షం సమావేశం
### రాజకీయ పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి బహిరంగ లేఖ



**హైదరాబాద్(జనంసాక్షి):**నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి.. రాజ కీయ పార్టీలకు ఆయన బహిరంగ లేఖ రాశారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజక వర్గాల పునర్విభజనపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలనుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు. 'జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో తెలంగాణకు ప్రమాదం. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకావాలి. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తాం. త్వరలోనే భేటీకి సంబంధించిన తేదీ, వేదిక ప్రకటిస్తాం' అని లేఖలో పేర్కొన్నారు.

## మారిషస్ భారత్‌కు కీలక భాగస్వామి
### ఆ దేశ పర్యటనలో ప్రధాని మోదీ వెల్లడి



**పోర్ట్ లూయీ(జనంసాక్షి):** మారిషస్ తమకు కీలక భాగస్వామి అని భారత ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అలాగే 140 కోట్ల మంది భారతీయుల తరఫున మారిషస్ ప్రజలకు నేషనల్ డే శుభాకాంక్షలు తెలియజేశారు."నేషనల్ డే రోజున మరోసారి మీముందు ఉండటం నా అదృష్టం. మన రెండు దేశాలను అనుసంధానించేది హిందూ మహాసముద్రం మాత్రమే కాదు. సంస్కృతి, సంప్రదాయాలు మనల్ని కలిపి ఉంచుతున్నాయి. ఈ రెండు దేశాల బంధాన్ని 'మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్య' హోదాకు తీసుకెళ్లాలని ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం, నేను నిర్ణయించాం. మారిషస్‌లో కొత్త

మిగతా 2లో..

## డంకీ రూట్‌లో మరో విషాదం
### అమెరికాకు వెళ్తుండగా ఇద్దరు భారతీయులు కిడ్నాప్



**గ్వాటెమాలా(జనంసాక్షి):**అమెరికాలో అక్రమంగా ఉంటున్నవారిని అక్కడి ప్రభుత్వం వెనక్కి పంపుతున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భారతీయులు అక్రమంగా ఇతర దేశాలకు వెళ్లడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ కొందరు ప్రమాదకరమైన డంకీ మార్గాల్లో అగ్ర దేశానికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలో డంకీ మార్గంలో

మిగతా 2లో..

## ఫిర్యాదుల వెల్లువ..
### హైడ్రాలో పెండింగ్‌లో 10వేలకు పైగా పిటిషన్లు : రంగనాథ్



**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారానికి హైడ్రా చేస్తున్న కృషిని కమిషనర్ రంగనాథ్ వివరించారు. ఒకప్పటి చెరువుల పరిస్థితి, ఇప్పటి పట్టణీకరణ, హైడ్రా చేస్తున్న పనులపై బుధవారం ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజావాణికి నేరుగా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్‌లో కూడా చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ రాబోతోందని తెలిపారు.

మిగతా 2లో..

## ముందుంది మండే కాలం
### రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత



**హైదరాబాద్(జనంసాక్షి):**మార్చి 13 నుంచి తెలంగాణలో ఎండలు కాక పుట్టించనున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. వేడిగాలులతో, వడగాల్పులతో వాతావరణం మార్చిలోనే మే నెల ఎండలను


మిగతా 2లో..

## బంతి పుతిన్ కోర్టులో ఉంది
### కాల్పుల విరమణ ఒప్పందంపై ట్రంప్

**న్యూయార్క్(జనంసాక్షి):**రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ముగింపునకు అమెరికా ప్రతిపాదించిన 30 రోజుల కాల్పుల విరమణను కీవ్ అంగీకరించిన సంగతి తెలిసిందే. ఇక, రష్యా దీన్ని అంగీకరించాల్సి ఉంది. ఆ దేశాధ్యక్షుడు పుతిన్ దీనికి కచ్చితంగా అంగీకరిస్తారని అగ్ర రాజ్యం అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. మంగళవారం విలేకరులతో ఆయన ఈమేరకు మాట్లాడారు. 'ఉక్రెయిన్ కాల్పుల విరమణకు అంగీకరించింది. ఇక, మిగిలింది

మిగతా 2లో..

## కెనడాపై డబుల్ సుంకాలపై
# వెనక్కి తగ్గిన ట్రంప్
### టారీఫ్‌ల పెంపు తాత్కాలిక వాయిదా



**న్యూయార్క్(జనంసాక్షి):**అమెరికా కెనడాల మధ్య పరస్పర సుంకాల యుద్ధం కొనసాగుతోంది. అమెరికాకు సరఫరా చేసే విద్యుత్‌పై 25 శాతం అదనపు రుసుం వసూలు చేస్తామని అంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ పేర్కొనడంతో..కెనడాకు చెందిన ఉక్కు, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిన్న ప్రకటించారు. తాజాగా ఈ పెంపును ఆయన తాత్కాలికంగా నిలిపివేశారు. అమెరికాలోని పలు రాష్ట్రాలపై విద్యుత్ ధరల పెంపును కెనడా ఉపసంహరించుకున్న నేపథ్యంలో సుంకాలపై ట్రంప్ వెనక్కి తగ్గుతున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాపై 25 శాతం టారిఫ్ విధించిన విషయం తెలిసిందే. దీంతో అమెరికాలోని మూడు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న విద్యుత్‌పై ఎగుమతి సుంకాలను 25శాతం పెంచుతున్నట్లు కెనడాలోని ఒంటారియో ప్రకటించింది. దానికి ప్రతీకారంగా కెనడాకు చెందిన ఉక్కు, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు తాజాగా ప్రకటించారు. కాగా యుఎస్ వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్‌తో చర్చల అనంతరం

మిగతా 2లో..




## అమెరికాతో చర్చలు జరిపేదిలేదు
### స్పష్టం చేసిన ఇరాన్

**టెహ్రాన్(జనంసాక్షి):**అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే.తాజాగా తాము అగ్రరాజ్యంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా లేమని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అక్కడి

మిగతా 2లో..

## పాక్‌లో రైలు హైజాక్ ..
# 200 మందిని బంధించిన మిలిటెంట్లు



### 30 మంది బలోచ్ వేర్పాటువాదులను హతమార్చిన బలగాలు

**లాహోర్,మార్చి12(జనంసాక్షి):**పాకిస్థాన్‌లో రైలు హైజాక్ ఘటనలో బలోచ్ వేర్పాటువాదుల చెర నుంచి దాదాపు 190 మంది ప్రయాణికులను భద్రతాబలగాలు రక్షించాయి. అలాగే 30 మంది మిలిటెంట్లను మట్టుపెట్టాయని స్థానిక వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అయితే మిలిటెంట్లు ఐదు వేర్వేరు ప్రాంతాల్లో 200 మందిని బంధించినట్లు పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బలోచిస్థాన్ ప్రావిన్సులోని పర్వతప్రాంతమైన క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని పెషావర్‌కు జాఫర్ ఎక్స్‌ప్రెస్ (ఏజౌజీస ఇలూస।బబ) వెళ్తున్న సమయంలో ఈ హైజాక్ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. రైల్లోని తొమ్మిది బోగీల్లో 400 మంది ప్రయాణికులున్నారు. అలాగే రైల్లో ఉన్న బలోచ్ మిలిటెంట్లు చిన్న బృందాలుగా విడిపోయి ఉండటంతో.. ఆపరేషన్ కష్టతరంగా మారినట్లు భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే.. బలోచ్ తిరుగుబాటుదారులు ఆఫ్గానిస్థాన్‌లోని తమ కీలక నేతతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించారు. హైజాక్‌లో మొత్తం 70 నుంచి 80 మంది వేర్పాటువాదులు పాల్గొన్నారంటూ మీడియాతో మాట్లాడారు. ఈ ఘటన నేపథ్యంలో బలోచిస్థాన్‌కు రాకపోకలు

మిగతా 2లో..

## బంతి పుతిన్ కోర్టులో ఉంది

రష్యానే. ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ దీనికి అంగీకరిస్తారని ఆశిస్తున్నా. యుద్ధం కారణంగా అనేకమంది ప్రజలు చనిపోతున్నారు. ఈ యుద్ధాన్ని ముగించాలనుకుంటున్నా. అందులోభాగంగా కాల్పుల విరమణ చాలా ముఖ్యం. దీనిపై నేను పుతిన్‌తో మాట్లాడతాను. వాళ్లు దీనికి ఒప్పుకోకపోతే ఇంకా అనేకమంది ప్రజలు చనిపోతారు' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇక, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మరోసారి చర్చలు జరిపేందుకు ఆయన్ను త్వరలోనే వైట్‌హౌస్‌కు ఆహ్వానిస్తానని ట్రంప్ తెలిపారు.రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలను ఆపేందుకు ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దీనిపై చర్చించేందుకు ఇటీవల శ్వేతసౌధంలో జెలెన్‌స్కీ, ట్రంప్‌లు భేటీ కాగా.. వీరి మధ్య వాగ్వాదం జరిగిన సంగతి తెలిసిందే. అనంతరం శాంతి సాధనకు అవసరమైన చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఈక్రమంలోనే సౌదీ అరేబియాలోని జెడ్డాలో ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ ఆధ్వర్యంలో అమెరికా మంత్రులు, అధికారుల బృందం, ఉక్రెయిన్ ప్రతినిధుల బృందం మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో 30 రోజుల సాధారణ కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా ప్రతిపాదించగా.. అందుకు కీవ్ అంగీకారం తెలిపింది. ఈనేపథ్యంలో సైనిక సాయం, నిఘా భాగస్వామ్యానికి సంబంధించిన ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు అగ్రరాజ్యం ప్రకటించింది. ఇక ఖనిజాల తవ్వకానికి సంబంధించి సాధ్యమైనంత త్వరగా ఒప్పందానికి వచ్చేందుకు రెండు దేశాలు ఓ నిర్ణయానికి వచ్చాయి. ఈ కాల్పుల విరమణ ఒప్పందంపై రష్యాతో అమెరికా చర్చలు జరపాల్సి ఉంది.

## కెనడాపై డబుల్ సుంకాలపై వెనక్కు తగ్గిన ట్రంప్

విద్యుత్‌పై 25 శాతం అదనపు రుసుం వసూలు చేయాలనే ప్రణాళికను విరమించుకున్నట్లు ఒంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ వెల్లడించారు. ఈ విషయంలో ఇరువర్గాల ప్రయోజనాలపై అమెరికాతో చర్చలు జరపడానికి ఫెడరల్ ఆర్థిక మంత్రి డొమినిక్ లెబ్లాంక్‌తో కలిసి గురువారం వాషింగ్టన్ వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.అమెరికా దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25శాతం సుంకాలను విధిస్తున్నామని ట్రంప్ ప్రకటించారు. కెనడా, మెక్సికో సహా ప్రపంచ దేశాలన్నింటికీ ఇది వర్తిస్తుందని ప్రకటించారు. దీనిపై ఆదేశాలిస్తానని తెలిపారు. మరిన్ని రంగాల్లోనూ సుంకాలను ప్రకటిస్తామని వెల్లడించారు. 'వారు మన ఉత్పత్తులపై 130శాతం సుంకాలు విధిస్తుంటే మనం ఏమీ విధించకపోవడం సరికాదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ సుంకాల ప్రకటనతో అంతర్జాతీయ వాణిజ్య భాగస్వామ్య సంస్థల్లో ఆందోళన నెలకొంది.

## అమెరికా చర్చలు జరిపేదిలేదు

మీడియాలో కథనాలు వెల్లడిస్తున్నాయి. వాటి ప్రకారం.. 'అమెరికా ఆదేశాలు ఇవ్వడం, బెదిరించడం ఆమోదయోగ్యం కాదు. ట్రంప్‌తో చర్చలు చేపట్టే ఉద్దేశం నాకు లేదు. ఆయనకు ఇష్టమొచ్చింది చేసుకోవచ్చు' అని పెజిష్కియాన్ పేర్కొన్నారు.ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోవడాన్ని నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఇదే అంశంపై ఇటీవల మాట్లాడిన ట్రంప్.. టెహ్రాన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈమేరకు ఖమేనీకి లేఖ రాసినట్లు ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఇరాన్‌కు సైన్యం, ఒప్పందం అనే రెండు మార్గాలను సూచించారు. అయితే, తాను ఒప్పందానికే ప్రాధాన్యం ఇస్తానని, టెహ్రాన్‌ను దెబ్బతీయడం ఇష్టం లేదని స్పష్టంచేశారు.ఇక, ట్రంప్ ప్రతిపాదనపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ఇటీవల స్పందించారు. అమెరికా చర్చలు సమస్యల పరిష్కారం కంటే ఆధిపత్యమే లక్ష్యంగా ఉంటాయని విమర్శించారు. టెహ్రాన్‌ను ఎదురించలేక.. ట్రంప్ చర్చలు అనే కొత్త వ్యూహాలు నెలకొల్పుతున్నారని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో గతంలో అణు ఒప్పందం చేసుకున్న అమెరికా.. 2018లో ట్రంప్ హయాంలోనే దాన్నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.

## ముందుంది మండే కాలం

తలపించనుంది. హైదరాబాద్ నగరంలో పగటి పూట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానున్నాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, యాదాద్రి, మెదక్, సిద్ధిపేట్, సిరిసిల్ల, కామారెడ్డి, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నారాయణ్ పేట్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతుందని వాతావరణ శాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వేసవికాలం ప్రారంభమైన మొదట్లోనే టెంపరేచర్ 40 డిగ్రీలకు చేరువలో ఉంది. మరో రెండు నెలలు వేసవి కాలం ఉండడంతో ప్రస్తుత ఉష్ణోగతలను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గత మూడునాలుగు రోజుల నుంచి సూర్యాపేట జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో 38 డిగ్రీలకు పైగా, 10 ప్రాంతాల్లో 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరుబావుల్లో నీరు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో సాధారణంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ మార్చి రెండో వారంలోనే 35 డిగ్రీలకు చేరుకొని ఆ తర్వాత 40కి అటు ఇటుగా నమోదవుతుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మార్చి 4న 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంతకుముందు వారం రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఈనెల 1న 33 డిగ్రీలు, 2న 35 డిగ్రీలు, 3న మరో రెండు డిగ్రీలు పెరిగి 37కు చేరింది. ఈనెల 4న ఏకంగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నాలుగు మండలాల్లో 38.03 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఎండాలను చూస్తున్న జనం రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు.

### ఆయిల్ ఫీల్డ్స్ రెగ్యులేషన్ బిల్లుకు ఆమోదం

**న్యూఢిల్లీ,మార్చి12(జనంసాక్షి):**లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆయిల్ ఫీల్డ్స్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) సవరణ బిల్లు 2024 ఆమోదం పొందింది. ఈ బిల్లును పెట్రోలియం, సహజవాయువు శాఖా మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి ప్రవేశపెట్టారు. ఈ బిల్లు మూజువాణి ఓటింగ్ ద్వారా ఆమోదం లభించింది. ఇదిలా ఉండగా రైల్వేశాఖ పనితీరుపై బుధవారం రాజ్యసభలో చర్చ జరిగింది. హోలీ కారణంగా రాజ్యసభ సోమవారానికి వాయిదా పడింది. చర్చల్లో వచ్చిన ప్రశ్నలపై రైల్వేశాఖా మంత్రి సోమవారం బదులివ్వనున్నారు.

### భారత్-పాక్ సరిహద్దుల్లో విద్యుత్ ప్రాజెక్టు

#### సభలో చర్చ..ప్రభుత్వ తీరుకు నిరసనగా వాకౌట్

న్యూఢిల్లీ:భారత్, పాకిస్తాన్ సరిహద్దుకు చేరువలో పునరుపయోగ విద్యుత్ ప్రాజెక్టుకు అనుమతి మంజూరుపై బుధవారం లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు, ముఖ్యంగా కాంగ్రెస్, డిఎంకె సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి 'సంతృప్తికర సమాధానం రాకపోవడంతో' వారు ఆతరువాత సభలో నుంచి వాకౌట్ చేశారు. కాంగ్రెస్ సభ్యుడు మనీష్ తివారీ ప్రశ్నోత్తరాల సమయంలో ఒక అనుబంధ ప్రశ్న అడుగుతూ, జాతీయ భద్రత, ఇంధనశక్తి భద్రత కలసి సాగవలసి ఉంటుందని అన్నారు. పునరుపయోగ విద్యుత్ ప్రాజెక్టు అంతర్జాతీయ సరిహద్దు (ఐబి)కి ఒక కిలోమీటర్ సమీపం వరకు ఏర్పాటు అవుతుందని ఆయన చెప్పారు. భద్రత ప్రొటోకాల్ ప్రకారం, ఏ భారీ మౌలికవసతుల కల్పన ప్రాజెక్టు అయినా ఐబికి కనీసం పది కిలోమీటర్ల దూరంలో ఉండాలని ఆయన అన్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టుకు ఏ సడలింపు అయినా మంజూరు చేశారా అని తివారీ అడిగారు.

# మాది రైతు సర్కార్



రైతులకు రుణమాఫీ చేశామని, ఇదే రైతుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని, ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని, రైతు నేస్తం అమలు చేస్తున్నామని, వరికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణి కల్పిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ వివరించారు. ఘనమైన సంస్కృతి నిలయం తెలంగాణ అని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారన్నారు. జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామని తెలిపారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నామన్నారు. తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ అని అన్నారు. ప్రజలే కేంద్రంగా పాలన కొనసాగుతోందని గవర్నర్ వెల్లడించారు. ల్గ÷తులకు మద్దతివ్వడం, వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. దేశంలోనే ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని.. ఇదే రైతుల పట్ల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 23.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని తెలిపారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు. తెలంగాణ పురోగమించడమే కాదు.. రూపాంతరం చెందుతోందన్నారు. సమ్మిళిత, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ విజన్‌తో పని చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిగా ఉండేలా తెలంగాణ నమూనా ఉండాలని, తెలంగాణ భౌగోళిక పాత్రమే కాదు.. ఒక భావోద్వేగమన్నారు. తెలంగాణ స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు అన్నారు.రైతుల స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తోందన్నారు. 260లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇది మన రైతుల స్థిరత్వం, అంకిత భావానికి ఓ సాక్ష్యమన్నారు. రూ.2లక్షల పంట రుణమాఫీని అమలు చేస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఇది ప్రభుత్వం చేసిన వాగ్దానాల నిర్దిష్ట కాల అమలుకు సాక్ష్యమన్నారు. రైతు భరోసా కింద నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారత లభిస్తోంది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అగ్రశ్రేణి శిక్షణ అందుతోంది. సివిల్ సర్వీసు పరీక్షల ఆశావహుల కోసం రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం తెచ్చాం. గతేడాది 55 వేల మందిగా పైగా యువత పభుత్వోద్యోగాలు పొందారు. ఆరోగ్యశ్రీ పథకం కవరేజీ రూ.10 లక్షల వరకు పెంచాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు ప్రతిపాదించాం. ఎస్సీ ఉపవర్గీకరణ కోసం బిల్లును ప్రవేశపెట్టనున్నామని గవర్నర్ అన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ గురువారానికి వాయిదా పడింది. సమావేశాలకు ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో విపక్ష సభ్యులు నిరసనలు వ్యక్తం చేశారు.

## గవర్నర్ చేత అబద్దాలు చెప్పించారు

హామీలు ఈ ప్రభుత్వం, ఆరు గ్యారంటీల గురించి ఏమైనా కొత్త విషయాలు చెబుతారేమోనని అనుకున్నామన్నారు. 'గత 15నెలల పేల వమైన, పరిపాలన గురించి ప్రాయశ్చిత్తం చేసుకునేవిధంగా గవర్నర్ ప్రసంగం ఉంటుందని భావించాం. ఇది గవర్నర్ ప్రసంగం లేదు. ఒకమాటలో చెప్పాలంటే గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉంది తప్పా.. గవర్నర్ ప్రసంగంలా లేదు. గవర్నర్ నోటి వెంట ఒకటికాదు రెండు చాలా అబద్దాలు చెప్పించారు. గవర్నర్ నోటివెంట అసత్యాలు పలకాల్సి రావడంపై బాధపడుతున్నాం. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్ల ఈ రోజు రాష్ట్రంలో రైతాంగం ఆందోళనలో ఉందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నయ్. ఇప్పటికే 480 పైచీలుకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీసం ఒక మాట రైతులకు స్వాంతన చేకూర్చే, ఉపశమనం, భరోసా ఇచ్చేమాట గవర్నర్ నోటినుంచి వస్తుందేమోననని ఆశించాం. పంటలు ఎండిపోకుండా కాపాడుతాం. పంటలకు నీరు ఇస్తాం. బుద్ధి తెచ్చుకున్నాం. ఇకనైనా బుద్ధితో మెదులుతామని చెప్పి ఒక్క మాట చెబుతారని అనుకున్నాం. వారి నోటివెంట ఒక్క మాట రాలేదు. అసలు ఈ రోజు వరకు రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 25శాతం నుంచి 30శాతానికి మించి రుణమాఫీ జరుగలేదు. దీనిపై పోయిన శాసనసభలో ప్రభుత్వాన్ని అడిగినం. సీఎం సొంత ఊరికి పోదామా? సొంత నియోజకర్గానికి పోదామా? ప్లేస్, సమయం మీ ఇష్టం.. ఊరు మీష్టం అని చెప్పాం. ఒక ఊరిలో వందశాతం రుణమాఫీ జరిగితే మేం అందరం రాజీనామా చేస్తామని చెప్పాం. కానీ, మళ్లీ ఈ రోజు గవర్నర్ నోటివెంట రుణమాఫీ అయిపోయింది.. లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నరని గవర్నర్‌తో అబద్దాలు చెప్పించి.. గవర్నర్ స్థాయిని సైతం దిగజార్చి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని, నీచత్వాన్ని బయటపెట్టుకుంది' అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

## సంక్షేమాన్ని ఓర్వలేకే విమర్శలు

సూచించారు. ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవడం లేదని, వారు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఆయన పేర్కొన్నారు. ప్రజలు వారి తీరును గమనిస్తున్నారని, విపక్షంగా వారు సరిగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని ఐలయ్య పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన వంటి కీలక నిర్ణయాలతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అయితే, ఈ కులగణనలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు పాల్గొనకపోవడం దుర్మార్గమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టు పేరు మీద భారీగా కమిషన్లు దండుకున్నారని బీర్ల ఐలయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తుందని, గత 10 ఏళ్ల పాలనలో బీఆర్ఎస్ మిగిల్చిన అప్పులను తగ్గించేందుకు కృషి చేస్తుందని తెలిపారు.

## 27 వరకు అసెంబ్లీ సమావేశాలు

అసెంబ్లీకి వచ్చారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటారని కెటిఆర్ ఇప్పటికే ప్రకటించారు. అటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును 15వ తేదీన ప్రవేశపెట్టబోతోంది. 17, 18వ తేదీల్లో బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేకంగా చర్చలు జరుపుతారు. కీలకమైన బడ్జెట్‌ను 19వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెడుతారు. 20వ తేదీన సెలవు కాబట్టి 21, 22వ తేదీల్లో బడ్జెట్ మీద చర్చిస్తారు. 24 , 25, 26వ తేదీల్లో పద్దులపై చర్చలు జరుపుతారు. చివరగా 27వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశ పెడుతారు. ఈ సమావేశాలు అత్యంత కీలకం కానున్నాయి. ఎందుకంటే బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం బీసీలంతా ఎదురు చూస్తున్నారు. ఈ బిల్లులో బీసీ రిజర్వేషన్ల కోటాపై స్పష్టత వస్తే కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయి. అంతే కాకుండా కేసీఆర్ ఓడిపోయిన తర్వాత మొదటిసారి అసెంబ్లీలో ప్రసంగించబోతున్నారు. ప్రతిపక్షాలకు ధీటుగా సమాధానాలు చెప్పాలని రేవంత్ ప్రభుత్వం కసరత్తులు స్టార్ట్ చేసింది. కాబట్టి గతంలో జరిగిన సమావేశాల కంటే ఈ సమావేశాలు మరింత వేడెక్కడం ఖాయం. స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ అధ్యక్షతన జరిగిన బిఎపిసి సమావేశంలో అసెంబ్లీ పనిదినాలపై చర్చించారు. అసెంబ్లీలో స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈనెల 27 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. గురువారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టి.. దానిపై చర్చించి ఆమోదం తెలుపనున్నారు. అలాగే 14న హోలీ పండుగ నేపథ్యంలో సెలవు ప్రకటించారు. 16న ఆదివారం. 17న ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై చర్చించనున్నారు. 18న బీసీ కులగణన, రిజర్వేషన్లపై చర్చ జరుగనుంది. 21నబడ్జెట్‌పై చర్చించనున్నారు. అలాగే మూడు రోజుల పాటు పద్దులపై చర్చ జరుగనుంది. 27న ద్రవ్యవినిమయ బిల్లుకు ఆమోదం తెలుపుతారు. దాదాపు 11 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. కనీసం 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని స్పీకర్ దృష్టికి బీఆర్ఎస్ నేతలు తీసుకెళ్లారు. అయితే ఈనెల 27 వరకు సభను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, బిజెపి నుండి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు.

### అసెంబ్లీకి కేసీఆర్

బీఆర్ఎస్ఎల్పీలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అధినేత సమావేశమయ్యారు. అయితే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినా పలువు పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలు సమయానికి సభకు రాలేదు. మంగళవారం జరిగిన ఎల్పీ సమావేశంలో బీఆర్ఎస్ సభ్యులంతా ముందుగానే అసెంబ్లీకి రావాలని కేసీఆర్ ఆదేశించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ పార్టీలోని పలువురు సభ్యులు మాత్రం తీరుమార్చుకోని పరిస్థితి.మరోవైపు బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ప్రతిపక్షనేత కేసీఆర్‌ను అశ్వారావుపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆదినారాయణ కలిశారు. మర్యాదపూర్వకంగానే కేసీఆర్‌ను కలిశానని కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గతంలో ఆదినారాయణ బీఆర్ఎస్‌లో పనిచేశారని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అయితే అసెంబ్లీ లాబీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మాజీ మంత్రి కేటీఆర్ ముచ్చటించారు.

## విపక్షాల విమర్శలను దీటుగా ఎదుర్కోవాలి

సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని పలు సూచనలు చేశారు. సభలో వ్యవహరించాల్సిన విధానంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇవి రెండో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలని, అత్యంత కీలకమైనవిగా సీఎం స్పష్టం చేశారు. ఈ 15నెలల్లో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తిగా చర్చించుకునేందుకు ఈ సమావేశాల్లో అవకాశం ఉందన్నారు. సభ్యులందరూ కచ్చితంగా రావాల్సిందేనని, ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలన్నారు. సమావేశాల్లో సభ్యులంతా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అంశాల వారీగా ప్రిపేర్ అయి సభకు రావాలని తెలిపారు. సభ్యుల హాజరుపై ప్రభుత్వ విప్‌లు పర్యవేక్షించాలని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీని నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ సందర్భంగా సీఎం అసహనం వ్యక్తం చేశారు. హాజరైతేనే సభలో ఏం జరుగుతుందో తెలుస్తుందన్నారు. సీఎల్పీ భేటీలో మాట్లాడుతుండగా బయటకు వెళ్లిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌పై సీఎం అసహనం వ్యక్తం చేశారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. 'చాలామంది సీరియస్ గా పనిచేయట్లేదు. ఒకసారి గెలవడం గొప్పకాదు. మరోసారి అసెంబ్లీకి రావడమే గొప్ప. చాలా మంది బీఆర్ ఎస్ పట్ల సైలెంట్ గా ఉంటున్నారు. అలా చేస్తే మీ మీద అభ్యర్థిని పెట్టరు అనుకుంటున్నారా.. అలా అస్సలు ఊహించుకోకండి. వాళ్ల గురించి నాకు బాగా తెలుసు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అన్నింటికీ ధైర్యంగా ముందుకెళ్లాలి' అంటూ చెప్పుకొచ్చారు సీఎం రేవంత్.మీటింగ్ మధ్యలో నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్ బయటకు వెళ్లడంపై సీఎం రేవంత్ సీరియస్ అయ్యారు. 'ఓ వైపు నేను ఇంత సీరియస్ గా మాట్లాడుతుంటే అతనేంటి అలా వెళ్తున్నారు. ఇంత నాన్ సీరియస్ గా ఉంటే ఎలా.. మనం మరోసారి గెలవాలంటే చాలా సీరియస్ గా పనిచేయాల్సిందే. రాజకీయాలు అంటే పిల్లలాటలు కాదు. అందరం కలిసి పనిచేస్తేనే మరోసారి మన ప్రభుత్వం వస్తుంది. కొందరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు రావొద్దు. ఇక నుంచి అందరూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలి. వచ్చే నెల 6వ తేదీ నుంచి అన్ని జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి లంచ్ మీటింగ్ పెట్టుకుందాం. అందరి పనితీరుపై చర్చిద్దాం' అంటూ సీరియస్ గా క్లాస్ తీసుకున్నారు.

### ఫిర్యాదుల వెల్లువ

ఎప్పటికప్పుడు ఫిర్యాదుల పరిష్కారం కోసం కృషి చేస్తున్నా.. ఇంకా 10వేలకు పైగా పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

## పాక్‌లో రైలు హైజాక్ ..

**200 మందిని బంధించిన మిలిటెంట్లు**

**30 మంది బలోచ్ వేర్పాటువాదులను హతమార్చిన బలగాలు**

సాగించే అన్ని రైళ్లను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది.సైన్యం కిడ్నాప్ చేసిన రాజకీయ ఖైదీలు, ఉద్యమకారులు, అదృశ్యమైన వ్యక్తులను 48 గంటల్లోగా విడిచిపెట్టాలని బలోచ్ లిబరేషన్ ఆర్మీ డిమాండ్ చేస్తోంది. లేకపోతే తమ బందీలుగా ఉన్న వారిని చంపేస్తామని బెదిరిస్తోంది. అంతేకాదు.. రైలును కూడా ధ్వంసం చేస్తామని చెబుతోంది.

# కేసీఆర్ పాలనలో ఆర్థిక వ్యవస్థకు క్యాన్సర్



కానీ తాము మాత్రం 55 రోజుల్లోనే నియామకాలు పూర్తి చేశామని రేవంత్ చెప్పుకొచ్చారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన 1292 మంది జూనియర్ లెక్చరర్లకు, 240 మంది పాలిటెక్నికల్ లెక్చరర్లకు రవీంద్ర భారతిలో సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పడిపోవడం ఆందోళనకరమన్నారు. కొత్తగా నియామకమైనవారు తెలంగాణ భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. ఉద్యోగాలపై కోర్టుల్లో చిక్కుముడులు విప్పుతూ సమస్యలు పరిష్కరిస్తున్నా మన్నారు. తెలంగాణలో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలతో గవర్నమెంట్ విద్యాలయాలు పోటీ పడలేకపోవడం బాధాకరం అన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదువు చెప్పే వారికన్నా గవర్నమెంట్ లెక్చరర్లకే ఎక్కువ నాలెడ్జ్ ఉందని.. అయినా రిజల్ట్ వారికంటే తక్కువ రావడంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రైవేట్ సంస్థలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలను తీర్చి దిద్దాలని చెప్పుకొచ్చారు. ఒక ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం వస్తే..ఆ కుటుంబ భవిష్యత్ మారిపోతుందని.. వారి కష్టాలన్నీ తొలగిపోతాయని వివరించారు. భవిష్యత్ లో మరిన్ని నోటిఫికేషన్లు ఇచ్చి తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడటంలో నిరుద్యోగుల పాత్ర కీలకం అని గుర్తు చేశారు.ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న వారికి సీఎం అభినందలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాటల ప్రకారం 57,946 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గర్వంగా చెబుతున్నామన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అయినా మొదటి సంవత్సరంలోనే 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టిన రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అభివృద్ధి పథంలో నడిస్తే భవిష్యత్‌తరాల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగం కూడా ఒక కారణమన్నారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. కేసీఆర్ కుటుంబంలో ఉద్యోగాలు పోవడం వల్లే ఇప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 50 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని గ్రహించాలన్నారు. 55 రోజుల్లోనే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. విద్యార్థులపై ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదని.. అది వారి భవిష్యత్‌కు పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచాలని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మించబోతున్నామన్నారు. ఇటీవలే 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.11000 కోట్లు కేటాయించామని తెలిపారు. విద్యార్థి, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యం ఉండాలన్నారు. ప్రపంచమంతా తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఐటీ, ఫార్మా రంగాల్లో ప్రపంచానికే తెలంగాణ నుంచి ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడలు మన దేశ ప్రతిష్టను పెంపొందిస్తాయని చెప్పుకొచ్చారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామన్నారు. బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామన్నారు. పారాలింపిక్స్ క్రీడాకారిణి దీప్తికి గ్రూప్-2 ఉద్యోగం ఇచ్చామని అన్నారు. కొంతమంది స్ట్రేచర్ స్ట్రేచర్ అని మాట్లాడుతున్నారని.. స్ట్రేచర్ ఉందని విర్రవీగినవారు స్ట్రేచర్ మీదకు వెళ్లారన్నారు. స్ట్రేచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండదని తెలిపారు. కేసీఆర్ తమకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమే అని అన్నారు. ప్రతీ నెలా రూ. 6500 కోట్లు కేసీఆర్ చేసిన అప్పులు తప్పులకే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, సిఎస్ అధికారులు పాల్గొన్నారు.

## డంకీ రూట్‌లో మరో విషాదం

అమెరికాకు వెళ్తున్న ఇద్దరు భారతీయులు గ్వాటెమాలాలో కిడ్నాప్‌కు గురయినట్లు తెలుస్తోంది. వారిని విడిచిపెట్టేందుకు 20 వేల డాలర్లు ఇవ్వాలని కిడ్నాపర్లు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈమేరకు బాధిత కుటుంబాలు వాపోయినట్లు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.కిడ్నాప్‌కు గురైన వారిలో హరియాణాకు చెందిన యువరాజ్ సింగ్ ఒకరు. ఆయన తండ్రి కుల్దీప్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 'నా కుమారుడు అమెరికాకు వెళ్లాలనే ఉద్దేశంతో ఓ ఏజెంట్‌ను సంప్రదించాడు. చట్టపరంగా అక్కడికి వెళ్లేందుకు రూ.41 లక్షలకు డీల్ కుదిరింది. తొలుత రూ.2 లక్షలు చెల్లించగా.. మిగిలినవి ఆ దేశానికి వెళ్లాక చెల్లించాలనేది ఒప్పందం. అయితే, మధ్యలోనే మరో రూ.14 లక్షలు తీసుకున్నారు. అయితే, అమెరికాకు బయలుదేరిన తర్వాత యువరాజ్ నుంచి ఫోన్ కాల్స్ రాలేదు. ఫోన్ నెట్‌వర్క్ లేని ప్రాంతాల నుంచి వెళ్తున్నారని, ఆ దేశం చేరుకున్నాక మాట్లాడవచ్చని ఏజెంట్లు భరోసా ఇచ్చారు.అయితే, గతేడాది డిసెంబరులో కిడ్నాపర్ల నుంచి మాకు ఒక వీడియో వచ్చింది. అందులో కొందరు వ్యక్తులు యువరాజ్‌ను చిత్రహింసలు చేస్తూ గన్ చూపించి బెదిరించారు. అతన్ని విడిచిపెట్టాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు' అని కుల్దీప్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. కిడ్నాప్‌కు గురైన మరో వ్యక్తి పంజాబ్‌లోని హూషియాపూర్ జిల్లాకు చెందినవారు. వారిని విడిచిపెట్టేందుకు 20 వేల డాలర్లు డిమాండ్ చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## మారిషస్ భారత్‌కు కీలక భాగస్వామి

పార్లమెంట్ భవన నిర్మాణానికి భారత్ సహకరించనుంది. ప్రజాస్వామ్యానికి తల్లి వంటి భారత్ నుంచి మారిషస్‌కు ఇదొక కానుకగా భావిస్తున్నాం" అని మోదీ అన్నారు. "పది సంవత్సరాల క్రితం 'సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ది రీజియన్'కు మారిషస్ నుంచే పునాది వేశాం. ఈ ప్రాంత శ్రేయస్సు, స్థిరత్వం కోసం సాగర్ విజన్‌తో ముందుకొచ్చాం. గ్లోబల్ సౌత్ దేశాల కోసం మహాసాగర్ విజన్‌ను ప్రకటిస్తున్నాం. వాణిజ్యం, పరస్పర భద్రత అంశాలపై దానికింద పనిచేస్తాం" అని మోదీ వెల్లడించారు. ఈ ప్రాంతంలో చైనా తన ప్రభావాన్ని విస్తరించేందుకు చేస్తోన్న ప్రయత్నాల నేపథ్యంలో ఈ మహాసాగర్ ప్రకటన వచ్చింది. నవీన్‌చంద్ర రామ్‌గులాం మాట్లాడుతూ.. "నేషనల్ డే వేడుకల్లో భాగంగా ప్రధాని మోదీ మా దేశంలో పర్యటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాం. ఆయన రాక రెండు దేశాల బంధానికి నిదర్శనం" అని అన్నారు. ఇద్దరు ప్రధానుల భేటీ అనంతరం ఈమేరకు సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు.

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్
ఫోన్: 0878-2243438,ఫాక్స్ నం.0878-2240624
Email:knrcmnr@rediffmail.com

'ఈ'-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

NIT No.E1/DB/MCK/8201/207/MCK/2025-26 Dt:13.03.2025

రంజాన్ పండుగ సందర్భంగా ఎఫ్.వై 2025 మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద నాలుగు(4) తాత్కాలిక ఏర్పాట్లు చేయుట.అంచనా విలువ రూ.13.03లక్షలు.బిడ్‌డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ చేయుటకు మొదలు తేది: 13.03.2025 సా॥ 4గం॥ల నుండి. బిడ్ డాక్యుమెట్లు డౌన్‌లోడింగ్‌కు చివరితేది: 20.03.2025 సా॥ 4 గం॥ల వరకు.మిగతా వివరాలకు www.tender.te langana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చును.

సం/- కమిషనర్,మున్సిపల్‌కార్పొరేషన్,కరీంనగర్

DIPR No.11328-PP/CL/ADVT/1/2024-25

దర్శించండి తరించండి

శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము, ధర్మపురి, జగిత్యాల జిల్లా

శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవములు (జాతర) ఆహ్వానము

తేది: 10-03-2025 నుండి 22-03-2025 వరకు అత్యంత వైభవముగా జరుగును

బ్రహ్మోత్సవముల ముఖ్య కార్యక్రమములు

తేది: 10.03.2025 మంగళవారం రోజున "శ్రీ స్వామి వారల కళ్యాణోత్సవములు"
తేది: 14.03.2025 శుక్రవారము రోజున మ.3.00గం.లకు కోనేరు (బ్రహ్మపుష్కరిణిలో) "శ్రీలక్ష్మీ (యోగ) నర్సింహస్వామి వారి తెప్పోత్సవము, డోలోత్సవము"
తేది: 15.03.2025 శనివారము రోజున మ.3.00గం.లకు కోనేరు (బ్రహ్మపుష్కరిణిలో) "శ్రీ ఉగ్ర నర్సింహస్వామి వారి తెప్పోత్సవము, డోలోత్సవము"
తేది: 16.03.2025 ఆదివారం రోజున మ.3.00గం.లకు కోనేరు (బ్రహ్మపుష్కరిణిలో) "శ్రీవేంకటేశ్వరస్వామి వారి తెప్పోత్సవము, డోలోత్సవము"
తేది: 19.03.2025 బుధవారము రోజున మ.3.00గం.లకు "రథోత్సవము"
తేది: 20.03.2025 గురువారము నుండి 22.03.2025 శనివారము వరకు రా.9.00గం.లకు శ్రీ స్వామి వారల ఏకాంతోత్సవములు

ఇట్టి బ్రహ్మోత్సవములలో పాల్గొను ముఖ్య అతిథులు :
గౌ॥ శ్రీమతి కొండ సురేఖ గారు, రాష్ట్రదేవాదాయ-ధర్మాదాయశాఖ మాత్యులు గౌ॥ శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌గారు, ప్రభుత్వవిప్&శాసన సభ్యులు, ధర్మపురి
గౌ॥ శ్రీ గడ్డం వంశీకృష్ణ గారు, పార్లమెంట్ సభ్యులు, పెద్దపల్లి.

గమనిక : బ్రహ్మోత్సవములు (జాతర) సందర్భముగా ప్రతీరోజు స్థానిక ఆర్యవైశ్య సంఘం, వర్తక సంఘం, రైస్ మిల్లర్స్, దాతలు మరియు స్వచ్ఛంద సంస్థలు, భక్తుల సహాయ సహకారములతో ఉచిత అన్నదానము జరుపబడును. ఇట్టి అన్నదానమునకు తమ వంతు ధన, వస్తు రూపేణా విరాళములు చెల్లించి రశీదు పొందగలరని కోరుచున్నాము.

అర్చకులు & సిబ్బంది సహాయ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి (ఎఫ్.ఎ.సి)

జారీ చేసినవారు : స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం.

# కేసీఆర్ పాలనలో అన్ని తప్పులు.. అప్పులు..

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్




హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) : కేసీఆర్ పాలనలో అన్నీ తప్పులు అప్పులే ఉన్నాయని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. దొంగలు, రాబంధువుల లెక్కా తెలంగాణను దోచుకున్నారని, తెలంగాణ కోసం యువత ఆత్మహత్యలు చేసుకుందని, యువకుల బలిదానాలు చూడలేకే కాంగ్రెస్ తెలంగాణను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిందేమీ లేదని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కల్వకుంట్ల కుటుంబం అభివృద్ధిచెందిదే తప్పా...తెలంగాణ ప్రజలు అభివృద్ధి చెందలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 12 నెలల కాలంలోనే అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, రైతుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, అమరుల ఆశలు, ఆకాంక్షలను అమలు పరిచేవిధంగా పనిచేస్తున్నామని తెలిపారు. నిరుద్యోగులకు భరోసా కల్పిస్తూ ఉద్యోగాల నోటిఫికేషన్లు, నియామకం పారదర్శకంగా చేస్తున్నారన్నారు. 12 నెలల కాలంలోనే 55వేల ఉద్యోగాలు కల్పించామని, రైతులకు 21వేల కోట్ల రైతు రుణమాఫీ చేశామని, ఎన్నో ఏళ్లుగా ఏ ప్రభుత్వమూ చేయలేని బీసీ కుల గణనను చేశామని, మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు, ఐదు వందలకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, టీజీపీఎస్సీ పేపర్లు లీకై నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటే...పట్టించుకోని కేసీఆర్ ఎస్ ఎల్ బీసీ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందని తెలిపారు. గవర్నర్ ప్రసంగ సమయంలో ప్రధాన ప్రతిపక్ష సభ్యుల తీరు బాధాకరమన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి, రూల్స్ తెలిసి కూడా వ్యవహరించిన తీరు శోచనీయమని అన్నారు. బీఆర్ఎస్ లో కుటుంబ సభ్యుల మధ్య పోటీ నడుస్తోందని, కేసీఆర్ సభకు రావడంతో ....ఎవరికి వారు ఎక్కువ మార్కులు కొట్టేయాలని మాట్లాడుతున్నారని కొడుకు బిడ్డా అల్లుడు ఎవరికీ వారు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేలు కూడా ఎవరి వర్గం ఎమ్మెల్యేలు వాళ్ల గ్రూప్ గా మార్కులు కొట్టేయడానికి అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని, బాధ్యతాయుతంగా వారికి సర్దిచెప్పాల్సిన కేసీఆర్...మౌనంగా ఉంటూ ప్రోత్సహించడం సరికాదని, కొత్తగా సభకు వచ్చే సభ్యులకు ఏం నేర్పుతున్నారో అర్థం కావడం లేదని అన్నారు.

# మూలాలకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నాం

- సీఎం ప్రజావాణి సక్సెస్ రేటు 66 శాతం
- సీఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగింది
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి
- పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ దివ్య
- ఎంసిఆర్‌హెచ్ఆర్‌డిలో 'సిటిజన్ సెంట్రిక్ గవర్నెన్స్ - ది రోల్ అఫ్ ప్రజావాణి అండ్ ప్రజా పాలన ఇన్ తెలంగాణ' అనే అంశంపై సింపోసియం




హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) : సమస్య మూలాలకు వెళ్లి ఆ సమస్య పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తే సంపూర్ణ ఫలితం లభిస్తుందని, సీఎం ప్రజావాణిలో ఇదే తరహా పద్ధతిని తాము అనుసరిస్తున్నామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి అన్నారు. బుధవారం ఎంసిఆర్‌హెచ్ఆర్‌డిలో 'సిటిజన్ సెంట్రిక్ గవర్నెన్స్ - ది రోల్ అఫ్ ప్రజావాణి అండ్ ప్రజా పాలన ఇన్ తెలంగాణ' అనే అంశంపై జరిగిన సింపోసియంలో చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో సీఎం ప్రజావాణి అధికారులు, సిబ్బంది అంకితభావంతో బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే ప్రజావాణి ఇప్పటివరకు 110 వారాలు పూర్తి చేసుకుందని, ఇప్పటివరకు 92,072 దరఖాస్తు వచ్చాయని, అందులో వివిధ సమస్యలపై 53,303 దరఖాస్తులు రాగా అందులో 35,001 దరఖాస్తులను పరిష్కరించినట్లు చిన్నారెడ్డి వివరించారు. దరఖాస్తులు సక్సెస్ రేటు 66% ఉందని ఆయన తెలిపారు. మిగతా 38,769 దరఖాస్తులు వివిధ పథకాల కోసం రావడంతో వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారులకు పంపినట్లు చిన్నారెడ్డి పేర్కొన్నారు. సీఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని ప్రజావాణి కి వెళితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజల్లో విశ్వాసం కలుగుతోందని ఇది కదా ప్రజాపాలన అని చిన్నారెడ్డి అన్నారు. దరఖాస్తులలో ఎక్కువ శాతం ఇళ్ల కోసం, రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం వస్తున్నాయని, ధరణి లోపాలపై కూడా చాలా దరఖాస్తులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజావాణిలో పకడ్బందీగా సిస్టం ఏర్పాటు చేశామని, శాఖల వారీగా డెస్క్ ఆఫీసర్స్, నోడల్ ఆఫీసర్స్, స్టేట్ నోడల్ ఆఫీసర్, ఆన్లైన్ ద్వారా ఆయా శాఖలకు దరఖాస్తులు పంపించి మానిటరింగ్ చేసే డెస్క్, ట్రాకింగ్ డెస్క్ వ్యవస్థ పనిచేస్తోందని చిన్నారెడ్డి వివరించారు. దరఖాస్తులు తాము స్వీకరించడమే కాకుండా వాటిపై ఎండర్స్మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లేడుతున్నామని చిన్నారెడ్డి తెలిపారు. ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ మాట్లాడుతూ సీఎం ప్రజావాణిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో క్షేత్ర స్థాయిలోనే సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోనున్నట్లు దివ్య పేర్కొన్నారు.

హైడ్రా కమిషనర్ వీ.రంగనాథ్ మాట్లాడుతూ చెరువులు, కుంటలు, నాలాలను చెరబట్టిన వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగిస్తున్నామని, ప్రభుత్వ భూములు, ఆస్తులను కబ్జా చేస్తే సహించేది లేదని రంగనాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ హెడ్ కెప్టెన్ లింగాల పాండురంగా రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవాలకు భిన్నంగా గవర్నర్ ప్రసంగం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ




హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) : ఉభయసభలనుద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం వాస్తవాలకు భిన్నంగా, ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించే విధంగా ఉన్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం సందర్భంగా గవర్నర్ ప్రసంగంపై ఆయన బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆరు గ్యారెంటీల్లో మొదటిది మహిళలకు రు.2500ల అమలు, అదే విధంగా వ్యవసాయ కూలీలకు రు.12000లు, దళిత కుటుంబానికి రు.12 లక్షలు, ప్రతి ఇల్లులేని పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రు.500లకే గ్యాస్ సిలిండర్ ఈసంవత్సరం కూడా అమలు కాని పరిస్థితి కన్పడుతున్నదని, ప్రసంగంలో రెండు లక్షల ఉద్యోగాల ప్రస్తావన లేదని అన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ పూర్తికాలేదపని, విద్యా, వైద్యానికి రంగాల అభివృద్ధిపై స్పష్టత లేదని, రాష్ట్రంలో గత దశాబ్ద కాలంగా 15వేల పరిశ్రమలు మూతపడ్డాయని, వాటిపై ప్రత్యేక దృష్టి పెడదామని గత సంవత్సరం నుండి కేంద్రం, రాష్ట్రం చెపుతున్నప్పటికీ అందుకు తగ్గ చర్యలు లేవని, 13లక్షల మంది రైతులు పాసుపుస్తకాల కొరకూ, తమ భూ సమస్యల పరిష్కార అంశం వివరించలేరని, కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన వాటా, విభజన చట్టం అమలు, ఇచ్చిన హామీల అమలుపై కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు లేకపోయినా కేంద్ర ప్రభుత్వం వైఖరిపై గవర్నర్ ప్రసంగంలో ఎలాంటి ప్రస్తావన లేదని అన్నారు. ధరణిని భూమాతగా పేరు మార్చినా భూ సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీ పేరుతో పెద్ద ఎత్తున మాయజాలాన్ని సృష్టిస్తున్నారని, దావోస్ పర్యటన ద్వారా లక్షా 70వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు వస్తాయని చెబుతున్నారని, వాస్తవానికి అక్కడి రైతుల భూములన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించి, రియల్ ఎస్టేట్ ద్వారా కోట్ల రూపాయలు సంపాదించేట్టుగా ఉందని, వారి భూములను ఆక్రమిస్తుంటే పెట్రోల్ పోసుకుని కలెక్టర్ ఆఫీసు ముందు రైతు ఆత్మహత్యాయత్నం వంటి ఘటనలు రైతుల వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నదని, అందుకే అబ్దుల్ కలాంగారి గురించి చెబుతూ "కలలు కనండి, అవి ఆలోచనలుగా మారుతాయి. అవి కార్యాచరణగా మారుతాయని" చెప్పిదానితో ముగింపు చేసారని, కానీ మన రాష్ట్ర పాలన చూస్తే కలలు కలలుగానే మిగిలిపోయే పరిస్థితి ఉంది తప్ప, శ్రామిక వర్గాలకు, సామాజిక తరగతులకు న్యాయం అభివృద్ధి జరుగుతుందనే స్పష్టత గవర్నర్ ప్రసంగంలో లేదని పేర్కొన్నారు. కనీసం బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంలోనైనా ఈ అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడ్జెట్ ప్రతిపాదనలు చేయాలని డిమాండ్ చేశారు.

# సింగరేణి రిటైర్డ్ కార్మికులకు హైదరాబాద్‌లో ఉచితంగా మందులు

- త్వరలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేయండి
- సీఎండీకి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల విన్నపం

(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)




సింగరేణి రిటైర్డ్ కార్మికులకు హైదరాబాద్‌లో ఉచితంగా మందులు పంపిణీ చేయడానికి అంగీకరించిన యాజమాన్యానికి సీఎండీకి సింగరేణి విశ్రాంత ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సుప్రభాత్ టౌన్ షిప్ లో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞత సమావేశం కు ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లో నివసిస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు నెల వారి మందులు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని యాజమాన్యానికి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులకు పలు మార్లు వినతి పత్రాలు సమర్పించామన్నారు. ఇందుకు ఈ నెల 7న హైదరాబాద్‌లో సింగరేణి భవన్‌లో యాజమాన్యంతో జరిగిన స్థాయి, నిర్మాణత్మక సమావేశంలో గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)గౌరవాధ్యక్షులు సీపీఐ శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు,అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య,ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పై అంశం చర్చించినారు.ఇందుకు సింగరేణి యాజమాన్యం సమ్మతించి హైదరాబాద్‌లోనే మందులు ఇచ్చే ఏర్పాట్లు చేస్తామని, అదే విధంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తామని హామీ ఇచ్చింది, ప్రస్తుతం సింగరేణి ఏరియా హాస్పిటల్ లో చికిత్స చేసుకున్న వారికి మెడికల్ కార్డు నగదు నిల్వ నుంచి 40% కోత విధిస్తున్నారు. ఈ విధానం రద్దుకు అంగీకారం కుదిరిందని ఏఐటీయూసీ నాయకులు చెప్పడం జరిగింది. ఇందుకు సమ్మతించిన సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం కు, ఏఐటీయూసీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. కావున వెంటనే హైద్రాబాద్ నగరం లో ఉచిత మందులు, హాస్పిటల్ నిర్మాణం కొరకు ఉత్తర్వులు జారీ చేసి త్వరితగతిన అమలు పరచాలని విన్నవించుకున్నారు. ఈ క్రింది సమస్యలను కూడా పరిష్కరించాలని తీర్మానం చేయడం జరిగింది..అతి తక్కువ పెన్షన్ పొందుతున్న సింగరేణి విశ్రాంత కార్మికులకు తెల్ల రేషన్ కార్డుల మంజూరు కొరకై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలి. సింగరేణి ప్రాంతాల్లో నివసిస్తున్న విశ్రాంత కార్మికులను ఖాళీగా ఉన్న క్వార్టర్స్ లో నివసించేందుకు అనుమతి ఇవ్వాలి. హైదరాబాద్ నివసిస్తున్న విశ్రాంత కార్మికులకు ఆఫీస్ నిర్మించాలి.సింగరేణి విశ్రాంత కార్మికులకు స్వంత ఇంటి నిర్మాణం కొరకు 200 గజాల స్థలం కేటాయించాలి. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య, సంయుక్త కార్యదర్శి గీస కనకయ్య, ఎస్.లక్ష్మీ నారాయణ, కొట్టే మల్లయ్య, ఎం.రాజ నర్సు, చుక్కల నర్సయ్య, ప్రతాప్ సింగ్, సర్జిత్ సింగ్, బాల్ రెడ్డి, రఫిక్, రాచ కట్ల పోశం, బంగారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# శ్రీచైతన్యలో మూడోరోజూ దాడులు

హైదరాబాద్, మార్చి12 (జనంసాక్షి) : శ్రీ చైతన్య విద్యా సంస్థలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు మూడో రోజూ కొనసాగా యి. విద్యా సంస్థల అధినేత బొప్పన సత్యనారా యణ రావు, ఆయన కుటుంబసభ్యుల నివాసాల్లో ఐటీ అధికారుల సోదాలు జోరుగా సాగాయి. ముఖ్యంగా ఆయన కుమార్తెలైన బొప్పన సుష్మ, బొప్పన సీమ ఇళ్లలో కూడా ప్రత్యేక దర్యాప్తు జరుగుతోంది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 32, రోడ్ నెంబర్ 10లో ఉన్న బొప్పన సుష్మ, బొప్పన సీమ నివాసాల్లో ఐటీ అధికారులు మరింత తీవ్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్రమ ఆర్థిక లావా దేవీలకు సంబంధించి కీలక ఆధారాలను సేకరిం చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇది ఇలా ఉండగా, సోదాల సమయంలో ఇద్దరు డైరెక్టర్లు అందుబాటులో లేకపోవడం గమనార్హం. వారిరి వురు వచ్చిన తర్వాత ఐటీ శాఖ మరోసారి వారి నివాసాల్లో తనిఖీలు నిర్వహించే అవకాశ ముందని సమాచారం. విద్యా సంస్థల ద్వారా ఆదాయపు పన్ను మోసం చేసి, ఆ నిధులను మరొకచోటికి మళ్లించారని అనుమానం నేపథ్యం లో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఈ నేప థ్యంలో వారి ఆస్తులపై మరిన్ని దర్యాప్తులు కొనసాగ నున్నట్లు తెలుస్తోంది. విద్యా రంగంలో పేరొందిన సంస్థపై ఈ స్థాయిలో ఐటీ దాడులు జరగడం గమనార్హం. అధిక మొత్తం లో ఆదాయపు పన్ను ఎగవేశారని, ఆ నిధులను ఇతరత్రా మార్గాల్లో మళ్లించారని అనుమానంతో అధికారులు జాగ్రత్తగా అన్ని లావాదేవీలను పరిశీలిస్తున్నారు. సోదాల అనం తరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# మోహన్‌బాబుతో మాకెలాంటి భూ లావాదేవీలు లేవు

- సౌందర్య ఆస్తులతో మంచు కుటుంబానికి సంబంధం లేదు
- ఆరోపణలను తోసిపుచ్చిన సౌందర్య భర్త రఘు



హైదరాబాద్, మార్చి12 (జనంసాక్షి) : సినీ నటులు మంచు మోహన్ బాబు, సౌందర్య ఆస్తి వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్ జల్‌పల్లిలోని మోహన్ బాబు నివాసానికి సంబంధించిన ఆరు ఎకరాల భూమిని సౌందర్య నుంచి ఆయన అక్రమంగా లాక్కున్నారని, అలాగే సౌందర్యను మోహన్ బాబు హత్య చేయించారంటూ ఖమ్మం జిల్లా పోలీసులకు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. ఈ వార్త ఇప్పుడు పెను సంచలనం సృష్టిస్తోంది. అయితే దీనిపై సౌందర్య భర్త రఘు స్పందించారు. సౌందర్య మరణంలో మోహన్ బాబు లేదని, తమ ఆస్తిని ఆయన లాక్కున్నారనే ఆరోపణలను రఘు ఖండించారు. హైదరాబాద్‌లోని ఆస్తి విషయమై కొన్ని రోజులుగా తప్పుడు వార్తలు వస్తున్నాయని ఆయన అన్నారు. అవన్నీ నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేశారు. తన భార్య సౌందర్య నుంచి మోహన్ బాబు అక్రమంగా పొందిన ఆస్తి ఏదీ లేదని రఘు తేల్చి చెప్పారు. తనకు తెలిసినంత వరకూ మోహన్ బాబుతో తాము ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపలేదని స్పష్టం చేశారు. మోహన్ బాబుతో తమకు 25 ఏళ్లుగా బలమైన మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. తన భార్య, బావ, అలాగే ఇరుకుటుంబాలు ఎల్లప్పుడూ సత్సంబంధాలు కలిగి ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ఆస్తి వ్యవహారంలో జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని, తమ నుంచి ఆయన ఎలాంటి ఆస్తులూ స్వాధీనం చేసుకోలేదని మరోసారి సుస్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేయె?ద్దని కోరుకుంటున్నట్లు రఘు విజ్ఞప్తి చేశారు. కాగా, 17 ఏప్రిల్ 2004న లోక్ సభ ఎన్నికల ప్రచారానికి హెలికాప్టర్‌లో వెళ్తూ ప్రముఖ నటి సౌందర్య చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో సౌందర్య సోదరుడు అమర్నాథ్ సైతం ప్రాణాలు కోల్పోయారు. అయితే తాజాగా ఖమ్మం జిల్లా ఏదులాపురానికి చెందిన ఎదురుగట్ల చిట్టిమల్లు అనే వ్యక్తి ఖమ్మం కలెక్టర్, రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్ జల్‌పల్లిలో సౌందర్యకు ఆరు ఎకరాల్లో ఎస్టేట్ ఉందని, దాన్ని అమ్మాలని మోహన్ బాబు ఆమెపై ఒత్తిడి తెచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనికి సౌందర్య ఒప్పుకోకపోవడంతో సాక్ష్యాలు దొరక్కుండా హత్య చేయించారని ఆరోపించాడు. వెంటనే మోహన్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ ఫిర్యాదు చేశాడు.

# గవర్నర్ ప్రసంగం అంటే గౌరవం లేదా?

- బిఆర్ఎస్ నేతల తీరు దుర్మార్గం
- మండిపడ్డ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



హైదరాబాద్,మార్చి12(ఆర్ఎన్ఎ): వర్నర్ ప్రసంగాన్ని అవహేళన చేయడం తగదని, కనీసం గవర్నర్ ప్రసంగాన్ని గౌరవించే సంస్కృతి కూడా బీఆర్ఎస్ నేతలకు లేకుండా పోయిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, బీఆర్ఎస్ నేతల తీరును తీవ్రంగా విమర్శించారు. గబీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి ముందుగా అసెంబ్లీకి హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రభుత్వ విప్ సూచించారు. ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవడం లేదని, వారు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఆయన పేర్కొన్నారు. ప్రజలు వారి తీరును గమనిస్తున్నారని, విపక్షంగా వారు సరిగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని ఐలయ్య పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన వంటి కీలక నిర్ణయాలతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అయితే, ఈ కులగణనలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు పాల్గొనకపోవడం దుర్మార్గమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టు పేరు మీద భారీగా కమిషన్లు దండుకున్నారని బీర్ల ఐలయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తుందని, గత 10 ఏళ్ల పాలనలో బీఆర్ఎస్ మిగిల్చిన అప్పులను తగ్గించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో లక్ష రూపాయలు కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, కొత్త పథకాలను రూపొందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చినట్లు బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. పింక్ పార్టీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారాన్ని ఆపాలని, రేవంత్ రెడ్డి తీసుకుంటున్న అభివృద్ధి చర్యలను అడ్డుకోవడం బీఆర్ఎస్ ఆలోచనగా మారిందని అన్నారు. తెలంగాణ సచివాలయంలో రాష్ట్రం తల్లికి స్మారకంగా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని, కానీ కేసీఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ప్రతి అంశంలో కమిషన్ల కోసం పనిచేసిన బీఆర్ఎస్ ఇప్పుడు అనవసరమైన ఆరోపణలు చేస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు, అవినీతి, పాలనలో చేసిన పొరపాట్లను సీఎం రేవంత్ రెడ్డి సరిదిద్దుతున్నారని బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ అసలు రూపాన్ని అర్థం చేసుకుని, రాబోయే రోజుల్లో సరికొత్త పాలన కోసం సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# సోషల్ మీడియాలో రేవంత్‌పై దుష్ప్రచారం

- ఇద్దరు యూట్యూబర్లను అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్, మార్చి12 (జనంసాక్షి) : సామాజిక మాధ్యమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన ఇద్దరు యూట్యూబర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను సైబర్ క్రైమ్ అదనపు సీపీ విశ్వప్రసాద్ మీడియాకు వెల్లడించారు. 'నిప్పు కోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో సీఎంను తిడుతున్న వీడియో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ ఫిర్యాదు చేశారు. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తు తెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేశారు. అందులో మాట్లాడిన వ్యక్తి సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పల్స్ టీవీ ఉద్దేశ పూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించిందని దర్యాప్తులో గుర్తించాం. పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను 'నిప్పుకోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేశారు. కేసు దర్యాప్తు చేసి ఆ టీవీ ఛానెల్ సీఈవో, జర్నలిస్ట్ రేవతితో పాటు పల్స్ టీవీ ప్రతినిధి బండి సంధ్య అలియాస్ తన్వి యాదవ్‌ను అరెస్ట్ చేశాం. టీవీ కార్యాలయంలో సోదాలు నిర్వహించి రెండు ల్యాప్ టాప్‌లు, రెండు హార్డ్ డిస్క్‌లు, ఒక లోగో, ఒక రూటర్, 7 సీపీయూలు స్వాధీనం చేసుకున్నాం. రేవతిపై గతంలో బంజారాహిల్స్, ఎల్‌బీనగర్‌లో కేసులు ఉన్నాయి' అని అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు.

# ఆత్మహత్య కు యత్నించిన యువకుడిని కాపాడిన మట్టేవాడ పోలీసులు



వరంగల్ ఎంజీఎం, మార్చి 12(జనంసాక్షి): ఎల్లం బజారుకు చెందిన ఓ వ్యక్తి వ్యక్తిగత సమస్యలతో రెండంతస్తుల భవనం పైకి చేరుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా మట్టేవాడ పోలీసులు ఆ వ్యక్తిని కాపాడారు. వివరాలలోకి వెళితే వరంగల్ పట్టణంలోని ఎల్లం బజార్ కు చెందిన కట్టుకోజు శివకుమార్ అనే వ్యాపారి వ్యక్తిగత సమస్యల వల్ల, ఎల్లం బజార్ లోని, ఆదర్శ వీధి గల మహబూబ పంచధన్ కాలేజీ ఎదురుగా ఉన్న రెండంతస్తుల బిల్డింగ్ పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా స్థానికులు వెంటనే డైల్ హండ్రెడ్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకున్న మట్టేవాడ బ్లూ కోర్టు సిబ్బంది ఆ వ్యక్తిని బిల్డింగ్ పై నుంచి కిందికి దించి రక్షించి, సురక్షితంగా తన కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. దీంతో నగర ప్రజలు మట్టేవాడ పోలీసు సిబ్బందిని మరియు ఫైర్ సిబ్బందిపై హర్షం వ్యక్తం చేశారు.

# ఐటీ ఉద్యోగుల శ్రమ దోపిడీతో- కార్పోరేట్ల సంపద పెంచాలా!?

భారత ఐటీ రంగం దశాబ్దాలుగా కార్మిక సంఘాల ప్రభావం తక్కువగా ఉన్న రంగంగా కొనసాగింది. అయితే, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి సూచించిన 70 గంటల పని వారం, ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ 90 గంటల పని వారం పిలుపునివ్వడం అనేక ఉద్యోగులను ఆందోళనలో ముంచేసింది. ఇప్పటికే అధిక పని ఒత్తిడితో జీవనం కొనసాగిస్తున్న ఉద్యోగులు, మరింత అదనపు పని వేళలను కంపెనీలు బలవంతంగా అమలు చేయాలని చూస్తుండటంతో వారిలో వ్యతిరేకత పెరిగింది.

ఈ నిరసనలు బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్ నుంచి ప్రారంభమయ్యాయి. "మేం మీ బానిసలం కాదు" అంటూ ఉద్యోగులు గళమెత్తగా, కార్మిక సంఘం సీఐటీయూ వారికి మద్దతుగా నిలిచింది. దీని ప్రభావం క్రమంగా దేశవ్యాప్తంగా వ్యాపించే అవకాశం ఉంది. కంపెనీల అధిపతులు తమ లాభాల కోసం పని గంటలను పెంచాలని కోరుతున్న సమయంలో, ఐటీ ఉద్యోగులు తమ హక్కులను రక్షించుకునేందుకు కొత్తగా ఉద్యమ బాట పట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 'లేబర్ కోడ్‌లు - ఉద్యోగులకుపై ప్రభావం**

భారత ప్రభుత్వం కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని నిర్ణయించింది. ఇవి పని నిబంధనలు సులభతరం చేస్తాయని పైకి చెప్పుతున్నా, అసలు విషయం కంపెనీలకు మరిన్ని అధికారాలు కల్పించేలా ఆ కోడులలో (చట్టాలు)లో ఉంది.

**కోడ్ ఆన్ వేజెస్, 2019 :**

కనీస వేతనాల నియంత్రణకు ఉద్దేశించిన చట్టం.

**ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, 2020:**

నియామకం, తొలగింపు, కార్మిక సంఘాల ఏర్పాటు వంటి అంశాలను నియంత్రిస్తుంది.

**ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండీషన్స్ కోడ్, 2020 :**

పని గంటలు, ఉద్యోగుల సంక్షేమం గురించి చెప్పిన చట్టం.

**కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ, 2020 :**

పింఛన్లు, బీమా, ఉద్యోగ భద్రత అంశాలను కలిగి ఉంది. ప్రభుత్వం వీటిని కార్మికుల పక్షపాతంగా చిత్రిస్తున్నప్పటికీ, నూతన నియమాలు ఉద్యోగులను




రక్షించేట్టు కాకుండా, కంపెనీలకు మరిన్ని అవకాశాలు కల్పించేవిగా ఉన్నాయి. ముఖ్యంగా పనిగంటలు పెంచడాన్ని వీటిలో గట్టిగా ఆపే అంశం లేదు.

**పని గంటలు పెరుగుతాయా? ఉద్యోగ భద్రత తగ్గిపోతుందా?**

కొత్త శ్రామిక చట్టాల ప్రకారం పది నుండి పన్నెండు గంటల షిఫ్టులు సాధారణంగా అమలు చేయడానికి అవకాశం ఉంది. ఇది ఉద్యోగులపై మరింత ఒత్తిడిని పెంచుతుంది. కంపెనీలు 70-90 గంటల పని వారం ను అమలు చేయడానికి వీలుగా కొత్త చట్టాల ఖచ్చితమైన నిరోధకత లేకపోవడం కంపెనీలకు కలిసొచ్చే అంశం. 300 మందికి లోపు ఉద్యోగులు ఉన్న సంస్థలు ప్రభుత్వ అనుమతి లేకుండా ఉద్యోగులను తొలగించేందుకు వీలుగా ఈ చట్టంలో ఉంది. కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య పెరిగే అవకాశముంది, దీని వల్ల కంపెనీలు శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించకుండా తప్పించుకునే అవకాశం ఉంటుంది.

**కార్మిక సంఘాలకు కొత్త అవరోధాలు:**

భారత కార్మిక చట్టాలలో కొత్తగా మార్పులు వచ్చిన నేపథ్యంలో, ఐటీ రంగంలో కార్మిక సంఘాల ఏర్పాటుపై కొత్త కఠిన నిబంధనలు వచ్చాయి. సంస్థలో అదనంగా 51 శాతం మంది మద్దతు ఉంటేనే యూనియన్ యాజమాన్యం గుర్తింపు పొందుతుంది, ఇది యాజమాన్యానికి అనుకూలంగా ఉంది. యాజమాన్యం ఉద్యోగులను "మేనేజర్" లేదా "సూపర్వైజర్" గా వర్గీకరిస్తే, వారు కార్మిక సంఘ సభ్యత్వ అర్హత పొందలేరు. నిరసనలు చేపట్టే ముందు కనీసం 60 రోజుల ముందు కంపీనీకీ నోటీసు ఇవ్వాలి. కంపెనీ నిర్ణయం కొరకు తగిన సమయం ఇచ్చి ప్రతిస్పందన కొరకు ఎదురుచూడాలి, దీని వల్ల ఏదైనా హఠాత్తుగా కంపెనీ లో సమ్మె చేపట్టడం కష్టం. ఈ నిబంధనలు ఐటీ ఉద్యోగుల్ని సంస్థల కఠిన నియంత్రణలోకి తేవడానికే దోహదం చేస్తాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని ఎలా ఎదుర్కొంటుంది?**

ప్రస్తుతం ఐటీ రంగంలో కార్మిక ఉద్యమం వేగంగా వ్యాప్తి చెందుతుండటం తో, భాజపా ప్రభుత్వం దీన్ని ఎలా ఎదుర్కొంటుందన్న ప్రశ్న ఉత్పన్నమైంది. కార్పొరేట్ మద్దతు వర్సెస్ ప్రజాస్వామిక వ్యతిరేకత - ప్రభుత్వ విధానాలు పెద్ద సంస్థలకు మేలు చేసే విధంగా ఉన్నప్పటికీ, ఉద్యోగుల నిరసన దీన్ని సమర్థించడం కష్టతరం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు - ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఈ ఉద్యమాన్ని అణిచివేయడానికి పోలీసులు జోక్యం చేసుకునే అవకాశం ఉంది.

**తాత్కాలిక నిబంధనలు అమలు చేయడం:**

నిరసనలు తగ్గించేందుకు, తాత్కాలిక ఉపశమనం కల్పించేలా కొన్ని సవరణలు చేయవచ్చు, కానీ పని ఒత్తిడిని తగ్గించేలా ప్రధాన మార్పులు రావటానికి అవకాశాలు లేవు.

**శ్రమదోపిడికి వ్యతిరేకంగా పెరుగుతున్న ఉద్యమం**

ఈ నూతన పరిస్థితుల దృష్ట్యా, ఐటీ ఉద్యోగులు కొన్ని మార్గాలను అన్వేషించవచ్చు:

**ఇంటర్నెట్ ద్వారా ఉద్యమానికి బలం చేకూర్చడం :**

ఉద్యోగులు సామాజిక మాధ్యమాలను ఉపయోగించి తమ నిరసనను విస్తృతంగా వ్యాప్తి చేయవచ్చు

ఐటీ రంగానికి ప్రత్యేకంగా కొత్త యూనియన్లు ఏర్పడే అవకాశం:

ప్రస్తుతం ఉన్న కార్మిక సంఘాలతో పాటు, ప్రత్యేకంగా ఐటీ ఉద్యోగుల హక్కులను కాపాడేందుకు కొత్త యూనియన్లు రావచ్చు. కోర్టుల ద్వారా వ్యతిరేకత వ్యక్తీకరణ - కొన్ని కంపెనీలను కోర్టులోకి తీసుకెళ్లి ఉద్యోగుల హక్కులను రక్షించేందుకు ప్రయత్నాలు జరుగవచ్చు.

**డా. సౌమ్యా స్వామినాథన్ వ్యాఖ్యలు:**

ఇటీవల ఎం.ఎస్. స్వామినాథన్ కుమార్తె డా.సౌమ్యా స్వామి నాథన్ మాట్లాడుతూ, పని గంటలు పెంచడం వల్ల ఉద్యోగుల ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. "పని మరియు విశ్రాంతి అనేవి ఒకదానికొకటి అనుసంధానంగా ఉంటాయి. విశ్రాంతి లేకుండా ఏ ఉద్యోగి సుదీర్ఘంగా నాణ్యతతో పని చేయలేడు. ఒక పరిశ్రమలో నాణ్యతా ఉత్పత్తి రావాలంటే, ఉద్యోగులకు ఆరోగ్యకరమైన పని వాతావరణం కల్పించాలి. వాళ్లను యంత్రాల్లా కాకుండా, మనుషుల్లా చూడాలి," అని ఆమె స్పష్టం చేశారు.


భారత ఐటీ రంగం ఇప్పుడు కీలక మలుపులో ఉంది. కొత్త లేబర్ కోడ్‌ల(చట్టాలు) కారణంగా ఉద్యోగుల హక్కులు మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అయితే, బెంగళూరులో ప్రారంభమైన ఈ నిరసనలు దేశవ్యాప్తంగా కార్మిక చైతన్యాన్ని పెంచే అవకాశముంది.

ప్రభుత్వం, కంపెనీలు కలిసి ఉద్యోగుల పని ఒత్తిడిని మరింత పెంచే విధానాలను ప్రోత్సహిస్తే, దీనికి వ్యతిరేకంగా ఉద్యోగుల ఐక్యత మరింత బలపడే అవకాశం కూడా ఉంది. పని గంటల పెంపు వ్యతిరేక ఉద్యమం ఐటీ రంగంలో కార్మిక సమూహాలను ఏకతాటిపైకి తెచ్చే మార్గంగా మారుతుందా? లేదా? అనేది రాబోయే కాలం నిర్ణయించనుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# ధీరవనిత "కెప్టెన్ రీనా వర్గీస్"



అదొక మావోయిస్టుల ఉనికి ఉండే అత్యంత కఠినమైన దండకారణ్యం. సాధారణంగా దండకారణ్యంలోకి అడుగు పెట్టాలంటేనే ఒకరకమైన వణుకు పుడుతుంది. అందులోనూ అది నక్సల్స్ ప్రభావిత ప్రాంతం. ఏ క్షణాన ఎటువైపునుండి తూటాల వర్షం కురుస్తుందో తెలియని అతి భయంకరమైన ప్రాంతమది. మహారాష్ట్ర-చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టుల కీలక స్థావరం అయిన అబుజ్‌మర్ ప్రాంతం 21 అక్టోబర్ 2024న మావోయిస్ట్ మరియు పోలీసుల మధ్య ఉద్రిక్త వాతావరణంలో కాల్పులతో ఎనిమిది గంటలపాటు దద్దరిల్లిపో యింది. ఆ కాల్పుల్లో క్షతగాత్రుడైన C-60 కమాండో శరీరంలోకి మూడు బుల్లెట్లు దూసుకుపోగా, తీవ్ర రక్త స్రావంతో మూడు గంటల పాటు కొట్టుమిట్టాడుతున్న ఆయనను ధైర్యవంతురాలైన మహిళా హెలికాప్టర్ పైలట్ భూమికి కేవలం 11 అడుగుల ఎత్తులో హెలికాప్టర్ నిలిపి అందులో నుండి దూకి సమయస్ఫూర్తితో, అత్యంత సాహసోపేతంగా ఆ కమాండో ప్రాణాలను కాపాడింది. ఆ ధీరవనిత పవన్ హన్స్ హెలికాప్టర్ పైలట్ "కెప్టెన్ రీనా వర్గీస్" నిబద్ధతను మరియు అసామాన్య ధైర్యాన్ని చూసి దేశం గర్విస్తోంది.

బూబీ-ట్రాప్డ్ మావోయిస్టు ప్రధాన కార్యాలయమైన అబుజ్‌మర్ ముట్టడిలో అక్టోబర్ 21, 2024 న పక్కా వ్యూహంతో పోలీస్ శిబిరాలను చుట్టుముట్టిన మావోయిస్టులు రాకెట్ లాంచర్లతో దాడులు, బాంబుల మోతతో అటవీ ప్రాంతం దద్దరిల్లింది. ఆ భీకరపోరులో C-60 కమాండో శరీరంలోకి మూడు బుల్లెట్లు దిగడంతో తీవ్ర రక్తస్రావంతో మూడు గంటలపాటు అడివిలో ఎలాంటి సదుపాయంలేక తీవ్రగాయాలతో నరకయాతన అనుభవిస్తూ ప్రాణాపాయస్థితిలో ఉన్న కమాండోను కాపాడుకునేందుకు అన్నివిధాలా ప్రయత్నం చేసినప్పటికీ సీఆర్పీఎఫ్ బలగాలకు అండగా బ్యాకప్ ఫోర్స్ రాకుండా ఉండేందుకు అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు చెట్లను నరికి రోడ్డుపై అడ్డంగా వేశారు. ఎటువెళ్లలేని పరిస్థితి కావడంతో, ఆ సమయంలో తోటి జవాన్లు అత్యవసర SOSకి కాల్ చేశారు. కెప్టెన్ వర్గీస్ SOS కాల్‌కు స్పందించి, తన సిబ్బందితో కలిసి గడ్చిరోలి నుండి తన 13 సీట్ల డాఫిన్-ఎన్ పవన్ హన్స్ హెలికాప్టర్‌ను పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (PLGA) 100 కి.మీ దూరంలో ఉన్న ప్రమాదస్థలానికి 35 నిమిషాల్లో చేరుకుంది. అటవీ ప్రాంతంలో గాయపడిన కమాండో ను వెతకడం ఎంతో ఇబ్బందికరం గా ఉన్నప్పటికీ కెప్టెన్ వర్గీస్ ప్రాణాంతక పరిస్థితులలో భూమి కి చాల తక్కువ ఎత్తులో నావిగేట్ చేస్తూ గాయపడిన జవాన్ ఆచూకీ కనిపెట్టింది. దట్టమైన అడవిలో లాండి ంగ్ చేసే అవకాశం లేదు. ఒకవైపు మావోయిస్టుల కాల్పులు మరోవైపు పోలీసు ల కాల్పుల మధ్య గాయపడిన కమాండో ను హెలికాప్టర్ లోకి ఎక్కించడం అసాధ్యమని భావించింది. ఎలాగైనా జవాన్ ప్రాణాలు రక్షించాలనే సంకల్పంతో తన కో పైలట్ సహాయంతో కాప్టర్‌ను భూమికి వీలైనంత దగ్గరగా దించి కాప్టర్ భూమికి కేవలం 11 అడుగుల ఎత్తులో తిరుగుతుండగా ఆమె కాక్‌పిట్ నుండి దూకింది. కమాండోల సహాయంతో గాయపడిన జవాన్‌ను హెలి కాప్టర్‌లోకి వేగంగా ఎత్తగలిగారు. ప్రమాదస్థలం నుండి కేవలం 30 నిమిషాల్లోనే గడ్చిరోలికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఆతర్వాత మెరుగైన వైద్యం కోసం, అక్కడి నుంచి నాగ్‌పూర్‌కు తరలించారు. తీవ్ర రక్తస్రావం అయినప్పటికీ సరైన సమయంలో హాస్పిటల్ కి చేర్చడంతో కమాండో ప్రాణాలతో బయటపడ్డాడు. అంతేకాకుండా ఆమె ఓఖీ విపత్తు సమయంలో కూడా సహాయక చర్యలు చేపట్టడం గర్వించదగిన విషయం. కోవిడ్ కాలంలో లక్షద్వీప్ నుండి చాలా మందిని విమానంలో తరలించడంలో కూడా ఆమె సహాయపడింది.


ప్రమాదకరమైన ప్రాంతాల్లో హెలికాప్టర్ కార్యకలాపాలు అంత సులభం కాదన్న విషయం మనందరికీ తెలిసిందే, ఆమె ధైర్యసాహసాలు ప్రదర్శించి కమాండో ప్రాణాన్ని కాపాడిన ధీర వనితగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లో కెప్టెన్ రీనాను సత్కరించారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కూడా ఆమె సాహసోపేత సేవను అభినందించారు.

కూంబింగ్ ఆపరేషన్ లలో పురుషులు మాత్రమే కాదు మహిళలు కూడా ధైర్యంగా పోరాడగలగడంతో పాటు ప్రాణాపాయస్థితిలో కాపాడగలరనే విషయాన్నీ "కెప్టెన్ రీనా వర్గీస్" నిరూపించారు. భయమే అత్యంత క్రూరమైన శత్రువు. భయంతో వేసే ప్రతి అడుగు వెనక్కి పడుతుంది గానీ ముందుకు పోలేము. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే వారికి ఏదైనా సాధ్యమే.



కోట దామోదర్
మొబైల్: 9391480475

## కవితల కోసం



కమ్మని కవితను రాయమని
ఎన్ని ఆలోచనలు
వెంటబడుతున్నాయో
తియ్యని కవితను కూర్చమని
ఎన్ని భావాలు
తలనుతడుతున్నాయో
మంచి కవితను
సృష్టించమని
ఎన్ని అక్షరముత్యాలు
చెంతకొస్తున్నాయో
గొప్ప కవితను అల్లమని
ఎన్ని పదాలు ప్రాధేయపడుతున్నాయో
కవితాసౌరభాలు వెదజల్లమని

ఎన్ని పూలు ప్రేరేపిస్తున్నాయో
రంగులకవితను రచించమని
ఎన్ని హరివిల్లులు దర్శనమిస్తున్నాయో
ముచ్చటయిన కవితను వెల్లడించమని
ఎన్ని మాటలు మదినిముట్టుతున్నాయో
చక్కని కవితను సమకూర్చమని
ఎన్ని గళాలు కోరుతున్నాయో

కవితలలో వెలుగులు ప్రసరించమని
ఎన్ని దీపాలు వెలిగించమంటున్నాయో
తేటతెలుగు కవితను లిఖించమని
ఎన్ని మాటలు ముందుకొస్తున్నాయో

విడవక కైతలను వ్రాస్తా
వివిధ మాధ్యమాలకు పంపిస్తా
తప్పక కవనాలు అందిస్తా
పాఠకుల మదులలో నిలిచిపోతా

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం



## మాట్లాడే మిత్రులు

బడిలోజి
పెన్నుల్ని పోగొట్టుకున్నాను
పుస్తకాల్ని పోగొట్టుకున్నాను
బస్సుల్లో.. పర్సుల్ని పోగొట్టుకున్నాను
టిఫిన్ బాక్సుల్ని పోగొట్టుకున్నాను
దళారుల చేతుల్లో
ప్లాట్లని పోగొట్టుకున్నాను
దాయాదుల పోరుల్లో
ఇళ్లను పోగొట్టుకున్నాను..కానీ
మాట్లాడే మిత్రుల్ని
అక్కున చేర్చుకునే అప్తుల్ని
పోగొట్టుకోలేదు

కోటం చంద్రశేఖర్ 9492043348

*నవజాత శిష్యులకు డైపర్ దొరకని పరిస్థితిని ఇజ్రాయిల్ గాజాలో సృష్టిస్తున్నది. జనవరి నుంచి యుద్ధ విరమణను పాటిస్తున్నామన్నటే గాని అక్కడక్కడ బాంబుల చప్పుడు ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి ఎందుకు సంబంధించి గాజా వెస్ట్ బ్యాంకు ప్రాంతంలో సైనిక దాడులు జరుగుతున్న దాఖలాలు ఉన్నాయి. శుక్రవారం జరిగిన ఒక దాడిలో ముగ్గురు పాలస్తీనీయులు మరణించారు. ఇక్కడ ఇజ్రాయిల్ అవమానవీయంగా వ్యవహరి స్తున్నది. మానవత్వం అనేది పూర్తిగా లేకుండా పోయింది. మానవీయ సహాయాన్ని పూర్తిగా నిలిపివేసే విధంగా సైనిక చర్యలు ఉంటున్నాయి. సహాయం అందకుండా ఇజ్రాయిల్ సైనికులు అడ్డుకుంటున్నా రు. దీనిపై ఆంక్షలు విధిస్తున్నారు.*





# గాజాలో ఆగని.. ఇజ్రాయిల్ ఆగడాలు!

అల్ జజీరా రిపోర్టు ప్రకారం పాలసీనులపై ఇజ్రాయిల్ సైనికులు దౌర్జన్యం చేయడం ఇంకా ఆగలేదు. అక్కడ పనిచేస్తున్న ఒకే ఒక పవర్ ప్లాంట్ లైన్‌ను కూడా నిలిపివేసి విద్యుత్ లేకుండా చేశారు అంతేకాదు ఈ ప్లాంట్ వల్ల మంచినీటి సౌకర్యం కలిగేది ఆ సౌకర్యం కూడా కలగకుండా అడ్డుకున్నారు మంచినీటి శుద్ధి యంత్రాలు పనిచేయకుండా అయ్యాయి. మిడిల్ లిస్టు మొత్తం తన ఆధిపత్యంలోకి తీసుకొని రావడానికి ప్రయత్నాలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఉక్రెన్ యుద్ధ విరమణకు సిద్ధంగా ఉంది రష్యా చర్చలకు రావాలని కోరడం జరిగింది. మరోవైపు హమాస్తో ఇజ్రాయిల్ రెండో విడత చర్చలు కూడా ఖతర్లో జరుగుతున్నాయి. అక్కడికి అమెరికా ప్రతినిధి కూడా వెళ్లడం జరిగింది. మొత్తంగా అటు ఉక్రెయిన్ రష్యా గాజా ఇజ్రాయిల్ లలో తను చేయబట్టి యుద్ధం ఆగిందని పేరు రావాలనే ఉద్దేశంతో అమెరికా ఖతర్కు ప్రతినిధిని పంపడం జరిగింది.

**ప్రపంచ షేర్ మార్కెట్ ఔట్!**

ప్రపంచంలో ఇప్పటికే షేర్ మార్కెట్ దారుణంగా పడిపోయింది 23 కోట్ల భారతీయ షేర్ మార్కెట్లో డబ్బులు పెట్టిన వారంతా ఇప్పుడు ఆందోళన పడుతున్నారు. దాదాపు 90 లక్షల కోట్లు షేర్ మార్కెట్లో వీరంతా నష్టపోగా అమెరికాలో సైతం ఇంతకు మూడింతలు నాలుగింతలు షేర్ మార్కెట్ 350 లక్షల కోట్ల నష్టాన్ని చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారతదేశ మార్కెట్ దాదాపు తొమ్మిది శాతం పడిపోయింది. అటు ట్రంప్ సమీప ఎలాంటి టెస్లా కారు ను పూర్తిగా ప్రపంచంలో బహిష్కరించే ప్రయత్నం జరుగుతున్నది.యుు ం టేస్లాకు ట్రంప్ మద్దతు. దీంతో టెస్లా బిజినెస్ 50 శాతం పడిపోయింది ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ టెస్లా ను కాపాడాలని మస్క్ అమెరికాకు ఎంతో చేశారని తాను రేపు వెళ్లి టెస్లా కారు కొనుగోలు చేస్తానని, ఈ విధంగా టెస్లా బిజినెస్ కు అండగా ట్రంప్ ఉన్నాడనే మెసేజ్ వెళ్లాలనే ప్రయత్నం జరుగుతున్నది. గత డిసెంబర్ నుంచి భారత మార్కెట్ పరిస్థితి బాగాలేదు. దేశంలో ఉత్పత్తి ఉత్పాద కతలు పడిపోయాయి. ఎగుమతుల కన్నా దిగుమతులే ఎక్కువ కనిపిస్తున్నాయి. చాలాకాలంగా ఉద్యోగస్తులకు జీతాలు కూడా అంతంత మాత్రం గానే పెరిగాయి.

ఆదాయం తగ్గి మధ్యతరగతి ఆగమాగం

ఆదాయం తగ్గింది మధ్యతరగతి కుటుంబాల వద్ద డబ్బులు లేని పరిస్థితి ఏర్పడింది ఎక్కడివారక్కడ కొనుగోలు శక్తి పడిపోయి తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ప్రభావం దేశీయ మార్కెట్ మీద విపరీతంగా పడింది. గత 2024 జూన్ లో షేర్ మార్కెట్ పై మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వోహో,ఆహా, అంటూ ప్రశంసలు కురిపిస్తున్న వైనం ఇప్పుడు లేదు. ఇప్పుడు అసలు మార్కెట్ గురించి ఆయన మాట్లాడడమే లేదు! పార్లమెంట్లు నడుస్తున్నది అందులో భారతదేశానికి సంబంధించిన విషయాలపై చర్చ జరుగుతున్నది అయితే ప్రధాని మోడీ మాత్రం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లిపోయారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్ లిస్ట్ లలో చాలా పెద్ద గందరగోళం జరిగింది. ఇందులో అక్రమాలు చోటు చేసుకున్నాయి. విపక్ష పార్టీలన్నీ కూడా దీనిపై చర్చ పార్లమెంట్లో జరగాలని కోరుతున్నాయి.ముఖ్యంగా విపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దీనిపై పట్టు పట్టారు! మహారాష్ట్ర ఎన్నికల్లో ఇదే జరిగిందని అక్కడి విపక్ష పార్టీలన్నీ మొత్తుకుంటున్నాయి అయినా ప్రభుత్వంలో చలనం లేదు. అదానీ పై,సెబీ చీఫ్ మాధవీ బుచ్ పై వచ్చిన అవినీతికి అవినీతి ఆరోపణలకు సంబంధించి పార్లమెంట్లో చర్చ జరపడానికి సిద్ధంగా లేరు! అకౌంట్స్ కమిటీ ఆమెను పిలవాలన్నప్పుడు మాట ముచ్చట లేదు.ఒకవైపు ప్రతి సంవత్సరం దేశం విడిచిపెట్టి విదేశాలకు, ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం లక్షల మంది వెళుతున్నారు. ఇప్పటికే 3. 36 కోట్ల మంది మన దేశం నుంచి విదేశాలలో ఉంటున్నారు. చదువు కోసం ఉద్యోగాల కోసం వెళ్లి ఉన్నారు. మొత్తం ప్రపంచంలోనే 152 దేశాలలో వీరు ఉన్నారు. గత సంవత్సరం 13 లక్షల 35 వేల మంది విదేశాలకు వెళ్లారు. ఈ సంవత్సరం గత సంవత్సరం కలిపితే 20 లక్షలకు పైగానే మనవాళ్లు విదేశాలకు వెళ్లడం జరిగింది. అమెరికాలో పరిస్థితి డోనాల్డ్ ట్రంప్ మరోసారి అధ్యక్షుడు అయిన తర్వాత మన వాళ్ళ పరిస్థితి ఎలా ఉందో జగమెరిగిన సత్యం! తప్పుడు ధృవపత్రాలతో అమెరికాకి వెళ్లారని వారికి కాళ్లకు, చేతులకు గొలుసులు వేసి, మరి మన ఇండియాకు పంపిస్తున్నారు. ఇండియాను ట్రంప్ దారుణం గా బ్లేమ్ చేస్తున్నాడు.దీనిపై కనీసం మన పీఎం ఒక్క మాట మాట్లాడలేదు.

**16 లక్షల కోట్ల మాఫీ ఎవరికి చేశారు?**

4 కోట్ల మంది ఖాతాదారులు ఉన్న ఇండస్ట్ బ్యాంక్ లో 1500 కోట్లు లాస్ అయ్యింది. ఎలా? ఎట్లా? చర్చ లేదు! వివిధ బ్యాంకులు 16 లక్షల కోట్ల వే ఆఫ్ చేశాయి. ఎవరెవరికి వే ఆఫ్ చేశారో ఇప్పటిదాకా ఆ పేర్లు బయట పెట్టలేదు. విపక్షాలు అడిగితే సమాధానం ఉండదు. బ్యాంకుల దివాలా తీయడానికి ఇది కూడా ఒక కారణంగా పేర్కొనవచ్చు! ఇలా ఎన్నో విషయాలు పార్లమెంట్లో చర్చ జరపడానికి విపక్షాలు ముందుకు తీసుకురాగా అసలు సమాధానం ఇవ్వడానికి ఎవరు ముందుకు రాక పోవడం ఆందోళనకరం!

**ప్రజా సమస్యల మీద చర్చ లేదు!**


ప్రజా సమస్యల మీద అసలు చర్చే జరగడం లేదు! ఈ నేపథ్యంలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రగులుతున్న మణిపూర్ కు వెళ్లే సమయం లభించలేదు. కానీ మారిషస్కు ఆయన వెళ్లారు అక్కడ ఆయనకు మన ఇండియన్స్ భోజ్పురి గీతాలతో ఘనంగా స్వాగతం పలికారు. మారిషస్లో ఎనిమిది లక్షల 94 వేల మంది ఇండియన్స్ ఉన్నారు.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# "ద బ్లాక్ హిల్" ఈశాన్య భారత నేపథ్యంలో ఓ గొప్ప నవల

మమాంగ్ డాయ్ గురించి మన తెలుగు సాహితీలోకం లో తెలియవలసినంత గా తెలియలేదేమో. అరుణాచల్ ప్రదేశ్ కి చెందిన ఆమె రచనల గురించి ఇంకా ఎంతో తెలియవలసి ఉంది. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన బలమైన స్వరాల్లో మమాంగ్ డాయ్ ఒకరు. ఇటీవల ఆమె ఆంగ్ల నవల "ద బ్లాక్ హిల్" చదివిన తర్వాత కొన్ని అంశాలు పంచుకోవాలనిపించింది. ప్రకృతి అందాలకు పర్యాయ పదం ఈశాన్య రాష్ట్రాలు. అయితే అక్కడ జీవిస్తున్న వివిధ గిరిజన తెగల గురించి, వారి ఆచార వ్యవహారాల గురించి,చరిత్ర లో వారి స్థానం గురించి బయట ప్రపంచానికి చాలా తక్కువ తెలుసు. పుస్తకాలు లేక కాదు వాటి గురించి బయట ప్రపంచానికి పబ్లిసిటీ లేక పోవడం. అలా రరకాల కారణాల వల్ల జరుగుతుంది.




ప్రస్తుతం అరుణాచల్ ప్రదేశ్ లో ఉన్న మేబో,జయుల్ ఇంకా టిబెట్ దాకా ఈ కథా ప్రదేశాలు ఉన్నాయి. ఇది చరిత్ర కి కొంత కాల్పనికత అద్దిన నవల అని చెప్పాలి. 1840 నుంచి ఇప్పటి కాలం దాకా సాగిపోతుంది.బ్రిటీష్ వారు అప్పటి ఈశాన్య ప్రాంతాల్ని తమ గుప్పెట్లోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్న రోజులవి. మిష్మి,అబోర్ తెగలు విదేశీయుల రాకని తీవ్రంగా వ్యతిరేకిస్తుంటా యి. కజిన్ ష, గైమర్ అనే యువ ప్రేమికులు ఈ రెండు తెగలకి చెందిన వారు. ఒక తెగకి మరో తెగకి పడదు. అందువల్ల వీరిద్దరూ టిబెట్ కి దగ్గర్లో ఉన్న ఓ అడవిలోకి పారిపోయి జీవనం గడుపుతుంటారు. అక్కడి అరణ్యాల్ని, పర్వతాల్ని,సహజసిద్ధ జీవనాన్ని రచయిత్రి అద్భుతంగా కళ్ళకి కట్టినట్లు రాశారు. అడవిలో వాగు పక్కనే గుడిసె వేసుకుని నివసిస్తున్న ఆ జంటకి ఓ మగ పిల్లాడు పుడతాడు. ఇంటి దగ్గర చెప్పకుండా వచ్చినందుకు ఇరువురు బాధపడుతున్నా ,ఇంతకి మించిన దారి లేదని సముదాయించుకుంటారు. ఇలా ఉండగా నికోలస్ క్రిక్ అనే క్రైస్తవ మిషనరీ ఫ్రాన్స్ నుంచి ఇక్కడకి వస్తాడు.చెన్నయ్ లో ఓడ దిగి,అక్కడ నుంచి కలకత్తా వచ్చి, మళ్ళీ అక్కడి నుంచి ఇప్పటి అస్సాంలోని గువాహతి దగ్గర ఓ చిన్న ఊరుకి చేరుకుంటాడు. అక్కడ గది అద్దె కి తీసుకుంటాడు. టిబెట్ కి వెళ్ళాలనేది అతని ఆలోచన. మిష్మి,అబోర్ ఇంకా ఇతర తెగలున్న ప్రాంతాల గుండా వెళ్ళవలసి ఉంటుంది.

స్థానికులైన ఒకరికి డబ్బులు ఇచ్చి టిబెట్‌కి దారి చూపమంటాడు. ప్రయాణం అంతా నడక ద్వారానే సాగుతుంది. దాదాపు పది రోజులు పైన కొండలు, వాగులు దాటుతూ ప్రయాణిస్తారు. చాలా బాధలు పడి అక్కడికి చేరిన తర్వాత అక్కడి అధికారులు మీ దేవుడు మాకవసరం లేదు,ఇక్కడ నుంచి వెళ్ళిపో అని నిరాదరిస్తారు. మళ్ళీ తిరుగు ప్రయాణం లో అడవుల వెంబడి వస్తుండగా కజిన్ ష, గైమర్‌లు కనిపిస్తారు. వాళ్ళతో సంభాషణలు రకరకాల విధాలుగా జరుగుతాయి.

ఇదంతా తెలియాలంటే నవల మొత్తం చదవాలి. ఈశాన్య భారత దేశంలోని కొన్ని తెగల జీవన శైలిని తెలుసుకోవా లంటే ఈ నవల బాగా ఉపయోగపడుతుంది.విదేశీ జాతుల్ని నిలువరించడం లో వారి యుద్ధ నైపుణ్యం తెలియవస్తుంది. ఏ జంతువు నైనా చంపకుండా ,వాటితో ఎలా కలిసి జీవించాలో మమాంగ్ డాయ్ చిత్రించిన విధానం వాస్తవానికి దగ్గరగా ఉంది. అంతదాకా ఎందుకు, స్వర్గతుల్యమైన మిష్మి కొండల నడుమ మనల్ని ఊపిరి సలపనీయకుండా నడిపిస్తారు.

దీంట్లో చాలా సంఘటనల్ని ఏ రికార్డుల నుంచితీసుకున్నదీ సోదాహరణగా చెప్పినపుడు కల్పితం కంటే కొన్నిసార్లు వాస్తవమే ఆశ్చర్యానికి గురి చేస్తుంది. రచయిత్రి మమాంగ్ డాయ్ అరుణాచల్ ప్రదేశ్ నుంచి 1979 లో IAS కి ఆ రాష్ట్రానికి చెందిన మొదటి వ్యక్తి గా సెలెక్ట్ అయినారు. ఆ తరువాత కొన్నాళ్ళకి రాజీనామా చేసి తనకి ఎంతో ఇష్టమైన జర్నలిజం లో కొనసాగారు. టెలిగ్రాఫ్, హిందూస్థాన్ టైంస్ లోనూ రాసేవారు.

మూర్తి కెవివిఎస్ , (7893541003)

(పేజీలు :296 , వెల :499, అలీఫ్ కంపెనీ ప్రచురణ )

# ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తా..





- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి

**హయత్ నగర్, మార్చి 12 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ లోని వీరన్నగుట్ట లో రూ.20.50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, ఓపెన్ జిమ్ పనులకు ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తాను ఇచ్చిన ప్రతీ హామీని తప్పక నెరవేర్చుతనాని అన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అభివృద్ధి పనుల విషయంలో కొంత జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమేనన్నారు. కానీ, తాను ఇచ్చిన ప్రతీ హామీని తప్పక నెరవేరుస్తానన్నారు.

మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలో దాదాపు 71 లక్షల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమా లకు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సరస్వతి నగర్ కాలనీ లో నీటి స్తబ్దత తొలగింపు, సీ.సీ.రోడ్లుకు, టీ.నగర్ వద్ద సీ.సీ.రోడ్డకు, వీరన్న గుట్ట కాలనీ లో నూతన ఓపెన్ జిమ్, పోచమ్మ దేవాలయం దగ్గర నుంచి సి.సి. రోడ్లు, విజయ్ నగర్ కాలనీ కమాన్ నుంచి సీ.సీ. రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శివం హిల్స్, దుర్గాభవని నగర్, వీరన్న గుట్ట నందు చుట్టు పక్కల మరికొన్ని డ్రైన్స్, రోడ్లు వేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అతి త్వరలోనే అట్టి అభివృద్ధి పనులు ప్రారంభం కావడం జరుగుతుంది అని అన్నారు. కొన్ని కాలనీల యందు మంచి నీటి సమస్యలు, విద్యుత్ సమస్యల పై కంప్లైంట్ రావడం నేపథ్యంలో మీరు మా దృష్టికి తీసుకొని వస్తే మేము సంబంధించిన అధికారులచే మాట్లాడి పరిష్కరిస్తాను అని అన్నారు.

నేషనల్ హైవే నుంచి కాలనీ లోకి వెళ్లే మార్గం ములమలుపు వద్ద కంకర పోసి వదిలివేయడం జరిగింది, ఇప్పటికే సంబంధించిన అధికారులచే మాట్లాడి వెంటనే బి.టీ.రోడ్లు వేయాలని సూచించాను. నేషనల్ హైవే మీద చేస్తున్న పనుల్లో భాగంగా యూ టర్న్ దాదాపు రెండు కిలోమీటర్ల దూరంగా ఉన్న నేపథ్యంలో ప్రజల అభిప్రాయాల మేరకు యూ టర్న్ నిర్మించాలని అధికారులను కోరాను. వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. స్వాతి రెసిడెన్సీ దగ్గర ట్రంక్ లైన్ పనుల్లో భాగంగా గతంలో అబ్దుల్లాపూర్ మెట్ ఏం.ఆర్.ఓ., అబ్దుల్లాపూర్ మెట్ సర్వేయర్, హయత్ నగర్ ఏం.ఆర్.ఓ, సర్వేయర్ ల దగ్గరకు మా భారస పార్టీ సీనియర్ నాయకులను ఇచ్చి వారిచే పలు దఫాలుగా ట్రంక్ లైన్ గురించి మాట్లాడించాను. వారికి ట్రంక్ లైన్ ఔట్ లేట్ కలపడం విషయంలో పలు సూచనలు, సలహాలు ఇచ్చాను. ప్రస్తుతం మళ్ళీ కొందరు అట్టి ఔట్ లెట్ విషయంలో అడ్డుపడడం జరుగుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు జగదీష్ యాదవ్, కోసనం వెంకట్ రెడ్డి, జక్కిడి రఘువీర్ రెడ్డి, రుద్ర యాదగిరి, అనిల్ కుమార్, కెకెఎల్ గౌడ్, ఆనంద్ యాదవ్, నర్సింగ్ రావు, కుమార్, మహేష్, భాస్కర్, మాజీ డివిజన్ బీజేపీ అధ్యక్షులు యాదగిరి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, జక్కిడి రఘువీర్‌రెడ్డి, పోచబోయిన జగదీష్ యాదవ్, అనిల్ కుమార్, కొసనం వెంకటరెడ్డి, చంద్రారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కంబాలపల్లి నరసింహ యాదవ్, ప్రధాన కార్యదర్శి శాగంటి కోటయ్య, కోశాధికారి మాతంగి రవికుమార్, నాగేంద్రాచారి, సర్వేష్, ఎల్లస్వామి, తిరుమల కృష్ణ, నగేష్, శ్రీకాంత్ యాదవ్, యుగంధర్‌చారి, బాలరాజు గౌడ్, రామకృష్ణాచారి, వెంకట్‌రావు, తిరుపతిరెడ్డి, ప్రసాద్ చారి, గుండు యాదగిరి గౌడ్, అశ్విని, ధనమ్మ, కరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



అసలే విశ్రాంతి ఉద్యోగి ఏ విధంగానైనా అతని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు సంపాదించాలని అదునుగా చేసుకొని 2022సం.లో సూర్యాపేటలో బాధితుడు గణేష్ కలిసి బాగా మద్యం సేవించాడు. అదే అదునుగా చూసుకొ ని రాత్రి సమయంలో గుర్తు తెలియని మహిళలు తీసుకువచ్చి మద్యం మత్తులో ఉన్న బాధితుడు దగ్గర నేరస్థుడు గణేష్ మహిళలను బాధితుడు ఒళ్ళో పడుకోబెట్టి వీడియోలు, ఫోటోలు తీస్తూ ఆ వీడియోలను తమ కుటుంబ సభ్యులకు చూపిస్తానని బ్లాక్ మేయిల్ చేయడం మొదలుపెట్టాడు.

# మద్యం మత్తులో.. హనీ ట్రాప్

- రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నిందితుల అరెస్టు
- అసభ్యకరమైన ఫోటోలు, వీడియోలు తీసి బెదిరిస్తూ నలభై ఆరు లక్షలు వసూలు

**మిర్యాలగూడ,మార్చి 12 (జనం సాక్షి) :** రిటైర్డ్ ఉద్యోగిని మద్యం మత్తులో ఉండగా వేరే స్త్రీని అతని వద్ద ఒళ్ళో ఉంచి అసభ్యకరమైన ఫోటోలు వీడియోలు తీసి బెదిరిస్తూ గత నాలుగు సంవత్సరాలుగా రిటైర్డ్ ఉద్యోగి నుండి సూమారు 46 లక్షలు వసూలు చేసిన నిందితులను అరెస్టు చేసిన సంఘటన మిర్యాలగూడ టూ టౌన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్ రాజు మాట్లాడుతూ గతంలో అటవీ శాఖలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా రాగడప బీట్‌లో పనిచేసిన బాధితుడు అదే ఏరియాకు చెందిన ఆంగోత్ గణేష్‌ను అతని దగ్గరగా హెల్పర్‌గా పెట్టుకొని తన పనులకు సహాయపడుతూ ఉండేవాడు. వ్యసనాలకు అలవాటు పడిన ఆంగోత్ గణేష్ వ్యవసాయంపై వచ్చే డబ్బులు తన కుటుంబ అవసరాలకు సరిపోకుండా విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో 2022-2024 వరకు బాధితుని దగ్గర 19 ప్రామిసరీ నోట్లను రాపించుకొని అట్టి ప్రామిసరీ నోట్లను కూతురు, అల్లుడికి చూపించి అసలు వడ్డీతో కలిపి, హెూం లోన్ల డబ్బులతో సహా 46 లక్షలను కట్టించుకున్నాడు. గణేష్ బాధితుని బ్లాక్ మెయిల్ చేస్తూన్న విషయాన్ని అతని భార్య ఆంగోత్ ప్రమీలకు తెలుపగా ఇంకా బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు అడిగి బ్లాక్ మెయిల్ చేస్తూ బంగారం కొనిపిస్తూ ఉండేవాడు అతని బావమరిది కుర్ర శంకర్‌ను తీసుకొని వెళ్లి ఆంగోత్ గణేష్ బావమరిది కి జరుగుతున్న విషయాన్ని తెలపగా,గణేష్ బావ మరిదికి శంకర్‌కి ఫోటోలు వీడియోలు ఉన్నాయి అని చెప్పి డబ్బులు ఇవ్వాలని మళ్లీ బెదిరిస్తూ పలు తఫాలుగా రెండు లక్షల యాభై ఐదు వేలను బాధితునితో ట్రాన్స్ఫర్ చేపించాడు, కొంత డబ్బులతో బంగారాన్ని ఏర్టిగా కారు కొనుగోలు చేసి మిగిలిన డబ్బులను అతని సొంత అవసరాలకు వాడుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఫిబ్రవరి నెలలో మరల మూడు లక్షలు కావాలని ఇవ్వకపోతే చంపుతానని బెదిరించడంతో విసిగిపోయిన బాధితుడు జరిగిన విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేసి బాధితుడు టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులను బుధవారం ఉదయం మిర్యాలగూడ హనుమాన్ పేట ఫ్లైఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆంగోత్ గణేష్,కుర్ర శంకర్ లు పోలీసులను చూసి భయపడి పారిపోవడం ప్రయత్నించగా పట్టుకొని విచారించగా వారి వద్ద నుండి ఇర్టిగా కార్, ఒక స్మార్ట్ ఫోన్, 4:30 తులాల బంగారం ముత్తూట్ ఫైనాన్స్ ఉందని,10 ఒరిజినల్ ప్రాంసరీ నోట్లు,9 జిరాక్స్ ప్రాంసరీ నోట్లు సుమారు 43 లక్షల రూపాయల ప్రాంసరీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.గతంలో వీరిపై వాడపల్లి తిరుమలగిరి స్టేషన్లో ఆరు కేసులు నమోదు అయ్యాయని పలుమార్లు నేరాల పాల్పడుతున్న ఆంగోత్ గణేష్ పై రౌడీ షీట్ ఓపెన్ చేస్తున్నట్లు తెలిపారు.డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో ఈ కేసును చేదించిన మిర్యాలగూడ టూ టౌన్ సిఐ నాగార్జున,ఎస్సైలు హరీష్ రెడ్డి, బి రాంబాబు,పోలీస్ కానిస్టేబుల్ బాలకృష్ణ,కళ్యాణ్, అక్బర్ పాష , రామకృష్ణలను నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అభినందించారు.



## న్యాయం కావాలంటే అరెస్టులా

చందనవెల్లి భూబాధితుల సంఘం అధ్యక్షులు నీరటి ఆంజనేయులు

**షాబాద్, మార్చి 12 (జనం సాక్షి) :** గత ప్రభుత్వం చందన వెల్లి - హైతాబాద్ లో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ కంపెనీ ల కోసం భూములు కోల్పోయిన రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించకుండా వారికి అన్యాయం చేస్తున్నారని చందన వెల్లి భూ నిర్వాహితుల సంఘం అధ్యక్షులు నీరటి ఆంజనేయులు అన్నారు. బుధవారం తెలంగాణ శాసనసభ సమావేశాల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య ను అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతున్న సమయంలో కలిసి మా భూములకు సరైన నష్టపరిహారం చెల్లించాలని తెలియజేయడానికి వేచి ఉన్న సమయంలో పోలీస్ అధికారులు తమను నిర్దర్యనంగా అరెస్టు చేసి పోలీసు వాహనంలో రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ కు తరలించాలని, గత ప్రభుత్వం చేసిన తప్పే మళ్లీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా చేస్తుందని అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేకూరేవరకు మా పోరాటం ఆగదు అని అన్నారు. మాకు న్యాయం చేకూరాకపోతే తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో భూ బాధితులం అందరం ఏకమై పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని అన్నారు.

## ట్రాక్టర్ బైక్ ఢీకొని
# ఇద్దరికీ తీవ్ర గాయాలు

- పరిస్థితి విషమం వికారాబాద్ ఆసుపత్రికి తరలింపు
- దోమ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు





**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చి 12 (జనం సాక్షి) :** ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఇద్దరి వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయం కాల సమయంలో చోటుచేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..దోమ మండల పరిధిలోని మోత్కుర్ గ్రామానికి చెందిన సండి సాయి కుమార్(17), సండి ధన్‌రాజ్(18) ఇద్దరు వ్యక్తులు స్వగ్రామం నుంచి పరిగి పట్టణానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మైలారం గేట్ సమీపంలోకి రాగానే కోళ్ల ఫారం నుంచి వస్తున్న ఓ ట్రాక్టర్ గొడుగోనిపల్లి వైపు మళ్తున్న క్రమంలో వెనుకబాగంలో ట్రాలీని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే 108 వాహనంలో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్సను అందించి హైదరాబాద్కు రేఫర్ చేశారు. కాగా, కుటుంబ సభ్యులు వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇద్దరి పరిస్థితి విషమంగానే ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.

# మీరున్నది... మేమున్నది ప్రతిపక్షంలోనే..!

- మీ ప్రోటోకాల్‌తో మీరు టెంకాయలు కొట్టండి... మా ప్రోటోకాల్‌తో మేం టెంకాయలు కొడతాం
- కొప్పుల నర్సింహ్మ రెడ్డి



**హయత్ నగర్, మార్చి 12 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ లోని జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి వారి కార్యాలయంలో ఎల్.బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చేసిన శంకుస్థాపన కార్యక్రమం కనీస సమాచార ప్రోటోకాల్ పాటించ కుండా నిర్వహించకపోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముందుగా నేను రిప్రజెంటేషన్ ఇచ్చిన దగ్గర నుండి అధికారులు ఎస్టిమేషన్ వేసినానుండి, టెండర్ పూర్తియే వరకు ప్రతి ఫైల్లో ఫైల్‌ను పర్యవేక్షించనని నేను తెచ్చిన శాంక్షన్‌లకు మీరు టెంకాయలు కొట్టడం శోచనీయమన్నారు.
కాలనీ వాళ్లకు సమాచారమిచ్చిన తర్వాత అధికారులు మంగళవారం మధ్యాహ్నం 2:00 గంటల జిహెచ్ఎంసి ఏఈ సప్న ఫోన్ చేసి ఎమ్మెల్యే రేపు శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్ర మాలు చేస్తున్నారు, మీకు సమయం ఉందా? అని నన్ను కించపరిచేలా అధికారులతో అడిగించడం బాధకరమన్నారు. ప్రత్యేకంగా జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ చొరవతో సమస్యను అర్థంచేసి కమిషనర్ సుమారు 1 కోటి 58 లక్షల రూపాయలతో స్పెషల్ బడ్జెట్‌లో ఎమ్మెల్యే చేసిన శంకుస్థాపన పనులు మంజూరు చేయించమన్నారు. కానీ ఎమ్మెల్యే ప్రోద్భలంతో రాలేదన్నారు. గత ప్రభుత్వంలో మాతోపాటు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన అధికారులను మీ పిఏ సైతం ఫోన్ చేసి సస్పెండ్ చేస్తామని, మీరు ఇబ్బందులు ఎదుర్కొంటారని, బెదిరింపులకు గురి చేసేవారు. కానీ కొత్త ప్రభుత్వంలో మాత్రం అధికారులకు స్వతంత్రం వచ్చిందని స్వేచ్ఛతో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారని అన్నారు. ఇంతకు ముందున్న జోనల్ కమిషనర్ కనీసం కార్పొరేటర్, కాలనీ సభ్యుల తో కానీ స్వయంగా వచ్చి సమస్యలు పరిశీలించలేదని అన్నారు. కానీ ఇప్పుడు ఉన్న కమిషనర్ ఐఏఎస్ అధికారులు మాత్రం కాలనీలో చిన్న సమస్య వచ్చినా ఒక ఫోన్‌కాల్‌తో స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నారని అన్నారు.

## అర్హులైన ప్రతిఒక్కరికి తెల్ల రేషన్ కార్డు అందిస్తాం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**చేవెళ్ల, మార్చి 12 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతిఒక్కరికి తెల్ల రేషన్ కార్డులను అందిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. బుధవారం ప్రజాపాలనలో భాగంగా చేవెళ్ల మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డు, లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా దశలవారీగా సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో ఎంతమంది అర్హులు ఉంటే అన్ని కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల తహాశీల్దార్ కృష్ణయ్య, మున్సిపాలిటీ కమిషనర్ పూర్ణ చందర్, టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్. డీసీ సి ఉపాధ్యక్షులు బండారి ఆగి రెడ్డి, ముడిమ్యాల, గుండాల పీఏసీఎస్ చైర్మన్లు గోనె ప్రతాప్ రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ ఎర్ర మల్లేష్. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జె లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండాల రాములు, మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి. మాజీ సర్పంచ్ దావల్గారి గోపాల్ రెడ్డి, డీలర్ తిరుపతిరెడ్డి, వెంకటేష్ లబ్దిదారులు తదితరులున్నారు.

# నార్సింగ్ మున్సిపాలిటీని ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మార్చి 12 (జనం సాక్షి) :** నార్సింగ్ మున్సిపాలిటీని ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో రూ.81 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్సింగ్ మున్సి పాలిటీ ప్రాంతం సమగ్ర అభివృద్ధి సాధించే దిశగా ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్డు నెట్వర్క్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయు ట కాలనీలలో దీర్ఘకాలికంగా ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్ననన్నారు.

అభివృద్ధి పనులుగా రూ.20 కోట్లతో కోకాపేట్‌లో బ్రిడ్జి నిర్మాణంతో పాటు అప్రోచ్ రోడ్డు అభివృద్ధి సుందరీకర ణ పనులకు గాను,. రూ.11.50 కోట్ల తో రాయల్ ఫంక్షన్ హాల్ నుండి నార్సింగ్ జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్డు వెడల్పు, ఫుట్ పాత్ నిర్మాణం డివైడర్ నిర్మాణ పనులకు గానూ, రూ 13 కోట్లతో కోకాపేట్ సర్కిల్ నుండి గండిపేట్ సాయిబాబా గుడి వరకు బీటీ రోడ్డు వెడల్పు ఫుట్పాత్ నిర్మాణం డివైడర్ నిర్మాణ పనులకు, రూ.4 కోట్లతో మంచిర్యాల బాలాజీ నగర్ యందు మెయిన్ రోడ్డు కల్వర్టు నుండి మూసీ నది వరకు బాక్స్ నిర్మాణ పనులకు, రూ 1.50 లతో నార్సింగి యందు ఆవుదూడ జంక్షన్ నిర్మాణం రూ. 8 కోట్లతో నార్సింగ్‌లో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయుటకు గాను, రూ 5 కోట్లతో నార్సింగిలో 3 ఎకరాలలో సౌకర్యాలతో పార్కుని ఏర్పాటు చేయుట, అల్లు స్టూడియో నుంచి గ్లోబల్ హెడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణము, మంచిరేవులలో 2 జంక్షన్ల నిర్మాణము, బుల్కాపూర్ నాలా పునరుద్ధరణ నార్సింగి పురపాలక సంఘ పరిధిలో ఇదివరకే మొదలుపెట్టి అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పూర్తి చేయుట నార్సింగి యందు రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేయుట పనులన్నీ త్వరితగతిన చేపట్టుటకు కమిషనర్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కమిషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, మాజీ వైస్ చైర్మన్ గోపాల విజయబాబు, నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, గుడి మల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేశ్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు శివారెడ్డి లక్ష్మీ ప్రవళిక కిరణ్, దుర్గేష్ యాదవ్, నార్సింగ్ పార్టీ అధ్యక్షులు అశోక్ యాదవ్, డిఈ నరేష్, టిపిఎస్ మణిహారిక పాల్గొన్నారు.

# పేద ప్రజల అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"
- అప్పారెడ్డిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ళకు శంకుస్థాపన
- సొంతింటి కల నెరవేరుతోందంటూ గ్రామస్తుల సంతోషం



**నందిగామ మార్చి 12 (జనం సాక్షి):** పేదోళ్ల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేయబోతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే, వీర్లపల్లి శంకర్ అన్నారు.నందిగామ మండలం అప్పారెడ్డి గూడ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు పైలట్ ప్రాజెక్టు కింద స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ లబ్ధిదారులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ తాము పదవిలో ఉన్నప్పుడే నియోజకవర్గంలో ని అన్ని గ్రామాల్లో ఉన్న నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇండ్లు చొప్పున నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ సంక్షేమ పాలన చూసి ఓర్వలేకే తమపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదవాళ్ల సొంతింటి కలను నేరవేరుస్తామని ఇదివరకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ఓయూ హాస్టల్ అన్నంలో బ్లేడులు, పురుగులు



**ఓయూ మార్చి 12 (జనంసాక్షి):**
ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. గోదావరి హస్టల్ బుధవారం రాత్రి భోజనంలో లేజర్ బ్లేడులు రావడం విద్యార్థులను ఆందోళనకు దిగారు. ఇటీవల కాలంలోనే వరుసగా అన్నంలో పురుగులు రావడం, బ్లేడులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతా జరుగుతున్నా ఉన్నతాధికారులు స్పందించడం లేదని నిరసనకు దిగారు. వెంటనే వీసీ,చీఫ్ వార్డెన్ స్పందించాలని విద్యార్థులు రాత్రి రోడ్డెక్కారు.

## నగరంలో ఎంహెచ్ఐ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రారంభం



**ఖైరతాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :**
ప్రెసిషన్ ఇంజినీరింగ్‌లో అగ్రగామిగా ఉన్న ఆజాద్ ఇంజినీరింగ్ తునికొల్లారంలో మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ (ఎంహెచ్ఐ) ప్రత్యేక లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ప్రారంభించినట్లు ఆజాద్ ఇంజినీరింగ్ చైర్మన్, సీఈఓ రాకేష్ చోప్దార్ బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ అత్యాధునిక కేంద్రాన్ని జపాన్‌లోని ఎంహెచ్ఐ ఎనర్జీ సిస్టమ్ జీటీసీ బిజినెస్ డివిజన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మసాహిటో కటావోకా తెలంగాణరాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌లతో కలసి ప్రారంభించినట్లు తెలిపారు.





# విద్యార్థులకు మేను ప్రకారం భోజనం అందించాలి

- వసతి గృహాల్లో శుభ్రతను పాటించాలి
- మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి

**తాండూరు మార్చి 12(జనంసాక్షి) :** గురుకుల, మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు నేను ప్రకారం భోజనం అందించాలని మున్సిపల్ కమీషనర్ విక్రమ్ సింహారెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డిలు సూచించారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు బుధవారం తాండూరు పట్టణం రాజీవ్ కాలనీ సమీపంలోని తెలంగాణ మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్ ను మున్సిపల్ కమీషనర్ విక్రమ్ సింహారెడ్డి తనిఖీ చేశారు. అదేవిధంగా తాండూరు మండలం జినుగుర్తి గేటు సమీపంలోని కస్తూరీబా గురుకుల పాఠశాలని పరిశీలించారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో కమీషనర్ విక్రమ్ సింహారెడ్డి క్లాస్ రూంలు, మరుగుదొడ్లు, వంట గదితో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి విద్య ఎలా బోధిస్తున్నారని, భోజనం ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మరోవైపు జినుగుర్తి కేజీబీవీలో మేనేజర్ నరేందర్ రెడ్డి కూడా స్కూల్ తరగతి గదులు, వంట గది, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో విద్యార్థులకు డైనింగ్ హాల్ లేక ఇబ్బందులు పడుతున్నారని, మెను ప్రకారం భోజనం వడ్డించడం లేదని మేనేజర్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్, మేనేజర్ లు వేరు వేరుగా మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్కూళ్లలో మెరుగైన విద్య అందించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జినుగుర్తి స్పెషల్ ఆఫీసర్ ఆశలత, తాండూరు మున్సిపల్ ఆర్వ అశోక్ కుమార్, జవాన్లు

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 13 మార్చి 2025

# తాగునీటి వృథా.. వ్యక్తికి ఫైన్

## వారం వ్యవధిలో రెండో ఘటన

## ఇలాంటి పనులకు పాల్పడితే చర్యలు తప్పవన్న అధికారులు



**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 5న జూబ్లీహిల్స్ తో తన ఇంటి ముందు తాగునీటితో బైక్ వాష్ చేసిన వ్యక్తికి ఫైన్ వేయగా.. తాజాగా ఇలాంటి పనే చేసిన వ్యక్తికీ జరిమానా విధించారు. జూబ్లీహిల్స్ లో తాగునీటితో బైక్ వాష్ చేసిన ఘటన తర్వాత.. జలమండలికి తాగునీటి వృథాపై ఫిర్యాదులు అందుతున్నాయి. కస్టమర్ కేర్ కు ఫోన్ చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో నేరుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో జీఎంలు తమ పరిధిలో.. తాగునీరు సరఫరా చేసే సమయంలో తమ సిబ్బందితో ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేయిస్తున్నారు. ఎవరైనా తాగునీరు వృథా చేసినట్లు గమనిస్తే.. వెంటనే నోటీసులు జారీ చేసి జరిమానా విధిస్తున్నారు. అందులో భాగంగానే.. ఓ అండ్ ఎం డివిజన్-6 జీఎం హరిశంకర్.. తమ మేనేజర్ తో కలిసి తనిఖీలు చేస్తుండగా.. జర్నలిస్టు కాలనీలో ఇంటి నెంబర్. 8-2-293/82/జే/ఏ/20 గల యరత శోభ అనే వినియోగదారులు తాగునీటితో వాహనం శుభ్రం చేయడం గుర్తించారు. దీంతో జలమండలి నిబంధనలు ఉల్లంఘించినందుకు వారికి రూ.1000 ఫైన్ వేశారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

## సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్




**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12 ( జనం సాక్షి) :** ఇంటర్ మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ ఆంథోని పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను ఎస్పీ పారితోష్ పంకజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 6వ తేది నుండి 22వ తేది వరకు జరగనున్న ఇంటర్ మీడియట్ పరీక్షల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 125 బి.యన్.యస్.యస్, (144) సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా తిరగడ్డానికి వీలులేదని, 100 మీటర్ల దూరం వరకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎలాంటి జిరాక్స్ సెంటర్స్ ఓపెన్ చేయకూడదని అన్నారు. పరీక్ష కేంద్రాలలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని సిబ్బందికి సూచించారు.

# కొత్త రేషన్‌కార్డుల జారీకి వీడని గ్రహణం

## లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు




**వనపర్తి,మార్చి12 (జనంసాక్షి) :** పేర్ల మార్పులు చేర్పుల కోసం తిప్పలు జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం నుంచి అర్హులందరికి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఎమ్మెల్యేలు చేసిన ప్రకటనలు ఇప్పటికీ అమలు కాలేదు .మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి 26 జనవరి రోజు లాంఛనంగా కొన్ని కొత్త కార్డుల లబ్ధిదారుల పేర్లు ప్రకటించి అధికారులు చేతులు దులుపుకున్నారన్న విమర్శలు సర్వత్రా కొనసాగుతున్నాయి.అందుకే కొత్త రేషన్ కార్డుల జారీకి పట్టిన గ్రహణం వీడలేదని, 2024 జనవరిలో కొత్త కార్డుల కోసం దరఖాస్తులు తీసుకొని సుమారు 15 నెటలలు అవుతున్నా వాటిపై స్పష్టమైన విధి విధానాలు లేనందున ప్రభుత్వ తీరును శంకించాల్సి వస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రేషన్ కార్డుల జారీలో జాప్యంతో నిరాశ**

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీలో ఇంకా జాప్యం జరుగుతోంది. మార్చి ఒకటిన లక్ష కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని చేసిన ప్రభుత్వం నిర్ణయం అమలు కాలేదు. అయితే ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ లేని మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, గద్వాల, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించి, ఈ మేరకు చర్యలు చేపట్టాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సీఎస్ శాంతికుమారిని ఆదేశించినా, ఇంకా కొత్త రేషన్ కార్డులు ఆ జిల్లాల్లోనూ జారీ కాలేదు. దరఖాస్తుల పరిశీలన ఆలస్యమైందని, అందుకే కొత్త కార్డుల జారీ చేయలేదని తెలుస్తోంది.

**కులగణన సర్వేలో రేషన్ కార్డుల డిమాండే అధికం**

6.68 లక్షల కుటుంబాలు కులగణన సర్వేలో తమకు కొత్త రేషన్ కార్డులు కావాలని దరఖాస్తు చేసుకున్నాయి. దరఖాస్తుల్లో 5.12 లక్షల కుటుంబాలు రేషన్ కార్డులకు అర్హమైనవిగా పౌరసరఫరాల శాఖ గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో రేషన్ కార్డుల జారీ ఆలస్యమైందని మంత్రులు అప్పట్లో చ చెప్పారు. దరఖాస్తు దారుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులు మార్చికి ముందే జారీచేయాలని సీఎం ఆదేశించారు. మార్చి 1న దాదాపు లక్ష మందికి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని సైతం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఇటీవల ప్రకటించారు. కొత్త రేషన్ కార్డుల జారీపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సైతం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా కొత్త రేషన్ కార్డులు జారీలో ముందడుగు పడలేదు.



**జనవరి 26న 16,900 కొత్త రేషన్ కార్డుల జారీ**

తెలంగాణ ప్రభుత్వం జనవరి 26న కొత్త రేషన్ కార్డులతో పాటు నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టింది. మండలానికి ఓ గ్రామాన్ని ఎంపిక చేసి సంబంధిత ఎమ్మెల్యేలు కలెక్టర్లు 16,900 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు.మిగతా గ్రామాల లబ్ధిదారులకు దశలవారీగా కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. చాలామంది తమకు రేషన్ కార్డులు జారీ కాలేదని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతుండడంతో గ్రామసభలు నిర్వహించి కొత్తగా దరఖాస్తులు తీసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సాకు చూపించి కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ లేని ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్, హైదరాబాద్ జిల్లాల్లో రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. మార్చి ఒకటిన లక్ష రేషన్ కార్డులు అందిస్తామని చెప్పడం మాటలకే పరిమితం అయిందని విమర్శలు వస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

**కార్డుల్లేక ప్రభుత్వ పథకాలు అందడంలే**

రేషన్ కార్డులు లేక పథకాలు వస్తలేవ్, ఆరోగ్యశ్రీ లేదు, రేషన్ కార్డులు లేకపోవడంతో ఆరోగ్యశ్రీతో పాటు 200 వందల యూనిట్ల వరకు ఇంటికి ఉచిత విద్యుత్, 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్ అందుకోలేక పోతున్నామని కార్డుల్లేని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా పెళ్లయిన జంటలు, గత పదేళ్లలో పుట్టిన పిల్లల పేర్లు రేషన్ కార్డుల్లో లేకపోవడంతో నిమ్స్ లాంటి హాస్పిటల్స్ లో మెరుగైన వైద్య సేవలు పొందలేకపోతున్నారు. 6 లక్షల కుటుంబాలు రేషన్ కార్డులు లేకపోవడంతో పలు పథకాలకు దూరం అవుతున్నాయి. ఏటీఎం కార్డు తరహాలో కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పింది.దీంతో మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని, సాధారణ పద్ధతిలోనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇది ప్రకటనకే పరిమితమైందని, తమకు కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలి

## చేర్యాలలో ఇందిరమ్మ ఇండ్లకు పురోగతిని పరిశీలించిన కలెక్టర్



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12 ( జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కంది మండలం చేర్యాలలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కంది మండలం లో పైలెట్ ప్రాజెక్టుగా చేర్యాల గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడంతో జిల్లా స్థాయి అధికారుల నిఘా ఉంచి పనులు వేగవంతంగా జరిగేలా చూస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో 65 ఇళ్ళు మంజూరు చేయగా 12 ఇళ్ళు బెస్మిట్స్ స్థాయిలో ఉన్నట్లు ప్రస్తుతం మూడు ఇండ్లు నిర్మాణ స్థాయిలో ఉన్నట్లు అధికారుల బృందం వీటిని పరిశీలించింది. కలెక్టర్ తనిఖీ చేసి పనుల నాణ్యత, నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఇల్లు పూర్తిగా లేని అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వం ఇండ్లు నిర్మించి అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇండ్లను 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని కలెక్టర్ తెలిపారు.

**మోడల్ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్**

కంది మండల కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన మోడల్ ఇండ్లను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం పరిశీలించారు. మోడల్ ఇండ్ల నిర్మాణం పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. మిగతా ఇండ్ల నిర్మాణ పనులు కూడా వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం పూర్తిగా ఇండ్లు నిర్మించి ఇస్తుండడంతో పతకం అమలు మరింత వేగంతో అవుతుందన్నారు. ప్రభుత్వ విధానాలు ఇది నిదర్శనం అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పైలెట్ ప్రాజెక్టులో నీటిపారుదల వసతి, మౌలిక వసతులు కల్పనతో పాటు ఇంటి పరిసరాలు, మంచినీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులకు ఇండ్ల పథకంపై అవగాహన కల్పించి వారి ఇండ్ల నిర్మాణం మెరుగుపరిచేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అధికారులు ఇండ్ల నిర్మాణం నాణ్యత పై మరింత దృష్టి సారించాలని సూచించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయడం లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో పిడి హౌసింగ్ చలపతిరావు, ఏఈ మాధవరెడ్డి, తాసిల్దార్ విజయలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బ్యాంకు పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

## యుబిఐ రీజినల్ హెడ్ సత్యనారాయణ



**మల్దకల్ మార్చి 12 (జనంసాక్షి)** మండల కేంద్రంలో బుధవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన భవనాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై నూతన భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సంఘ సభ్యులకు రూ.1 కోటి10 లక్షల చెక్కును అందజేశారు.బ్యాంకు100 కోట్లతో వ్యాపారం సాగుతుందని,డిపాజిట్లు పెంచాలని బ్యాంకు సేవలు ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలన్నారు. బ్యాంకు పురోభివృద్ధికి పాటుపడాలని,త్వరలోనే ఏటీఎం సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు.కేంద్ర పథకాలు తో పాటు 20,400 రూపాయలతో ఇన్సూరెన్స్ స్కీములను కూడా ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు.తొమ్మిది గ్రామాలకు బ్యాంక్ సేవలు అందిస్తుందని ఖాతాలు లేని బంధుమిత్రులకు కొత్తవారికి అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ గంగాధరం, ఎల్ డి ఎం అయ్యపురెడ్డి, స్టాఫ్ నాగేంద్రబాబు, శివశంకర్, ఆశన్న, అచ్యుత్ పరశురాముడు, రఘు, విశ్రాంతి ఉద్యోగి నాగరాజు, పట్వారి అరవిందరావు, దీరెంద్ర దాస్, దామనాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, బాదం శ్రీనివాసులు, ఏకే సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విష సర్పాన్ని పట్టేందుకు వెళ్లి మృతి



**పాపన్నపేట,మార్చి 12(జనంసాక్షి):** విష సర్పాన్ని పట్టేందుకు వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశత్తూ అనంత లోకాలకు వెళ్లాడు.ఈ సంఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.బుధవారం స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన వంగపాటి నాగరాజు(53)కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పుడప్పుడు ఎక్కడైనా పాములు వస్తే వాటిని పట్టేవాడు. మంగళవారం సాయంత్రం కొత్తపల్లి గ్రామంలో ని అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్ లో పాము వచ్చింది.ఆ పామును పట్టేందుకు అక్కడికి వెళ్లి పట్టే క్రమంలో చేతికి పాము కరిచింది.అక్కడే ఉన్నవారు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మృతి చెందాడు.మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయండి

## ఎల్ఆర్ఎస్ పై పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన కల్పించండి

## ఇంటి పన్ను వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

## 31లోపు పూర్తి ఫీజు చెల్లించిన వారికి 25 శాంతం రిబేట్ వర్తిస్తుంది : జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12( జనం సాక్షి) :** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్కీమ్ లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం ( ఎల్ఆర్ఎస్ ) దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్ల రెగ్యులరైజేషన్ కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో, వాటిని త్వరగా పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఫోన్ కాల్ చేసి రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలియజేయాలనీ అన్నారు.ఈ నెల 31లోపు పూర్తి ఫీజు చెల్లించిన వారికి 25 శాంతం రిబేట్ వర్తిస్తుందని స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, టాంటాం ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ప్రయోజనం కలిగేలా వేగంగా సమస్యలు పరిష్కరించి, రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇంటి పన్ను (హౌస్ టాక్స్) ప్రాపర్టీ టాక్స్ వంద శాంతం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయ వనరులను మెరుగుపరిచేందుకు పన్నుల వసూలు అత్యంత కీలకమని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి, పన్నుల వసూళు పూర్తిగా చేయాలని సూచించారు. టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీరాజ్ అధికారి సాయిబాబా, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 36వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



**జిన్నారం మార్చ్ 12 (జనంసాక్షి)** గుమ్మడిదల మున్సిపాలిటీలో నల్లవల్లి పంచాయితీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 36వ రోజుకు చేరాయి. బుధవారం నాడు నాగిరెడ్డిగూడెం గ్రామ రైతులు నిరసన దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ వద్దంటూ మున్సిపాలిటీ ప్రజలు ఆందోళన బాట పట్టామన్నరు. వద్దొద్దు మాకొద్దు డంపింగ్ యార్డ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల జేఏసీ నాయకులు,గ్రామస్తులు, యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అన్నిరకాల వైఫల్యాలకు కారణం కేసీఆర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో అన్ని రకాల వైఫల్యాలకు కారణం కెసిఆర్ అని, బిఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అన్ని విధాల నాశనం అయ్యిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ ఆరోపించారు. బుధవారం అద్దంకి విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక కెసిఆర్ ముఖ్యమంత్రి కాకుండా ఉంటే రాష్ట్ర పరిస్థితి ఈ స్థితిలో ఉండేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అన్ని వైఫల్యాలకు అసలు కారణం కెసిఆర్ అని ఆయన ఆరోపించారు.

# ప్రేరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

## డీఈవో గోవింద రాజులు



**కృష్ణ, మార్చి 12 (జనంసాక్షి) :** విద్యార్థులు ప్రేరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి గోవింద రాజులు అన్నారు.కృష్ణ మండలం హిందూపూర్ గ్రామ శివారులో ఉన్న కేజీబీవీ పాఠశాలను డీఈవో గోవిందరాజులు బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేరణ తరగతులు ఉత్తమ ఫలితాలను దోహదం చేస్తాయని,విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది అన్నారు.దాంతో వందశాతం ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నిజాముద్దీన్, ఎండీఎం ఇన్‌చార్జ్ , యదయ్య శెట్టి, జీసీడీఓ నర్మద, ఎస్ఓ శాలిని, సీఆర్పీ అమీన్ రెడ్డి పాల్గొన్నారు.

# గూడ్స్ వాహనాల్లో ప్యాసింజర్లను తరలించరాదు

## జనంసాక్షి దినపత్రిక కథనానికి స్పందించిన రవాణా శాఖ అధికారులు




**గద్వాల్ రూరల్, మార్చి12 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలోనీ గూడ్స్ వెహికిల్స్ నందు దినసరి కూలీలని తరలిస్తున్నారని వరుస కథనాలు జనంసాక్షి ప్రచురించడంతో స్పందించిన రవాణాశాఖ అధికారులు గూడ్స్ వాహనాల్లో ప్యాసింజర్ లో తరిస్తున్న వాటిని గుర్తించి తనిఖీ చేపట్టారు.గత కొన్ని రోజుల నుండి గూడ్స వాహనాల్లో ప్రజలను తరలించడంతో ఇటీవల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.ఈ సందర్భంగా జనంసాక్షి విలేఖరి ఎంవిఐ రాములును సంప్రదించగా వ్యవసాయ కూలీలను కొన్ని గూడ్స్ వాహనాలలో తీసుకెళ్లరాదని తీసుకెళ్లినచో వాహనం సీజ్ చేయబడుతుందని తెలిపారు.ఈమధ్యకాలంలో ప్రైవేటు వాహన యజమానులు డబ్బుల ఆశతో కూలీల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని,గూడ్స్ వాహనాలలో ప్యాసింజర్ ను తీసుకపోవడం వల్ల చాలా రకాల ప్రమాదాలు జరుగుతున్నట్లు క్రమ దృష్టికి వచ్చిందన్నారు.ఈ మధ్యకాలంలో అధిక సంఖ్యలో గూడ్స్ వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని చాలా వాహనాలు ఫిట్నెస్ లేకుండా పర్మిషన్లు లేకుండా ఏ ఇతర డాక్యుమెంట్స్ లేకుండా వాహనాలను నడుపుతున్నారని ఇది చట్ట విరుద్ధం అని,అందుకొరకు మేము స్పెషల్ డ్రైవ్ ను పెట్టి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలపై చర్యలు తీసుకుంటున్నామని అధిక ప్యాసింజర్ తో వెళ్తున్న వాహనాలను సీజ్ చేయటానికి కూడా వెనకాడమని రవాణా శాఖ అధికారి టివి రావు ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.బుధవారం సుమారు 12 వాహనాలను సీజ్ చేశామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై చర్చకు సిద్ధమా..?

**•బిఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 12 (జనంసాక్షి)



బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వేములవాడ నియోజకవర్గం పరిధిలో సాగు నీటి రంగంలో చేసిన అభివృద్ధిపై,15 నెలల కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై చర్చకు సిద్ధమా అంటూ బిఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సవాలు విసిరారు. బుధవారము వేములవాడలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ 1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడితే 2014 లో తెలంగాణ ఏర్పడిందన్నారు. 52 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ -52 ఏళ్లలో ఒక్క ప్రాజెక్ట్ అయిన కట్టరా అని ప్రశ్నించారు.ఉమ్మడి రాష్ట్రంలో సిరిసిల్ల వే వేములవాడ ఎప్పుడు కరువు మండలాలుగా ఉండేవన్నారు.2014 కంటే ముందు రాష్ట్రంలో 57 వేల ఎకరాల వరి పంట పండిస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక కెసిఅర్ ప్రభుత్వం వచ్చాక 177300 ఎకరాల సాగులోకి వచ్చిందన్నారు.పాత కరువు ప్రాంతమును సస్యశ్యామలం చేశారన్నారు. వేములవాడ మూలవాగులో చెక్ డ్యాంలు కట్టామని,మిడ్ మనేరు ప్రాజెక్ట్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ 838 కోట్లు ఖర్చు చేసి వదిలివేశారన్నారు.అసంపూర్తి గా ఉన్న మిడ్ మానేరును కెసిఅర్ 2019 లో రూ 1587 కోట్లు ఖర్చు చేసి నిర్మాణం పూర్తి చేశారా లేదా చెప్పాలన్నారు.ముంపు గ్రామాల సమస్యల పట్ల 2006 నుండి 2014 వరకు ఏం సమస్యలు పరిష్కారం చేయలేదని,కెసిఅర్ రూ 5 లక్షల 4 వేలు ఇస్తామని చెప్పారు కానీ అది సాధ్యం కాదని సవరణ చేశారని గుర్తు చేశారు.కానీ మీరు అదే మాట పట్టుకొని 9 ఏళ్లు గడిపారన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడ ముంపు గ్రామాల ప్రజలకు ఒక్కొక్క కుటుంబానికి రూ 5 లక్షల 4 వేలు ఇస్తానని మాట ఇచ్చారని, 15 మాసాల్లో ఆ మాట ఎందుకు నెరవేర్చలేదని ఆయన ప్రశ్నించారు.మీరు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పారు కానీ ఒక్క ఇల్లు కూడా కట్టింది లేదన్నారు.మల్కపేట రిజర్వయారులో 0.35 నుండి 3 టీఎంసీల సామర్థ్యం పెంచామని, మీరు నిరు ఎందుకు నింపలేదన్నారు.మొన్న కేటీఆర్ మంత్రితో మాట్లాడితే నీళ్లు వదిలరన్నారు.ప్రజలతో ఫొటోస్ దిగడం చేసుకోండి,కానీ ప్రజలను నష్టపోకుండా చూడలాన్నారు. నేను ప్రతి పక్ష హొదాలో గుర్తు చేస్తున్నాని,మీరు కొట్లడంగా కొట్లాడంగా ప్రజలు మీకు అవకాశం ఇచ్చారని, మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చితే బిఆర్ఎస్ నాయకులమే నిన్ను సన్మానిస్తామన్నారు.బారాసా అధికారంలో ఉన్నప్పుడు కరువు ఏర్పడలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే సరికి కరువు చూపిస్తున్నారన్నారు.కళికోట సూరమ్మ ప్రాజెక్ట్ విషయంలో శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టు లో భాగంగా తమపై అసత్య ప్రచారాలు మానుకొని నియోజకవర్గంలోని ప్రధాన సాగునీటి రంగంలోని కలికోట సూరమ్మ చెరువు,మల్కపేట రిజర్వాయర్,అప్పర్ మానేర్ ల పెండింగ్ పనుల్ని పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.రాజన్న ఆలయ అభివృద్ధి చేయాలని, మిడ్ మానేర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వని, మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లను అయన కోరారు. చిల్లర రాజకీయాలతో బిఆర్ఎస్ ను బదనం చేసే పనులు మానుకొని ప్రజల త్రాగునీరు, సాగునీటి సమస్యలు తీర్చితే తామే కాంగ్రెస్ నాయకులకు ఘనంగా సన్మానం చేస్తామన్నారు. మీరు పలుమార్లు చెప్పిన పనులన్నీ కాగితాలకే పరిమితం చేయకుండా పూర్తి చేసేలా శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మీరు చెప్పిన పనులు చేయకపోతే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల్లోకి వెళ్లి వారిలో చైతన్యం తీసుకువచ్చి ప్రశ్నించేలా చేస్తామని హెచ్చరించారు ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు తుల ఉమా, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, ఏనుగు మనోహర్ రెడ్డి, కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# 24 గంటల్లో 19 ఆపరేషన్లు

**వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యుల సత్వర చర్యలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 12 (జనంసాక్షి)



నేను రాను బిడ్డ సర్కారు దావఖానకు అంటూ అనుకున్న క్రమంలో వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటలలో వివిధ రకాలలో 19 ఆపరేషన్లు చేసినట్లు సూపరిండెంట్ పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మంది గర్భిణీలకు డెలివరీలు అయ్యాయని, ఇందులో ఆరుగురికి ఆపరేషన్లు, ఐదుగురు సాధారణ కాన్పులు చేయడం జరిగిందన్నారు. ఇద్దరు మహిళలకు గర్భసంచికి సంబంధించిన వ్యాధుల వల్ల గర్భసంచినీ తొలగించడం జరిగినదని, ముగ్గురికి కంటి ఆపరేషన్లు, ఇంకో నలుగురికి జనరల్ సర్జరీలు చేయడం జరిగిందన్నారు. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో అన్ని రకాల స్పెషలిస్టు డాక్టర్ల సేవలు అందుబాటులో ఉన్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు ఇట్టి అవకాశాలను సద్వినియోగ పర్చుకోవాలని ఆయన తెలిపారు. ఆసుపత్రిలో రేడియాలజీ విభాగంలో ఎక్స్రేలు, స్కానింగ్,ఈసీజీ చేస్తున్నారని, అన్ని రకాల రక్త పరీక్షలు జరుగుతున్నాయని, చిన్నపిల్లల విభాగానికి సంబంధించిన ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు.గైనకాలజీ భాగంలో ముగ్గురు మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రొఫెసర్లు తమ సేవలను అందిస్తున్నారని, జనరల్ సర్జరీలో ఇద్దరు వైద్యులు ఆపరేషన్లు 24 గంటలు చేస్తున్నారని, ఆర్థోపెడిక్ డాక్టర్ అనిల్ 24 గంటలు అందుబాటులో ఉండి అన్నిరకాల ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. మోకాలి మార్పిడి ఆపరేషన్లు అవసరమైన వాళ్ళు డాక్టర్ అనిల్ ని సంప్రదించలని, జనరల్ ఫిజీషియన్ విభాగంలో ఇద్దరు డాక్టర్లు కంటి విభాగంలో డాక్టర్ రత్నమాల తమ సేవలను, రేడియాలజీ విభాగంలో సీనియర్ వైద్యులు డాక్టర్ రవీందర్ అవసరమైన రోగులకి స్కానింగ్ చేయుచున్నారన్నారు. వేములవాడ పరిసర ప్రాంత ప్రజలు ఎటువంటి అనారోగ్యానికి గురైన వాళ్లు ప్రాంతియా ఆసుపత్రిలో వైద్య సేవలు ఉచితంగా పొందాలన్నారు.

# ఉపాధి హామీ కూలీలపై అటవీ శాఖ అధికారుల దౌర్జన్యం

**•బీట్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలి..**
**•ఎఫ్ఆర్ఓ క్షమాపణ చెప్పాలి**
**•లేనిపక్షంలో ఫారెస్ట్ కార్యాలయం ముందు ధర్నాలు**
**•పోలీసులకు కూలీలతో కలిసి ఎంపీడీవో ఫిర్యాదు**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 13 (జనంసాక్షి)




అభివృద్ధి పనుల్లో కలిసిమెలిసి పనిచేయాల్సిన ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. పంచాయతీ రాజ్, అటవీశాఖ అధికారుల మధ్య కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం వివాదాస్పదం గా మారింది. వివరాల్లోకి వెళితే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని బోరిగం శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను స్థానిక అటవీ శాఖ బీట్ అధికారి రవి, మరి కొంతమందితో కలిసి అడ్డుకున్నారు. అడ్డుకోవడమే కాదు.. అప్రదే శంలో పనులు చేస్తున్న కూలీలపై దౌర్జన్యం ప్రదర్శించారు. అంతటితో ఆగకుండా నోటికి వచ్చినట్లు బూతు పదజాలం ఉపయోగించారు. ఈ విషయం తెలుసుకున్న కాగజ్ నగర్ ఎంపీడీవో బి.రమేష్ అక్కడికి చేరుకొని ఫారెస్ట్ బీట్ అధికారి రవితో మాట్లాడగా.. సదరు బీటు అధికారి ఎంపీడీవో రమేష్ తో సైతం దురుసుగా వ్యవహరించారు. ఎంపీడీవో, బీట్ అధికారి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. తన ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చి పనులను అడ్డుకొని, అక్కడ గల బొలెరో వాహనం యొక్క తాళం చెవి ,(కీ) సంబంధిత బీటాధికారి రవి బలవంతంగా లాక్కున్నారు. ఈ విషయంలో ఈజీఎస్ ఉద్యోగులకు, బీటధికారి రవికి మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీనిపై ఎంపీడీవో రమేష్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు చేపడుతున్న ప్రాంతం అటవీ శాఖ ప్రాంతంలో గాని, రిజర్వ్ ఫారెస్ట్ గాని లేదని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద రోడ్లు, కుంటలు, కాలువలు, ఇతరత్రా పనులు జరుగుతున్నాయ ని అన్నారు. ఇక్కడ జరుగుతున్న పనులకి సంబంధించి అటవీ శాఖ అధికారుల నుంచి అనుమతి ఉందని తెలిపారు. అధికారులు మారినంత మాత్రాన పనులకు సంబంధించిన రూల్స్ మారవని అన్నారు. తాను ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుపగా, కలెక్టర్ పై సైతం బీటాధికారి రవి పరుష పదజాలం వాడినట్లు ఎంపీడీవో రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తమ యూనియన్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత బీటాధికారిపై చర్యలు తీసుకోకపోతే అటవీ శాఖ కార్యాలయం ముందు ధర్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ కు ఈజీఎస్ కూలీలతో కలిసి సదరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రవిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. వీరికి మద్దతుగా సిపిఎం పార్టీ నాయకులు ముంజం ఆనంద్ కుమార్ పాల్గొన్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రవి వ్యవహరించిన తీరును ఆయన ఖండించారు. ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకొని ఇటువంటి దురదృష్టకర ఘటనలు మరొకసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు.

# పసుపు రైతుల అభివృద్ధే లక్ష్యం

## జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

ఆర్మూర్, మార్చి 12 ( జనం సాక్షి):



దేశవ్యాప్తంగా పసుపు రైతుల అభివృద్ధి తమ లక్ష్యమని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. ఆలూరు మండల కేంద్రం లో పసుపు రైతుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పసుపు సాగు విస్తరణ,మార్కెట్ సదుపాయాలు,ధర స్థిరీకరణపై ప్రభుత్వం కృషి చేస్తుందని, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా మార్కెట్ లో రైతులకు గిట్టుబాటు ధర లేని సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రనికి లేఖ రాస్తే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం క్రింద కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునే అవకాశం ఉందని పసుపు బోర్డు చైర్మన్ తెలిపారు.తరువాత నిపుణులు పసుపు ఉత్పత్తి మెరుగుపరిచేందుకు ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇచ్చారు.నాణ్యత ప్రమాణాలు, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలపై వివరించారు .రైతులు తమ అనుభవాలు పంచుకుని,పసుపు ధర స్థిరత్వం, ప్రభుత్వ మద్దతు ధర, ఎగుమతి సౌకర్యాలపై తమ సమస్యలను తెలియజేశారు.జాతీయ పసుపు బోర్డు రైతులకు అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ పల్లె గంగారెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సుందరిషణ్, ఫీల్డ్ ఆఫీసర్ రాజ్ మాణిక్యం,రైతు సంఘాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# నీరులేక ఎండిపోతున్న పంటలను కాపాడాలి

**ప్రాజెక్టుల నుండి నీటిని పొలాలకు, చెరువులకు తక్షణం విడుదల చేయాలి**

**తెలంగాణ రైతు సంఘం డిమాండ్**

హైదరాబాద్ (జనంసాక్షి)

2024-25 సంవత్సరం లో రాష్ట్రంలో 56లక్షల ఎకరాల్లో వరిపంటలు వేశారు. 7 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు వేశారు. నీరులేక ఇందులో 10లక్షల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయి. వీటిని కాపాడదానికి ప్రాజెక్టుల నుండి తక్షణం నీటిని విడుదల చేయాలని, చెరువులు నింపాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. ఈ సంవత్సరం పడిన వర్షాలకు ప్రాజెక్టులలో, చెరువులలో నీరు ఉండడం కారణంగా వానాకాలం 160 లక్షల టన్నుల వరిదాన్యం దిగుబడి వచ్చింది. యాసంగిలో కూడా 56లక్షల ఎకరాల్లో వరిపంట, మరో 7 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. ఇవికాక జొన్న, పప్పుదాన్యాలు, నూనెగింజల పంటలు కూడా వేశారు. నీటి లభ్యతను బట్టి పంటలు వేయడానికి వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ, ఇరిగేషన్ శాఖ అనుమతి ఇవ్వాలి. యాసంగి పంటలు వేసే టప్పుడు ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా ఉండడంతో రైతులు ఆదాయాన్ని ఆశించి పంటలు వేశారు. మరో నెల రోజుల్లో పంటలు కోతకు వస్తాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో దాదాపు 10లక్షల ఎకరాల వరిపంట నీరులేక ఎండిపోతున్నది. ఎకరాకు రూ.30,000లకు పైన పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోతున్నారు. చెరువులల్లో నీరు తగ్గడంతో భూగర్భ జలాలు కూడా పడిపోయాయి. దీనితో బావులకింద వేసిన పంటలు కోతకు వచ్చే సందర్భంగా ఎండిపోతున్నాయి.వ్యవసాయ శాఖకు ప్రణాళిక లేదన్నది ఈ సంఘటనతో బలపడుతున్నది. ఎండిపోతున్న పంటలను రక్షించడానికి రైతులు ఆందోళన చేపట్టినప్పటికీ ఏమాత్రం కదలిక రావడంలేదు. 5/3/2025 నాటికి పది ప్రాజెక్టులలో 346.42 టిఎమ్సీల నీరు నిల్వ ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ 150టిఎమ్సీలు పోగా 196.42 టిఎమ్సీల నీరు నిల్వ ఉంది. ఈ నీటిని విడుదల చేసి పంట పొలాలకు మరియు చెరువులు నింపడానికి యుద్ధ ప్రాతిపధికన చర్యలు చేపట్టాలి. కానీ, పంటలు ఎండిపోయి

పశువులకు మేపుకుంటున్నా వ్యవసాయశాఖ నిద్దుర పోతున్నది. రైతుల పెట్టుబడి నష్టాన్ని గుర్తించడం లేదు. ఇప్పటికైనా మరింత నష్టం జరగకుండా వెంటనే ప్రాజెక్టులనుండి నీటిని విడుదల చేయాలి. చెరువులు నింపడంద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. శ్రీశైలం (73.53 టిఎమ్సీలు), నాగార్జున సాగర్ (161.59 టిఎమ్సీలు), సింగూరు (22.48 టిఎమ్సీలు), శ్రీరాంసాగర్ (30.82 టిఎమ్సీలు), ఎల్.ఎమ్.డి (11.63 టిఎమ్సీలు), ఎల్లంపల్లి (12.89 టిఎమ్సీలు) నీరు ఉంది. పంటలకు వదిలినప్పటికీ రానున్న మూడు మాసాలకు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాదు. త్రాగునీటి పేరుతో నీటిని నిల్వ పెట్టడం పంటలను నష్టపరచడానికే. క్రిష్ణా, గోదావరి రివర్బోర్డులపై ఒత్తిడి తెచ్చి నీటిని విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేస్తున్నది.

## ప్రజా ప్రభుత్వంలో కొలువుల పండుగ




మక్తల్, మార్చి 12 (జనంసాక్షి)

తెలంగాణ ప్రజల అభీష్టం మేరకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం లో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభు త్వం అని, నిరుద్యోగుల కలను తీర్చే విధంగా కొలువుల పండుగను నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని మఖ్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. హైద్రాబాద్ రవీంద్ర భారతి వేదికగా ప్రజా ప్రభుత్వం లో కొలువుల పండుగ లో భాగంగా విద్య శాఖ లో 1532 మంది లెక్చరర్ ఉద్యోగ నియామక పత్రాలను తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందించగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో వేలాది ఉద్యోగాలను భర్తీ చేశామని, తాజాగా గ్రూప్ 1, గ్రూప్ 2 ఫలితాలు విడుదల చేశామని, త్వరలోనే ఉద్యోగ ఎంపికలు ఉంటాయని చెప్పారు. దీంతోపాటు వీలైనంత త్వరగా మరో డీఎస్సీ నోటిఫికేషన్ సైతం జారీ చేస్తామని చెప్పారు. నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతి కుమారీ, తదితరులు పాల్గొన్నారు.

# వెక్కిరిస్తున్న 'నిర్లక్ష్యం'....!



**•పట్టించుకునే వారు లేక నిరుపయోగంగా మారిన దుస్థితి**
**•ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న వైకుంఠధామం**
**•నిర్లక్ష్యం ధోరణిలో పంచాయతీరాజ్ అధికారులు**




మంగపేట మార్చి 12(జనంసాక్షి)

వైకుంఠ ధామం నిరుపయోగంగా మారి పెద్ద ఎత్తున పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అటవిని తలపిస్తూ పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్న దుస్థితి మండలంలోని పూరెడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పూరెడిపల్లి గ్రామశివారులో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నిర్మించిన వైకుంఠధామం పూర్తి అయినప్పటికి నేటి వరకు కూడా వినియోగంలోకి రాకుండా మిగిలిపోయింది అని పంచాయతీరాజ్ అధికారులు పూర్తిగా పట్టించుకోకపోవడంతో క్రిమిటోరియం ప్రాంగణం నిరుపయోగంగా మారి అంత పెద్ద పెద్ద పిచ్చి మొక్కలతో పూర్తిగా అటవీని తలిపించే విధంగా ఉందని కనీసం వైకుంఠధామంలోకి వెళ్ళడానికి కూడా దారి కనిపించని పరిస్థితి ఏర్పడింది అని గ్రామస్తులు వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల రూపాయలు వెచ్చించి నిర్మిస్తే కనీసం పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ప్రజాప్రతినిధుల పాలన లేకపోవడం కేవలం అధికారుల పాలన మాత్రమే కొనసాగుతున్నందున అధికారుల తీరు ఇష్టానుసారంగా మారింది అని ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి వైకుంఠధామాన్ని శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరారు.

# ప్రజావాణి ఫిర్యాదుపై ట్రైనీ కలెక్టర్ విచారణ

న్యాల్ కల్, మార్చి 12, (జనం సాక్షి)



పాతిక రోజుల క్రితం ఇరు వర్గీయులు నెలకొన్న భూ సమస్యపై నేరుగా "ప్రజావాణి" కి ఫిర్యాదు చేశారు. మండలం లోని గుంజేటి గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమిలో కొందరు ఇతర మతస్తుల జెండాలను ఏర్పాటు చేయడంతో స్థానిక రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి చర్యలు చేపట్టారు. ప్రజావాణిలో ఫిర్యాదు, ప్రభుత్వ స్థలంలో జెండాల ఏర్పాటును నేరుగా పరిశీలించేందుకు కలెక్టర్ ఆదేశం మేరకు బుధవారం ట్రైన్ కలెక్టర్ మనోజ్ కుమార్ వివాదాస్పద ప్రభుత్వ భూమిని పరిశీలించారు. జహీరాబాద్ ఆర్డీఓ రామ్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ భూపాల్ ల పర్యవేక్షణలో ప్రభుత్వ స్థలమైన సర్వే నెంబర్ 112లోని 59 ఎకరాల భూమిని పరిశీలించారు. ఫిర్యాదు చేసిన వర్గాలు, స్థానికులతో విచారణ చేపట్టి సమాచారాన్ని సేకరించారు. సేకరించిన వివరాలను కలెక్టర్ కు నివేదికను పంపనట్లు ట్రైనీ కలెక్టర్ మనోజ్ కుమార్ స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్ రావు, సర్వేర్ లాల్ సింగ్, స్థానిక రైతులు, తదితరులు ఉన్నారు.

# ఆడపిల్లల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

మక్తల్, మార్చి 12 (జనంసాక్షి)



జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లీగల్ ఆఫీసర్ కవిత మాట్లాడుతూ.. పిల్లలకు సమస్యలు ఉన్నప్పుడు 1098 అనే చైల్డ్ హెల్ప్ లైన్ కి ఏ టైంలో అయినా కాల్ చేసి పిల్లల వివరాలు చెప్పాలని అన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆడపిల్లల పట్ల దురుసుగా వ్యవహరిస్తే ఫోక్స్ యాక్టివ్ ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయని తెలిపారు. చైల్డ్ మ్యారేజ్, చైల్డ్ లేబర్ యాక్ట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, ఎం జె పి స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# కార్బైడ్ రహిత పండ్ల విక్రయాలకు జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి)




రానున్న మామిడి పండ్ల సీజన్ ను దృష్టిలో ఉంచుకొని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల సూచనల మేరకు మోజాం జాహీ మార్కెట్ లో బుధవా రం పండ్ల విక్రయదారులు పండ్ల పక్వానికి నిషేదిత కార్బైన్ ను ఉపయోగిస్తున్నారా అన్న అంశాన్ని పరిశీలించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, డిజిగ్నేటెడ్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ వాహనం, ల్యాబ్ టెక్నీషియన్లు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, పోలీసు టాస్క్ ఫోర్స్ బృందం పాల్గొన్నారు. ఎంజె మార్కెట్ లోని బాలాజీ ఫ్రూట్ మర్చెంట్, కాశ్మీర్ ఫ్రూట్ హౌస్, ఎన్.ఎస్.బి ఫ్రూట్ హౌస్, మదీనా ఫ్రూట్ హౌస్, క్రిస్పీ ఫ్రూట్ హౌస్ లను తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం మోజాం జాహీ మార్కెట్ లోని పండ్ల వ్యాపారులకు కార్బైడ్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, పండ్ల పక్వానికి తెలంగాణ ఆహార భద్రత కమిషనర్ సూచనలను పాటించాలని, అదేవిధంగా అనుమతించిన పదార్థాలను మాత్రమే పండ్ల పక్వానికి వినియోగించాలని అవగాహన కల్పించారు. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం పండ్లను పండించే పద్దతులను అనుసరించాలని అవగాహన కల్పించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
13 మార్చి 2025

## టీబీ రోగులు పోషకాహారం ఔషధాలు తప్పనిసరిగా తీసుకోవాలి



- టీబీ రోగులకు ఫుడ్ బాస్కెట్ పంపిణీ
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి,మార్చి 12 (జనంసాక్షి) :** పోషకాహారం లోపం వల్ల టిబి వస్తుంది కాబట్టి పోషకాలతో కూడిన ఆహారం, మందులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ లో డిఎంహెచ్ఓ కోటా చలంతో కలిసి టిబి రోగులకి ఫుడ్ బాస్కెట్ పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబి రోగుల కొరకు ప్రధాన మంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ పథకం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించటం జరిగిందని, టీబితో ఇబ్బంది పడే వారు తప్పనిసరిగా 6 నెలల పాటు టాబ్లెట్స్ వాడాలని అన్నారు.మధ్యలో టాబ్లెట్స్ వాడకపోతే జబ్బు తగ్గదని సూచించారు.నిక్షయ్ శివిర్ ద్వారా టిబి రోగులకు అవగాహన, స్క్రీనింగ్ చేయుటకు గాను డిసెంబర్ 17 నుండి మార్చి 17 వరకు 100 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 155 క్యాంపులు నిర్వహించామని,ఇంకా 20 క్యాంపులు మార్చి 17 లోపు పూర్తి చేస్తామని తెలిపారు.టిబి రోగులకు సహాయం చేసేందుకు ఫార్మా కంపెనీలు, ఇండస్ట్రీస్ వారు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వారికి సహాయం చేసేందుకు నిక్షయ్ మిత్రగా ఉండాలని అన్నారు.జిల్లాలో 913 మందికి ప్రస్తుతం చికిత్స జరుగుతుందని, అందరికి మార్చి నెలకి ఒక కేజీ కందిపప్పు, అర కేజీ ఆయిల్, కేజీ పల్లీలు, 3 కేజీల బియ్యం, 30 గుడ్లుతో కూడిన ఫుడ్ బాస్కెట్ ని జిల్లా కలెక్టర్ నిక్షయ్ మిత్రగా సొంతంగా టిబి రోగులకి పంపిణి చేశారు.ఈ కార్యక్రమం లో డిప్యూటీ డిఎంహెచ్ఓ మనోరమ, ప్రోగ్రాం అధికారిణి నాజీయా, పల్మానాలజిస్ట్ వెంకట పాపిరెడ్డి, డాక్టర్ రమ్య, డాక్టర్ హరిప్రసాద్, ఆశా వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారుల ఉత్సాహం

- 25 శాతం రిబేటు సదుపాయాన్ని వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్






**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 12 (జనంసాక్షి):** ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకునేందుకు స్వతహాగా ముందుకు వస్తున్నారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ద్వారా ప్రజలకు వెసులుబాటు కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోని తమ ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాలని అన్నారు.బుధవారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ అవగాహన సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు రిబేటును మినహాయిస్తూ వెంటనే ల్యాండ్ రెగ్యులైజేషన్ కు సంబంధించిన ప్రొసీడింగ్ లు జారీ చేయడం జరుగుతుందని వివరించారు. సూర్యాపేట మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 961 మంది ఫీజు చెల్లింపులు పూర్తి చేశారని, ఎల్ఆర్ఎస్ క్రింద 4 కోట్ల 88 లక్షల రూపాయలు రుసుము వసూలైనట్లు తెలిపారు.బుధవారం 36 మంది ఫీజు చెల్లింపు చేశారని, ఎల్ఆర్ఎస్ క్రింద19,66,000 రుసుము వసూలు అయిందని వివరించారు.మిగతా దరఖాస్తుదారులు కూడా నిర్ణీత గడువులోపు చెల్లించి తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలని, రిబేటు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.దరఖాస్తుదారుల సౌకర్యార్థం అన్ని మున్సిపాలిటీలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, దరఖాస్తుదారులు తమ సందేహాలపై హెల్ప్ డెస్క్ సంప్రదించవచ్చని తెలిపారు. బఫర్, ఎఫ్టిఎల్, చెరువులు, కుంటలు వంటి నిషేధిత జాబితాలో ప్రాంతాలను మినహాయిస్తే, ఇతర ప్రాంతాలలోని ప్లాట్లకు ఆన్ లైన్ లో సులభంగా అనుమతి లభిస్తుందని అన్నారు.చెరువులు నీటి వనరులకు సమీపంలో కనీసం 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరి అని వెల్లడించారు.ఎల్ఆర్ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులు 90 శాతం రిఫండ్ అవుతుందని, 10శాతం ప్రాసెసింగ్ చార్జెస్ కింద తీసుకుంటారని అన్నారు.స్థలాల క్రమబద్ధీకరణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ,అర్హత ఉన్న ప్రతి ఒక్కరు తమ స్థలాలనుఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించినట్లయితే వెంటనే ప్రొసీడింగ్ జారీ చేస్తామని తెలిపారు. 2020 ఆగస్టు 26 నాటి వరకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ కలిగి గతంలో ఎల్ఆర్ఎస్ కొరకు ఒక వెయ్యి రూపాయలు చెల్లించిన వారు వెంటనే ఎల్ఆర్ఎస్ లాగిన్ ద్వారా ఫీజు చెల్లించి, 25 శాతం రిబేటు పొందాలని అన్నారు. అనుమతి లేని లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే రానున్న కాలంలో ప్రజలు ఇబ్బందులకు గురయ్యే ఆస్కారం ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వం కల్పించిన సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు ,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సబ్ రిజిస్ట్రార్ అంబేద్కర్,టిపిఓ సోమయ్య, టిపిఓఎస్ శశికుమార్, ఆర్ఓ కళ్యాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంతో గిరిజన తండాల అభివృద్ధి

- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కేంద్ర ప్రభుత్వ పథకాలకు పైలట్ గ్రామంగా రంగుండ్ల తండ
- పథకాలపై ప్రజలకు అవగాహన



తిరుమలగిరి (సాగర్) , మార్చి 12 (జనంసాక్షి): దర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద తిరుమలగిరి (సాగర్) మండలం రంగుండ్ల తండాలో మౌలిక వసతుల కల్పనకై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం తండాను సందర్శించారు .ఈ సందర్భంగా ఆమె అక్కడి ప్రజలతో ఈ పథకం కింద పనులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలు, తదితర అంశాలపై ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకై పనులు చేపట్టడం, కనీస వసతులు ఏర్పాటు చేయడం వంటివి ఆయా శాఖల ద్వారా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు .ఈ పథకం కింద తండాను పైలట్ గ్రామంగా ఎంపిక చేయడం జరిగిందని , దీనిలో భాగంగా తండాలో జల్ జీవన్ కింద పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా వర్షపునీటి కట్టడాలను చేపట్టాలని, గ్రామంలో అన్ని ప్రభుత్వ సంస్థలలో సోలార్ లైట్లు ఏర్పాటు,10 హెచ్ పి సోలార్ పంపు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఐసిడిఎస్ ద్వారా అంగన్వాడి నిర్మాణం, లైబ్రరీ ,స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఎం ఎస్ ఎం కింద మిరప పంటకు సంబంధించి ఒక యూనిట్ ఏర్పాటు చేయాలన్నారు .వ్యక్తిగతంగా చేపలు పట్టుకునేందుకు ఒక ఎకరం స్థలంలో డిమానిస్ట్రేషన్ బ్లాక్ ఏర్పాటు చేయాలని, ఉద్యాన పంటల కింద సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ వంటివి ,ఈ పథకం ద్వారా రైతులకు కేంద్ర ప్రభుత్వం చే అవసరమైన నిధులు సమకూర్చడం జరుగుతుందని , జిల్లాలోని అన్ని గ్రామాలలో జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకము అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆమె సమీక్ష నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఈమెతో పాటు జిల్లా ఇన్చార్జి గిరిజన అభివృద్ధి అధికారి గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్ నాయబ్ తహసీల్దార్ నాగమణి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్లీశ్వర్ , ఎంపీవో భిక్షం రాజు తదితరులు ఉన్నారు.



## కల్లూరులో భద్రాద్రి బ్యాంక్ 18వ శాఖ ప్రారంభం

**ఖమ్మం, మార్చి 12 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా కల్లూరులో నూతనంగా ఏర్పాటు చేసిన భద్రాద్రిలో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ను చెరుకూరి కృష్ణమూర్తి, చైర్మన్ భద్రాద్రి బ్యాంక్ ను ప్రారంభించారు. క్యాష్ కౌంటర్ ను రైస్ మిల్స్ అసోసియేషన్ కల్లూరు ప్రెసిడెంట్ చారుగుండ్ల అచ్యుత సీతారామారావు ప్రారంభించారు. బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణ మూర్తి మాట్లాడుతూ. తమ బ్యాంక్ రూ 930 కోట్లుతో వ్యాపారం నడుస్తుందని తెలిపారు. గృహ, వ్యాపార, విద్య, చిన్న తరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు రుణాలను తక్కువ వడ్డీకి అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని అర్హులందరు వినియోగించుకోవాలని సూచించారు. ప్రైవేట్ రంగంలో ఉన్న సహకార బ్యాంకు ఖాతాలకు మెరుగైన సేవలు అందించాలని పసుమర్తి చందర్ రావు ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం, ప్రెసిడెంట్ కోరారు. ఈ కార్యక్రమం లో బ్యాంకు సి ఈ ఓ దాసరి వేణుగోపాల్, బ్యాంకు డైరెక్టర్లు దేవత రాజారావు, మద్ది పిచ్చయ్య వైస్ చైర్మన్ నన్నే ఉదయ్ ప్రతాప్, వేముల పల్లి వేంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ మరియు బ్యాంక్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.



## చివరి ఆయకట్టుకూ సాగునీరందాలి

- ఇరిగేషన్ అధికారులకు రైతులు సహకరించాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

**కనగల్లు, మార్చి 12 (జనం సాక్షి) :** ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు ఎండిపోకుండా ఆయకట్టు చివరి భూముల వరకుసాగునీరు అందించేందుకు జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఇందుకుగాను రైతులు కాలువలకు గండ్లు కొట్టడం, నీరు మళ్ళించుకోవడం వంటివి చేయవద్దని, వారి పరిధిలో ఉన్న ఫీడర్ ఛానళ్లు, సబ్ మైనర్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకున్నట్లయితే సాగునీరు సులభంగా వస్తుందని, అలాగే వచ్చే సీజన్ కు నీరు సులభంగా అందుతుందని అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ గుర్రంపోడు, కనగల్ మండలాల పరిధిలో డి-25 కెనాల్ ను తనిఖీ చేశారు .ఈ కాల్వ కింద కాల్వ చివరి భూముల వరకు సాగునీరు అందుతున్నది లేనిది పరిశీలించారు. గుండ్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద ,అలాగే మారేపల్లి వరకు కాలువను తిరిగి పరిశీలించిన తర్వాత ఆమె మాట్లాడుతూ అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి ఈరోజు ఎక్కువ నీటిని విడుదల చేసినందున రాత్రి లోపు ఈ కాలువ చివరి వరకు సాగునీరు వచ్చే అవకాశం ఉందని, వచ్చే నీళ్లన్నింటిని జాగ్రత్తగా వాడుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా కాలువలు,సబ్ మైనర్లలో చెట్లు, పిచ్చి మొక్కలు వంటివి లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, వచ్చే సీజన్ కు ఇది బాగా ఉపయోగపడుతుందని తెలిపారు .ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ,పోలీస్, తదితర శాఖల అధికారులు సైతం వచ్చే నీటిని బాధ్యతగా ఆయకట్టు చివరి భూముల వరకు అందించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నెహ్రూ తాసిల్దార్ పద్మ, ఎంపీడీవో సిటి జయరాం ,మండల వ్యవసాయ అధికారి అమరేందర్ గౌడ్, ఇరిగేషన్ డి ఈ లు, ఏఈలు ఆర్. డబ్ల్యూ. ఎస్ ఏ ఈ షఫీ ఉద్దీన్ లు ఉన్నారు.

## సేంద్రియ ఎరువులు వాడిన పంట ఆరోగ్యానికి మేలు

- ఐటీడీఏ పిఓ బి. రాహుల్



**బూర్గంపహాడ్ మార్చి 12 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:- ప్రజల ఆరోగ్యాన్ని హాని తలపెట్టే పంటలు కాకుండా ఆర్గానిక్ సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, అటువంటి పంటలు పండించే విధంగా ఆదివాసి గిరిజన రైతులకు సాగులో మెలకువలు సూచనలు సలహాలు అందించాలని అభ్యుదయ రైతు లక్ష్మారెడ్డి ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. బుధవారం బూర్గంపహాడ్ మండలం గుట్ట లక్ష్మీపురం గ్రామంలోని అభ్యుదయ రైతు సేంద్రీయ ఎరువులతో సాగు చేస్తున్న పుచ్చకాయ, మిరప, జామ పంటలను ఆయన పరిశీలించారు. పంటలు సాగు చేస్తున్న విధానాన్ని యాజమాన్య పద్ధతుల గురించి రైతును అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడానికి ఆర్గానిక్ పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. అభ్యుదయ పామాయిల్ మొక్కలు పెంచుతూ అంతర్ పంటలుగా రైతు సాగు చేస్తున్న పుచ్చ, మిరప పంటలు సాగు చేస్తున్న విధానం చాలా బాగుందన్నారు. 20 లక్షల ఖర్చుతో 20 ఎకరాలలో పుచ్చకాయ పంట సాగు చేస్తున్నానని, ఎకరానికి అసాధారణమైన పుచ్చకాయ దిగుబడి వస్తుందని, కలకత్తా వారు అందించే ఈ మ్యాక్స్ విత్తనం ద్వారా ఈ పంట సాగు చేస్తున్నానని, మార్కెటింగ్ సౌకర్యం కూడా కలకత్తా వారే కొనుగోలు చేస్తారని, 70 రోజులలో జాగ్రత్తగా కాపాడుకుంటే పంట చేతికి వస్తుందని, ఎకరానికి 25 టన్నుల పుచ్చకాయ దిగుబడి వస్తుందని అలాగే పొన్నుస్వామి సేంద్రియ ఎరువులతో పండించే మిరప తోట నాలుగు ఎకరాల వరకు చేస్తున్నానని ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని పిఓకి తెలిపారు. ఎటువంటి హానికరం లేకుండా ఆరోగ్యకరమైన పంటలు పండిస్తున్న లక్ష్మారెడ్డిని గిరిజన రైతులు ఆదర్శంగా తీసుకొని సేంద్రియ పంటలపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి అగ్రికల్చర్ ఉదయభాస్కర్, హార్టికల్చర్ అధికారి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలి

- కొమరం భీం జిల్లా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో మార్చ్ 13 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రజలకు లాభం చేకూర్చే విధంగా అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్ పథకాన్ని అధికారులు ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్, కాగజ్ నగర్ మున్సిపల్ ప్రత్యేక అధికారి దీపక్ తివారి అన్నారు. బుధవారం కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ పథకం, ఆస్తి పన్ను, నీటి పన్నులపై సంబంధి శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చి 31 లోగా ఎల్ఆర్ఎస్ పథకం కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి 25% ఎల్ఆర్ఎస్ స్కీం కింద ఫీజు ఉంటుందని తెలిపారు. సాదా బైట్ నామాలు, లేవడు వెంచర్లలో ప్లాట్ లకు సైతం ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తదితర శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# విపణి

## సరికొత్త శాంసంగ్ ఎఫ్ 16

### 6 ఆండ్రాయిడ్ అప్‌డేట్స్‌తో ..



**(జనంసాక్షి):**ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ శాంసంగ్ భారత్‌లో తక్కువ ధరలో మరో 5జీ ఫోన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎఫ్15కి కొనసాగింపుగా గెలాక్సీ ఎఫ్16 5జీ మొబైల్‌ను లాంచ్ చేసింది. ఆరు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్‌తో ఈ ఫోన్ విడుదల చేస్తుండడం విశేషం. ప్రారంభ ధర రూ.11,499గా కంపెనీ నిర్ణయించింది.శాంసంగ్ కొత్త మొబైల్ ఫీచర్ల విషయానికొస్తే.. 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ అమోలెడ్ డిస్‌ప్లేతో వస్తోంది. 90ఊళి రిఫ్రెష్ రేటు, 800నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగిఉంటుంది. మీడియా టెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్‌తో తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ 15 ఆధారిత వన్ యూఐ7తో పని చేస్తుంది. 50 ఎంపీ ప్రధాన కెమెరా, 5 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా, 2 ఎంపీ మాక్రో కెమెరా ఇచ్చారు. ముందువైపు సెల్ఫీ కోసం 13 ఎంపీ కెమెరా ఇచ్చారు. 5,000ఎంఏహెచ్ బ్యాటరీ, 25చి ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. యూఎస్‌బీ టైప్‌- సీ పోర్ట్, అదనపు స్టోరేజీ కోసం మైక్రో ఎస్‌డీ కార్డ్ స్లాట్ సదుపాయం కూడా ఉంది. మార్చి 13 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయని ఫ్లిప్‌కార్ట్ బ్యానర్ చూస్తే స్పష్టమవుతోంది. బింగ్ బ్లాక్, కామ్ గ్రీన్, వైబింగ్ బ్లూ రంగుల్లో లభిస్తుంది.

## ర్యాపిడో ఇక.. ఫుడ్ డెలివరీ విభాగంలోకి



(జనంసాక్షి):ఫుడ్ డెలివరీ విభాగం ఊపందుకుంటోంది. నచ్చిన ఆహార పదార్థాలను నిమిషాల్లోనే ఇంటికి తెచ్చి ఇస్తుండటంతో వీటికి ఆదరణ పెరుగుతోంది. ఇప్పటికే ఈ విభాగంలో ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థలైన స్విగ్గీ జొమాటో రాణిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రముఖ క్యాబ్ బుకింగ్ సేవల సంస్థ ర్యాపిడో ఈ తరహా సేవల్ని అందించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.ఫుడ్ డెలివరీ విభాగంలో ప్రస్తుతం స్విగ్గీ, జొమాటో.. రెండు సంస్థలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. దీంతో ఈ విభాగంలో గట్టి పోటీ ఇచ్చేందుకు ర్యాపిడో ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఫుడ్ డెలివరీలు అందించేందుకు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అందులోభాగంగానే పలు రెస్టరంట్‌ల నిర్వాహకులతో సంస్థ ప్రతినిధులు భేటీ అయినట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లలో అమలుచేస్తున్న కమిషన్ విధానాన్ని సవాలు చేసే లక్ష్యంతో వ్యాపార ప్రణాళికపై కసరత్తు చేస్తోంది. 2015లో ర్యాపిడో క్యాబ్ బుకింగ్ సేవల్ని ప్రారంభించింది.

## వర్క్- లైఫ్ బ్యాలెన్స్ లేక 'బర్న్‌వుట్'

### తీవ్రమానసిక ఒత్తిడిలో 52 శాతం మంది ఉద్యోగులు



**(జనంసాక్షి):**వర్క్‌-లైఫ్ బ్యాలెన్స్ గురించి ఈ మధ్యకాలంలో పెద్ద చర్చ నడుస్తోంది. ప్రముఖ సంస్థలకు చెందిన సీఈవోలు, యజమానులు కొందరు ఆదివారాలు కూడా పనిచేయమని చెప్తుంటే..మరికొందరు ఉద్యోగుల తరఫున మాట్లాడుతున్నారు. ఈ చర్చఎలా ఉన్నా.. తాజాగా ఓ సర్వే మాత్రం కీలక విషయాలు వెల్లడించింది. వ్యక్తిగత, వృత్తిగత జీవితాన్ని సమతుల్యం చేయలేక 52 శాతం మంది ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని న్యూయార్క్ కేంద్రంగా నడుస్తోన్న వర్టెక్స్ గ్రూప్ వెల్లడించింది. దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 1500 మందిపై ఈ సర్వే నిర్వహించి ఫలితాలు వెల్లడించింది."వర్క్‌-లైఫ్ బ్యాలెన్స్ అత్యావశ్యకం. ఐటీ సెక్టార్‌లో ఇది మరీ ముఖ్యం. ఉద్యోగుల అంచనాలను సంస్థలు పరిగణనలోకి తీసుకోవాలి. వారాంతాల్లో పనిభారం మోపకూడదు. కొత్తవారానికి రీఛార్జి అయ్యి వచ్చేందుకు వారాంతాల్లో సమయం ఉండాలి. అత్యవసరమైతే తప్ప, ఈ సమయంలో పని అప్పగించకూడదు" అని వర్టెక్స్ గ్రూప్ వ్యవస్థాపకులు గగన్ అరోఢా వెల్లడించారు. 23 శాతం మంది ఉద్యోగులు సాధారణ పనిగంటలకు మించి పనిచేస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. ఉద్యోగుల మానసిక ఆరోగ్యం సంస్థ వృద్ధికి కీలకమని పేర్కొంది. వృత్తి సంబంధిత ఒత్తిడి కారణంగా వ్యాపారవేత్తలు, ఉద్యోగుల అకాల మరణాలు.. అత్యంత ఒత్తిడితో కూడిన వృత్తుల్లో ఆరోగ్యానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తున్నాయని తెలిపింది.8, 9 గంటల షిఫ్ట్‌లో 20 శాతం మంది సిబ్బంది 2.5 గంటల నుంచి 3.5 గంటలు మాత్రమే సరిగ్గా పనిచేస్తున్నారని, పనిగంటలు పెంచడం వల్ల వారిలో ఉత్పాదకత, సృజన దెబ్బతింటోందని సర్వే పేర్కొంది. "ఈ సాంకేతికత యుగంలో వర్క్‌-లైఫ్ బ్యాలెన్స్ సరిగా లేకపోవడం వల్ల రోబోలుగా మారుతున్నారు. ఒక్కోసారి మరణాలు సంభవిస్తున్నాయి. పనిగంటలు పెంచే బదులు నైపుణ్యాలు, ఉత్పాదకతను పెంచడానికి సాంకేతికతను ఉపయోగించుకోవడం ముఖ్యం" అని గగన్ అభిప్రాయపడ్డారు.గతంలో ఇదే అంశంపై ప్రముఖ జాబ్‌సైట్ ఇండీడ్ 'ఫ్యూచర్ కెరీర్ రిజల్యూషన్ రిపోర్ట్‌ను' విడుదల చేసింది. సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో ఐదుగురిలో నలుగురు (78 శాతం) కుటుంబ బంధాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఇండీడ్ తెలిపింది. 2025లో కెరీర్‌లో రాణించడం కంటే భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో గడపడానికే అధిక ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు. తక్కువ పని ఒత్తిడి ఉండేలా చూసుకోవడంతో పాటు మానసిక ఆరోగ్యంపైనా దృష్టి పెట్టాలనుకుంటున్నట్లు ఉద్యోగులు తెలిపారు. భారతీయ ఉద్యోగుల్లో పని, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతూకం కోరుకునే వారి సంఖ్య పెరుగుతోందని ఇండీడ్ మార్కెటింగ్ డైరెక్టర్ రాచెల్ టౌన్స్లీ పేర్కొన్నారు. అంతేకాదు ఎక్కువ సంపాదించడం ముఖ్యమే అయినా అదే జీవితం కాదని చాలా మంది భావిస్తున్నారని చెప్పారు. భద్రత, పనికి సరైన వేతనం, ఇతర ప్రయోజనాలు వంటివి కూడా చూస్తున్నారని తెలిపారు.

## స్వల్ప నష్టాల్లో సూచీలు..




**(జనంసాక్షి):** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలను పడేశాయి. అమెరికాలో వృద్ధి నెమ్మదించడం, ఆర్థిక మాంద్యానికి దారి తీస్తుందనే భయాల నేపథ్యంలో దేశీయ ఐటీ స్టాక్స్ నేడు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్ యాజమాన్యం నుంచి మదుపర్లలో నమ్మకాన్ని పాదుగొల్పే ప్రకటనలు రావడంతో నిన్న భారీగా పతనమైన బ్యాంక్ షేర్లు.. ఇవాళ 5 శాతం మేర రాణించాయి.సెన్సెక్స్ ఉదయం 74,270.81 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,102.32) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. తర్వాత స్వల్పంగా కోలుకుంది. ఇంట్రాడేలో 73,598.16 - 74,392.15 మధ్య చలించింది. చివరికి 72.56 పాయింట్ల నష్టంతో 74,029.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 27.40 పాయింట్లు కోల్పోయి 22,470.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.21గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, నెస్లే ఇండియా, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.23 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2,922 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

### ఈక్విటీ ఫండ్స్‌లోకి తగ్గిన పెట్టుబడులు



(జనంసాక్షి):దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాలు ఎదుర్కొంటున్న వేళ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. జనవరితో పోలిస్తే మ్యూచువల్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు 79 శాతం మేర క్షీణించాయి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడులైతే 26 శాతం తగ్గి రూ.29,303 కోట్లకే పరిమి తమైంది. జనవరిలో ఈ మొత్తం రూ.39,687 కోట్లుగా ఉంది. ఈ మేరకు భారత మ్యూచు వల్ ఫండ్ల సంఘం (యాంఫీ) ఫిబ్రవరి నెలకు సంబంధించిన గణాంకాలను బుధవారం విడుదల చేసింది. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో జనవరిలో నెలలో అత్యధికంగా రూ.1.28 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. ఫిబ్రవరి నెలలో తిరోగమనం కనిపించింది. ఈ కేటగిరీ నుంచి రూ.6,525 కోట్ల మేర పెట్టుబడులు తరలిపోయాయి.ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ కేటగిరీలోని 11 ఫండ్స్‌లో సెక్టోరల్/ థీమాటిక్ ఫండ్స్ అత్యధికంగా రూ.5,711 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లోకి రూ.5,104 కోట్ల ఫండ్స్ తరలివచ్చినట్లు యాంఫీ డేటా పేర్కొంది. డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్‌లోకి కనిష్ఠంగా రూ.68.75 కోట్లు మాత్రమే వచ్చాయి. ఫోకస్డ్ ఫండ్స్‌లో మాత్రం కొద్ది మొత్తంలో పెట్టుబడులు పెరిగాయి. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులు 35 శాతం తగ్గాయి. జనవరిలో రూ.5,720 కోట్లుగా ఉన్న ఈ మొత్తం ఫిబ్రవరిలో రూ.3,722 కోట్లకు చేరింది.




## కాగ్నిజెంట్ ఉద్యోగులకు బోనస్ లెటర్స్..

(జనంసాక్షి): ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ ఉద్యోగులకు బోనస్ చెల్లింపులకు సంబంధించి లెటర్స్ పంపించడం ప్రారంభించింది. 2024 సంవత్సరానికి సంబంధించి అర్హులైన ఉద్యోగులకు 85-115 శాతం మేర బోనస్‌ను చెల్లించనుంది.మెజారిటీ సంఖ్యలో ఉద్యోగులు బోనస్‌కు అర్హత సాధించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వారంలోనే ఉద్యోగులకు బోనస్ లెటర్లు మెయిల్ ద్వారా అందనున్నాయి.బోనస్ చెల్లింపులు అందుకున్న ఉద్యోగులకు మార్చి, ఏప్రిల్ నెలల్లో చెల్లింపులు జరుగుతాయి. వ్యక్తిగత పే రోల్ షెడ్యూల్ ప్రకారం ఈ చెల్లింపులు ఉంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. గడిచిన మూడేళ్లతో పోలిస్తే ఈసారి బోనస్ మొత్తం అధికమని పేర్కొన్నాయి. అలాగే, పనితీరు ఆధారంగా చెల్లించే వేతన పెంపు ఈ ఏడాది ఆగస్టులో చేపట్టనుంది. గతేడాది కూడా ఇదే సమయంలో వేతన పెంపు చేపట్టింది. అంతకుముందు ఏప్రిల్‌లోనే వేతన పెంపు చేపట్టినప్పటికీ.. గతేడాది నుంచి ఆగస్టుకు మార్చింది.




## రన్యారావు వివాహానికి ముఖ్యమంత్రి సిద్ధు..

**బెంగళూరు (జనంసాక్షి):**దుబాయ్ నుంచి విమానంలో అక్రమంగా బెంగళూరుకు బంగారాన్ని తెస్తూ దొరికిపోయిన నటి రన్యారావు కేసులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. నటి వివాహ వేడుకలో ఆమెతో కలిసి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిగిన ఫొటో తాజాగా వెలుగులోకి వచ్చింది. భాజపా నేత అమిత్ మాలవీయ ఈ ఫొటోను 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు."రన్యారావు స్మగ్లింగ్ కేసుకు సంబంధించిన సమస్య ఇప్పుడు సీఎం సిద్ధరామయ్య ఇంటి వరకు వచ్చింది. ఈ ఫొటోలో హోంశాఖ మంత్రి జి. పరమేశ్వర కూడా ఉన్నారు. ఈ కేసులో రాజకీయ సంబంధాలు లేవంటూ డీకే శివకుమార్ కొట్టి పారేశారు" అంటూ అమిత్ మాలవీయ విమర్శలు గుప్పించారు. స్మగ్లింగ్‌లో ఆమెతో సంబంధమున్న వ్యక్తులను గుర్తించేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆమెకు సంబంధించిన ప్రదేశాలు, వివాహం అయిన హోటల్‌కు వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు. నటి పెళ్లికి హాజరైన అతిథులు, వారిచ్చిన కానుకలపై దృష్టి సారిస్తున్నారు.ఈ క్రమంలోనే రన్యారావు వివాహ వేడుకకు సీఎం సిద్ధరామయ్య హాజరైన ఫొటో బయటకు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ స్మగ్లింగ్‌లో ఆయన పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు, నటి బెయిల్ కోసం ప్రత్యేక కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే కేసులో మరికొన్ని కీలక విషయాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. విమానాశ్రయంలో ఆమె తనిఖీలు తప్పించుకునేందుకు సాయం చేసిన అధికారికి.. సంబంధిత శాఖ అధికారుల నుంచి సూచనలు అందాయని న్యాయస్థానానికి డీఆర్ఐ తెలిపింది. ఇటీవల దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.2 కిలోల బంగారంతో వచ్చిన ఆమెను.. విమానాశ్రయం నుంచి నిష్క్రమించే చివరి నిమిషంలో అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తరచూ దుబాయ్‌కు వెళ్లడం.. వెళ్లిన ప్రతిసారీ ఒకే రకమైన దుస్తులు ధరించడంతో అనుమానం వచ్చి ఆమెపై నిఘా పెట్టగా ఈ స్మగ్లింగ్ వ్యవహారం బయటపడింది. దీంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



## ఎల్జీపై కేసుల ఉపసంహరణ

### ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ రాజధాని దిల్లీలో కీలక పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి. గతంలో లెఫ్టినెంట్ గవర్నర్.. దిల్లీ ప్రభుత్వం మధ్య పలు విషయాల్లో వివాదాల కారణంగా నమోదైన కేసులను ఉపసంహరించుకునేందుకు సీఎం రేఖా గుప్తా నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు సంబంధింత వర్గాలు వెల్లడించాయి.ఆద్మీ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్లు నజీబ్ జంగ్, అనిల్ బైజల్, వీకే సక్సేనా మధ్య కొన్ని అంశాలపై అభిప్రాయాలు కుదరలేదు. విభేదాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దిల్లీ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఆఇఖీఅ) ఛైర్మన్, దిల్లీ జల్ బోర్డు నిధులు, అల్లర్ల కేసులో న్యాయవాదుల నియామకం, విదేశాల్లో ఉపాధ్యాయ శిక్షణ, యమునా నది కాలుష్యంపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు ఇలా తదితర విషయాల్లో గవర్నర్లు, ప్రభుత్వం మధ్య వివాదాలు తలెత్తాయి.కొట్టుకుపోయిందా? కిడ్నాప్ చేశారా?: మిస్టరీగా మారిన సుదీక్ష కోణంకి మిస్సింగ్ కేసుగవర్నర్ ప్రభుత్వ కార్యక్రమాలకు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగిస్తున్నారంటూ నాడు సీఎంగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. వారికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేశారు. ఆతీశీ హయాంలోనూ ఇదే జరిగింది. ఆప్ ప్రభుత్వం తమకు సహకరించడం లేదంటూ గవర్నర్లు ఆరోపించిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గవర్నర్లకు వ్యతిరేకంగా కేసులు నమోదయ్యాయి. వారికి వ్యతిరేకంగా ఉన్న కేసులు, న్యాయపరమైన చిక్కులను విప్పేందుకు భాజపా ప్రభుత్వం యోచిస్తోంది. కేసులను ఉపసంహరించేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

## త్రిభాషా సూత్రానికి సుధామూర్తి మద్దతు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య తీవ్ర వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే.ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనూ దీనిపై ఎంపీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ, ప్రముఖ వితరణశీలి సుధామూర్తి దీనిపై మాట్లాడుతూ.. త్రిభాషా సూత్రానికి మద్దతు పలికారు. ఎక్కువ భాషలు నేర్చుకోవడం పిల్లలకే మంచిదన్నారు."ఒక వ్యక్తి అనేక భాషలు నేర్చుకోవాలని సూచిస్తాను. నాకు 7-8 భాషలు వచ్చు. నేర్చుకోవడాన్ని నేను చాలా ఇష్టపడతా. పిల్లలు కూడా దీని వల్ల మంచి ప్రయోజనాలు పొందుతారు" అని సుధామూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందీ వివాదం వేళ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.త్రిభాషా సూత్రం అమలుపై ప్రతిపక్షాలు, ముఖ్యంగా డీఎంకే పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం దీనిపై మాట్లాడుతూ.. "ద్విభాషా పద్ధతిపై తమిళనాడు చాలా స్పష్టంగా ఉంది. ప్రపంచ శాస్త్ర, సాంకేతికత, వాణిజ్య విధానాలతో అనుసంధానం కోసం ఆంగ్లం నేర్చుకోవాలి. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం కోసం తమిళం ఉండాలి. ఒకవేళ మూడో భాషను నేర్చుకోవాలంటే అది విద్యార్థుల అభీష్టానికి వదిలేయాలి. అంతేగానీ.. తప్పనిసరి అంటూ బలవంతంగా రుద్దకూడదు. కేంద్రం చర్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం" అని అన్నారు.అయితే, ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తిప్పికొట్టారు విద్యార్థులు చదువుకునే హక్కును హరించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. విద్యా విధానాల అమలు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

## నీతీశ్‌తో వాగ్వాదం.

### ఆగ్రహంతో రబ్రీ దేవి వాకౌట్

**పట్నా(జనంసాక్షి):** బిహార్ శాసనమండలిలో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మాజీ సీఎం రబ్రీ దేవి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకొంది. నీతీశ్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఆమె ప్రతిపక్షాలతో కలిసి సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్జేడీ మిత్రపక్షమైన సీపీఐ(ఎమ్ఎల్) నేత ఎమ్మెల్సీ శశి యాదవ్ అడిగిన ఓ ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పింది. దీనిపై స్పందించిన రబ్రీ దేవి ప్రభుత్వం ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదంటూ వ్యాఖ్యానించారు. వెంటనే నీతీశ్ కుమార్ మాట్లాడుతూ.. "మా ప్రభుత్వం రాష్ట్రం కోసం ఎంతో చేసింది. గతంలోని ప్రభుత్వం ఎలాంటి మేలు చేయలేదు" అని ఆరోపించారు. రాష్ట్ర మహిళలకు ఇప్పుడున్నంత గౌరవం గత ప్రభుత్వాల హయాంలో లేదని అన్నారు."వారు మహిళల కోసం ఏం చేశారు..?తన భర్త సమస్యల్లో ఉన్నప్పుడు ఆమెను సీఎం కుర్చీలో కూర్చోబెట్టారు" అంటూ సీఎం వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై రబ్రీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "నాడు ఎలాంటి పనులు జరగలేదని వ్యాఖ్యానించడం కాదు.. వాటి రికార్డులు సభకు చూపించగలరా..?" అని ప్రశ్నించారు. అనంతరం సభ నుంచి ప్రతిపక్షాలతో కలిసి వాకౌట్ చేశారు.

# జాతీయం అంతర్జాతీయం

## చొరబాటు దారులపై చర్యలు వేగవంతం

### 2601 మంది బంగ్లాదేశీయులు అదుపులోకి..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్‌లోకి బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ సరిహద్దులో భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన 2601 మంది బంగ్లాదేశీయులను భారత బలగాలు అరెస్టు చేసినట్లు 2024 జనవరి నుంచి ఈ ఏడాది జనవరి మధ్య కాలంలో వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజ్యసభలో ఈమేరకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.నేపాల్‌లో ట్రెండింగ్‌లో యోగి ఆదిత్యనాథ్.. ఎందుకంటే..?భారత్‌-బంగ్లా సరిహద్దు ప్రాంతంలో భద్రతను బలోపేతం చేయడానికి అధునాతన నిఘా, సాంకేతిక వ్యవస్థ, సమగ్ర ఇంటిగ్రేటెడ్ బోర్డర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (అఎఃఓూ) వంటివి వినియోగిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా నిరంతర పెట్రోలింగ్, చొరబాటుకు అవకాశం ఉన్న ప్రదేశాల్లో ఫ్లడ్‌లైట్లు, సోలార్ లైట్లు ఏర్పాటు, నదీ ప్రాంతాల్లో నిరంతరం పడవలతో పహారా చేపడుతున్నామన్నారు. బీఎస్‌ఎఫ్ నేతృత్వంలోని 15 మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేస్తున్నాయని వెల్లడించారు. గతేడాది ఆగస్టు 5న హసీనా ప్రభుత్వం పతనమైన అనంతరం తాజాగా ఇరు దేశాల భద్రతా బలగాల అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారుల మధ్య చర్చలు జరిగాయని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా భారత్‌-బంగ్లా మధ్యనున్న 4,096 కిలోమీటర్ల పొడవైన సరిహద్దులో కంచె లేని ప్రాంతాల్లో కంచె వేయడానికి అంగీకారం కుదిరిందని పేర్కొన్నారు.



## ఏసీ కోచ్‌లో ఎలుకలు..

### ప్రయాణికుడి ఆగ్రహం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రైళ్లలో అందించే ఆహారం నాసిరకంగా ఉందనో, టాయిలెట్‌లు బాలేదనో, రైళ్లు ఆలస్యమయ్యాయనో ప్రయాణికులు సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదులు చేస్తుండటం మనం తరచూ చూస్తుంటాం. కానీ, ఇటీవల ఓ ప్రయాణికుడికి ఏసీ కోచ్‌లో షాకింగ్ అనుభవం ఎదురైంది. సౌత్ బిహార్ ఎక్స్‌ప్రెస్‌లోని ఏసీ కోచ్‌లో ప్రయాణించిన ప్రశాంత్ కుమార్ అనే వ్యక్తి తన బెర్త్ వద్ద ఎలుకలు అటూ ఇటూ తిరగడం గమనించారు. అనంతరం అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగుచూసింది. దీంతో రైళ్లలో పరిశుభ్రత అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సౌకర్యంగా గమ్యస్థానానికి వెళ్లొచ్చనే ఉద్దేశంతో రూ.2వేలు చెల్లించి రైలులో సెకండ్ ఏసీలో టికెట్ బుక్ చేసుకున్న అతడు సీటు వద్ద ఎలుకలను చూసి కంగుతిన్నాడు. వెంటనే ఆ దృశ్యాలను రికార్డు చేసి సామాజిక మాధ్యమాల వేదికగా అధికారులకు ఫిర్యాదు చేశాడు. "పీఎన్ఆర్ నంబర్ 6649 339230. రైలు నంబర్ 13288. ఏ 1 కోచ్‌లో కొన్ని ఎలుకలు సీట్లు, లగేజీలపై తిరుగుతున్నాయి. అంత డబ్బులు చెల్లించి 2 ఏసీలో టికెట్ కొన్నది ఇందుకేనా?" అని ప్రశ్నించారు. తన ట్వీట్‌ను కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్, ఐఆర్‌సీటీసీ, రైల్వేమంత్రిత్వశాఖ అధికారులు, మీడియా సంస్థలకు ట్యాగ్ చేశారు. ఈ పరిస్థితిపై తొలుత అతడు రైల్వే హెల్ప్‌లైన్ (139)ను సంప్రదించగా.. రైలులో సిబ్బంది పురుగు మందును పిచికారీ చేసినట్లు తెలిపారు. 'ఎక్స్'లో ఫిర్యాదు చేసిన అనంతరం ఆ కోచ్‌లో సీట్ల వద్ద క్లీనింగ్ చేశామని, లైజాల్‌తో వెట్ స్వీపింగ్ చేసినట్లు సిబ్బంది పేర్కొన్నారు. ఆ తర్వాత సీటింగ్ ఏరియా కింద దోమల నివారణ మందును స్ప్రే చేశారని.. సీటు కింద గ్లూ ప్యాడ్‌ను పెట్టామన్నారు..మరోవైపు, ఈ వీడియో వైరల్‌గా మారడంతో నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. ఈ పరిస్థితిపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేయగా.. మరికొందరైతే భారతీయ రైల్వే ప్రయాణికులకు ఇదొక సాధారణమైన అనుభవమేనంటూ కామెంట్లు పెట్టారు. కొందరు సటైరికల్‌గా స్పందించగా.. మరికొందరు రైలులో ఎలుకలు ఉండటం వల్ల తలెత్తే తీవ్రమైన అనారోగ్య సమస్యలు, అపరిశుభ్రతపై ఆందోళన వ్యక్తం చేశారు.

# డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే పక్కాగా నిర్వహించాలి

**వనపర్తి బ్యూరో మార్చి 12 (జనంసాక్షి) :**



జిల్లాలో డిజిటల్ క్రాప్ బుకింగ్ (పంటల నమోదు) సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావు పల్లి గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్ సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. నాగరాజు అనే రైతు వ్యవసాయ పొలం వద్ద పంట వివరాల నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.రైతులు సాగు చేస్తున్న పంటకు సంబంధించిన అన్ని వివరాలను పక్కాగా క్రాప్ బుకింగ్ సర్వేలో నమోదు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.
రైతుతో మాట్లాడుతూ ఏ రకం వరి వేశారు, పంట సాగు చేయడానికి అనుకూలమైన వాతావరణం ఉందా, నీటి వనరుల కోసం దీనిపై ఆధారపడ్డారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు ఎక్కడ కొంటున్నారు? ట్రేడర్లు నాణ్యమైన ఎరువు లు ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు.

**నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి**

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో జరుగుతున్న నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం కొత్తకోట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల, పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగు తున్న నిర్మాణ పనులను పరిశీలించారు .కొత్తకోట జడ్పీహె చ్ఎస్ బాలుర పాఠశాలలో సి బి ఎఫ్ నిధులతో నిర్మిస్తున్న ఆరు అదనపు తరగతి గదులు, బాలికల పాఠశాలలో డి ఎం ఎఫ్ టి నిధులతో నిర్మిస్తున్న రెండు తరగతి గదులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు .అదేవిధంగా, పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి జెడ్పిహెచ్ఎస్ లో డి ఎం ఎఫ్ టి నిధులతో నిర్మిస్తున్న రెండు మరుగు దొడ్లను కూడా నిలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి గోవిందు నాయక్, కొత్తకోట తహసిల్దార్ వెంకటేశ్వర్లు, పెబ్బేరు తహసీల్దార్ లక్ష్మీ, పంచాయతీ రాజ్ ఏఈలు నరేష్, కార్తీక్, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ప్రతి ఒక్కరూ హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలి




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 12 (జనంసాక్షి)**

ప్రతి ఒక్కరూ హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డైరెక్టర్ ఐఇసి విభాగం రవికుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లకు కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడుతూ.. హెచ్ఐవి ఎయిడ్స్ నివారణలో అంగన్ వాడి వర్కర్ పాత్ర కీలకమని, ప్రతి గర్భిణీ స్త్రీకి హెచ్ఐవి సిఫిలిస్ పరీక్షలు జరిగేటట్టు చూడాలని ముందు హెచ్ఐవి పరీక్ష చేయడం వల్ల తల్లి నుండి బిడ్డకు రాకుండా నివారించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీకి చూడాలని అని అన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అప్పుడే ప్రతి ఒక్కరూ దాని బారిన పడకుండా ఉంటారని తెలియజేశారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా, మహిళా సాధారికత, సుఖ వ్యాధులు, చికిత్స, సఖి సేవలు, మహిళల ఆరోగ్యం, డ్రగ్స్ నివారణ, హెచ్ఐవి సోకిన బాధితులకు ప్రభుత్వ సహాయాలు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో డిపిఓ పద్మజ, డిపిఎం భారతి, సఖి సెంటర్, సుధాకర్ ,డిడబ్ల్యూఒ సుపరిండెంట్ భాస్కర రావు, మరియు సిబ్బంది, రాజేంద్ర కుమార్, విక్రమ్, రాణి, లింక్ వర్కర్స్ డిఆర్పి సుధాకర్,300 అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, సిడిపిఓ పాల్గొన్నారు.

# వడదెబ్బపై కూలీలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలి

## జిల్లాలో అన్నిచోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలి

## జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్

**ములుగు ప్రతినిధి, మార్చి 12(జనంసాక్షి).**



ప్రస్తుత వేసవి కాలంలో పలు రకాల కూలీ పనులకు వెళ్తున్న కూలీలకు, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు వడ దెబ్బ పై అవగాహన సదస్సులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. జిల్లాలో అన్నిచోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి జిల్లా వైద్య, విద్య, వ్యవసాయ శాఖ, మండల ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధిక మొత్తంలో నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని పనికి ఆహార పథకం వెళుతున్న కూలీలకు, వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించడమే కాకుండా వారు పనిచేస్తున్న చోట్ల త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడిన పక్షంలో వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వేసవి కాలం ముగిసే వరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కూలీలు వడదెబ్బకు గురైన పక్షంలో వెంటనే వారిని తరలించడానికి 108 సిబ్బంది అప్రమత్తంగా ఉండి దగ్గర్లోని ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. జిల్లాలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థుల వివరాలను తనకు అందజేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కూలీలు ప్రతిరోజు 11 గంటల లోపే పనులను ముగించుకోవాలని, వృద్ధులు ఆరుబయట తిరగకుండా సూచనలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ఓ గోపాల్ రావు, జిల్లా పంచాయితి అధికారి దేవ్ రాజ్, డిఈఓ పాణిని, డిస్ట్రిక్ట్ ఇరిగేషన్ ఆఫీసర్ అప్పలనాయుడు, ఎలక్ట్రిసిటీ డిఈ నాగేశ్వర రావు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద రైతు కూలీ బిడ్డ.. నేడు గెజిటెడ్ లెక్చరర్

## నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలతో మెరిసిన ఎల్కూరు ఆణిముత్యం మహమ్మద్ సుభాన్

**మల్దకల్ మార్చి12 (జనంసాక్షి)**



జోగులంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని ఎల్కూరు గ్రామానికి చెందిన కీ.శేనడిపి ఖాజా హుస్సేన్,చాంద్ బీ అబ్బాయి మహ్మద్ సుభాన్ ధరూర్ ప్రభుత్వ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ గా నియమితుయ్యారు. తన చిన్నతనంలోనే 7వ తరగతిలో తండ్రిని కోల్పోయినా తల్లి కోరిక మేరకు చదువు పై గల ఆసక్తితో తమ అధ్యాపకుల ప్రోత్సాహంతో పదవ తరగతి వరకూ ఎల్కూర్ జడ్పిహెచ్ఎస్ చదివి 2006 లో పదో తరగతిలో మండల టాపర్ గా ఉత్తీర్ణులై,డిగ్రీ కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో 2011 సం"లో గోల్డ్ మెడల్ తో ఉత్తీర్ణులైనారు.2013 సంలో హైదరాబాద్ సెంట్రల్ యూనిర్సిటీలోఎమ్మెస్సీ ఫిజిక్స్ లో పట్టా పొందారు.2014 లో ఉస్మానియా యూనివర్సిటీ లో బీఈడీ పూర్తి చేసి,2104లోనే పంచాయితీ కార్యదర్శిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించి ధరూర్ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ గా నియమితులయ్యారు.నాటి నుండి పంచాయితీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తునే..చదువు పై ఆసక్తి తో అలుపెరుగని విక్రమార్కుని వలె శ్రమించి 2024లో ప్రభుత్వ గురుకుల పోస్ట్ గ్రాడ్యువేట్ టీచర్,కేటగిరిలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ తో జూనియర్ లెక్చరర్గా రెండు ఉద్యోగాలు సాధించారు.ఈ క్రమంలో టీఎస్ సెట్,టీఎస్ టెట్, సీటెట్,ఏపీ టెట్,గేట్, ఏపీ సెట్,ఏపీ సెట్,నెట్, మొదలగు పట్టాలు పొందారు. 2011లో పీజీ సెట్ లో స్టేట్ 2 వ ర్యాంక్, సాధించాడు. 2023లో టీజీపీఎస్సీ నిర్వహించిన ,జూనియర్ లెక్చరర్ వ్రాత పరీక్షలో కేటగిరి విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించి బుధవారం హైదరాబాదులోని రవీందర్ భారతిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు .ప్రభుత్వ పాఠశాల,ప్రభుత్వ కళాశాలలో చదివి ఏకంగా 4 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.నిరుపేద కుటుంబంలో జన్మించిన మహమ్మద్ సుభాన్ చదువుకు డబ్బు పేదరికం ఏమాత్రం అడ్డు కాదని,నిజమైన మట్టిలో మాణిక్యం అని,ఎందరో పేద విద్యార్థులకు ఆదర్శం నిలిచారు.

# ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి

**ఉర్కొండ, మార్చి 12 ( జనంసాక్షి) :**



మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 400, 402, 403, 410 భూములకు సంబంధించి టిఫన్లు ఉన్నప్పటికీ గ్రామ నక్ష సహాయంతో సర్వే చేయడం జరిగిందని టీపన్లల ద్వారా సర్వే చేసి ప్రభుత్వ భూములు కాపాడాలని గ్రామస్తులు ఉరుకొండ ఎమ్మార్వో రామకోటికి వినతి పత్రాలు సమర్పించారు. జాతీయ రహదారిపై ఏర్పాటు చేసినటువంటి వెంచర్లను అనుసరించి ప్రభుత్వ దేవాలయ భూములు మరియు ముస్లింల స్మశాన వాటిక ఉందని దాని పక్కలో రేవెల్లి కి వెళ్లే రోడ్డు ఆక్రమించారని గ్రామస్తులు ఎమ్మార్వో కు ఇచ్చిన వినతి పత్రంలో తెలియజేశారు. సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భూములు సర్వే హద్దులు, నిర్ధారణ జరిపి సమగ్ర విచారణ జరపాలని, గ్రామ నక్ష కాకుండా టిఫన్ ల ద్వారా సర్వే నెంబర్లలోని భూములు సర్వే చేయించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా గ్రామస్తులు , మైనార్టీ నాయకులు ఎమ్మార్వో ను కోరారు.

**భూములను రీ సర్వే చేపిస్తాం : ఎమ్మార్వో**

వినతి పత్రంలో పొందుపరిచిన సర్వే నెంబర్లను ఇదివరకే ఏడిఈ ఆధ్వర్యంలో టెక్నికల్ టీం సర్వే చేయడం జరిగింది. గ్రామస్తుల కోరిక మేరకు మళ్లీ రీ సర్వే చేపిస్తానని ఎమ్మార్వో రామకోటి తెలిపారు.

# నానా హంగామా సృష్టించిన నాగసాధు

## పోలీసులు అదుపులోకి తీసుకొని హైదరాబాద్ వైపు తరలింపు

**తంగళ్లపల్లి (జనంసాక్షి)**




రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దు వద్ద నాగ సాధు అఘోరి రాకతో తీవ్ర ఉద్రిక్తతతకు దారి తీసిన సంఘటన చోటుచేసుకుంది. వేములవాడ రాజన్న దర్శనంకు వస్తున్నట్లు నాగ సాధు అఘోరి వెల్లడించింది. దీంతో తంగళ్ళపల్లి మండలం, జిల్లెల్ల సరిహద్దులో భారీగా పోలీస్ బలగాలు మోహరించి అడ్డుకున్నారు. ఆమె కారు నుండి దిగేందుకు యత్నించగా దిగనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బ్లేడుతో ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. ఆ గోఘోని పోలీసులు నిలువరిస్తున్న వినకుండా వారితో వాగ్వి వివాదానికి దిగింది. భారీ ఉధృతత మధ్య కారును నిలువరించడానికి పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కారును ముందుకు తీయడంతో ఆమె కారును అడ్డుకొనే ప్రయత్నంలో కారు అద్దాలు ధ్వంసం అయ్యాయి. పోలీసులు చేసేదేమీ లేక టోషన్ వాహనంతోకారును తరలించే ప్రయత్నం చేయగా నానా హంగామా సృష్టించింది. దీంతో పోలీసులు ఆమెను వాహనం నుండి కిందికి దింపి పోలీస్ వాహనంలో హైదరాబాద్ వైపు తరలించారు.

# పలు ప్రాంతాలను సందర్శించిన కరీంనగర్ సీపీ

**ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల సందర్శన**

**కరీంనగర్ బ్యూరో, మార్చి 12 (జనంసాక్షి) :**



కరీంనగర్ కమీషనరేట్ పరిధి లోని టౌన్ డివిజన్ లోని పలు ప్రాంతాలను, ప్రధాన కూడళ్ళను బుధవారం రోజు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సందర్శించారు. టౌన్ డివిజన్లోని కరీంనగర్ వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ పోలీసు స్టేషన్లలోని పలు సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ కమిషనర్ పర్యటించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను, ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ క్రమబద్ధికరణకు ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న చర్యలను పర్యవేక్షించారు. కమిషనరేట్ లో ప్రధాన రహదారులను సందర్శించారు. పోలీసు స్టేషన్ ల పరిధులను చూసారు. ఇంటర్మీడియట్ బోర్డ్ పరీక్షలు జరుగుతున్నందున పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు జరిగే తీరును ఆయన పరిశీలించారు. అనంతరం కరీంనగర్ బస్టాండ్ ను సందర్శించి ఆర్టీసీ అధికారులతో సమావేశమయ్యారు. బస్టాండ్ ఆవరణలో గల సీసీ కెమెరాలు ఏర్పాటు వాటి పనితీరును గురించి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ తో పాటు టౌన్ డివిజన్ ఏసిపి వెంకటస్వామి, ట్రాఫిక్ ఏసిపి యాదగిరి స్వామి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రమేష్ లతోపాటు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కామారెడ్డి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన వీణ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 12 (జనం సాక్షి)**




కామారెడ్డి ఆర్డీఓ గా వీణ వారం విధుల్లో చేరారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాదపూ ర్వకంగా కలిసి పూల బొకే ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామారెడ్డి డివిజన్ పరిధిలో ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా పనులు జరిగేలా చూడటమే తమ ముందున్న కర్తవ్యం అన్నారు.

# ఎల్సిడిసి సర్వేని విజయవంతం చేయండి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్**

**ఆదిలాబాద్, ప్రతినిది (జనంసాక్షి)**




ఈ నెల 17వ తేదీ నుంచి జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహించనున్న సర్వేను వైద్య సిబ్బంది విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఎల్సిడిసి పై జిల్లాస్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డి. ఎం. హెచ్. వో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆశా కార్యకర్తలు ఈ నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం తమకు కేటాయించిన ఇండ్లను సందర్శించి కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించనున్నట్లు తెలిపారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దు బారిన మచ్చలు, కాళ్లు చేతుల్లో తిమ్మిర్లు రావడం తదితర లక్షణాలు ఉన్నవారు తమ ఇంటికి వచ్చే ఆశా కార్యకర్తలకు చూపించు కోవాలని కోరారు. ఆశా కార్యకర్తలు సైతం ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యులను తప్పనిసరిగా పరీక్షించాలని అన్నారు. సంబంధిత సూపర్వైజర్లు, వైద్యాధికారులు సర్వేను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానన్, జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ సుమలత, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్, డి పి ఎం ఓ లు రమేష్, వామన్ రావు ఆయా పీహెచ్ సి ల వైద్యాధికారులు లెప్రసీ నోడల్ పర్సన్స్, సూపర్వైజర్లు పాల్గొన్నారు

# వీపనగండ్ల కేంద్రానికి అదనంగా మరో బస్సు

**వీపనగండ్ల, మార్చి 13 ( జనం సాక్షి)**




వనపర్తి జిల్లా కేంద్రం నుండి వీపనగండ్ల మండల కేంద్రానికి ప్రజల అవసరం మేరకు రవాణా సౌకర్యం పెంచాలని ఉద్దేశంతో నైట్ హాల్ట్ బస్సు ప్రారంభిస్తున్నట్లు వనపర్తి జిల్లా డిపో మేనేజర్ వేణుగోపాల్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బాల్ రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ బస్సు వనపర్తి బస్టాండ్ నుండి రాత్రి 7 గంటల 20 నిమిషాలకు ప్రారంభమై చందాపురం, చింతకుంట, మాందాపురం, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి, పుల్గర్ చర్ల కల్వరాల గ్రామాల మీదుగా వీపనగండ్ల మండల కేంద్రానికి రాత్రి 8: 30 నిమిషాలకు చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సు మండల కేంద్రంలో నైట్ హాల్ట్ చేసి మరుసటి రోజు ఉదయం 4:40 నిమిషాలకు బయలుదేరి మరల అదే గ్రామాల మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని తెలిపారు. ఈ రవాణా సౌకర్యాన్ని గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

# విద్యా కమిషన్ రిపోర్టులో వంట కార్మికుల వేతనాలేవీ?

**ములుగు ప్రతినిధి, మార్చి 12(జనంసాక్షి) :**



పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న విధానంపై అధ్యయనం చేసే విషయంలో ఆకునూరి మురళి విశ్రాంత ఐఎఎస్ అధికారిని చైర్మన్ గా వేసిన సందర్భంలో వారు పాఠశాలలను వంట కార్మికుల పరిస్థితులను అధ్యయనం చేసి ప్రభుత్వానికి ఒక రిపోర్టు అంధచేయడం జరిగిందనే విషయాన్ని తెలుసుకున్న సందర్భంలో అందులో వంట కార్మికుల వేతనాల విషయం లేకపోవడం వల్ల వంట కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కనుక విద్యా కమీషన్ చైర్మన్ మరొక సారి పరిశీలన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ 10 వేల వేతనం విషయంతో పాటు మెనూ చార్జీల విషయంలో కూడా మరొక సారి పరిశీలనచేసి ప్రతీ విద్యార్థికి రూ 25 చెల్లించే విధంగా, వంట బిల్లుల కూడా సకాలంలో అందించే విధంగా ప్రభుత్వానికి సూచనలు సలహాలు అందచేయాలని కోరారు. ప్రస్తుతం అందచేసిన రిపోర్ట్ లో మెనూ చార్జీల పెంపు విషయం కూడా సరిపోయే విధంగా లేదు అన్నారు. కనుక చైర్మన్, కమీషన్ సభ్యులు అందరూ వంట కార్మికులకు న్యాయం జరిగే విధంగా క్రుషి చేయవలసినదిగా కోరారు.

# గ్రామాల్లో సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేయాలి

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలి
## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ములుగు ప్రతినిధి, మార్చి12(జనంసాక్షి)**



మండల కేంద్రంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని, గ్రామాలలో సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్అన్నారు. బుధవారం వాజేడు మండల కేంద్రంలో ఐటీడీఏ పిఓ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను నిజమైన అర్హులను గుర్తించి అందజేయడానికి చొరవ చూపాలని, మండల కేంద్రాలలోని ఎంపిడిఓ ఎంపిఓ కీలక పాత్ర పోషించాలని అన్నారు. వేసవికా లంలో గ్రామాలలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలని, అవసర మైన పక్షంలో వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకొని మంచి నీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మండలంలో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతుల వివరాలను ఇప్పటికే సేకరించడం జరిగిందని, నష్టపోయిన రైతులకు ఆయా విత్తన కంపెనీల ద్వారా నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు. నష్టపోయిన రైతుల వివరాలను మండల వ్యవసాయ కార్యాలయంలో రెవెన్యూ కార్యాలయంలో సూచిక బోర్లపై పేర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, నష్టపోయిన రైతు పేరు లేని పక్షంలో గురువారం

లోగా పేరు నమోదు చేయించుకోవాలని అన్నారు. మండలంలో అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం

వహిస్తే చర్యలు తప్పవని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఆయా పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. అనంతరం ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూమికి భూమి ఇస్తే నిమ్జ్ ప్రాజెక్టుకు మేం అనుకూలమే..

## మామిడిగిలో భూ నిర్వాసితుల డిమాండ్
## పోలీసుల భారీ భద్రత మధ్య గ్రామసభ

**న్యాల్ కల్, మార్చి 12, (జనం సాక్షి) :**






జాతీయ పెట్టుబడులు ఉత్పత్తుల మండలి (నిమ్జ్) ప్రాజెక్టు ఏర్పాటు కోసం మేము ఎంత మాత్రం వ్యతిరేకం కాదు. ప్రతి ఏటా మూడు పంటల సాగు చేసే సారవంతమైన భూములను స్వాధీనం చేసుకొని పరిశ్రమల ఏర్పాటు చేయడం ఎంత మాత్రం సరికాదు. భూమికి బదులుగా భూమి ఇవ్వడం, అర్హత కలిగిన వారికి ఉద్యోగ, ఉపాధి కల్పించడం. సొంతింటిని నిర్మించడం, తదితర సమస్యలను పరిష్కరిస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదని నిమ్జ్ భూ నిర్వాసితులు కరాకండిగా స్పష్టం చేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, మామిడిగి గ్రామంలోని రైతు వేదికలో గ్రామసభను ఏర్పాటు చేశారు. నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ ఎస్. రాజు, స్థానిక తహసిల్దార్ భూపాల్ ఆధ్వర్యంలో భూ సేకరణ కోసం గ్రామ సభను ఏర్పాటు చేశారు. జహీరాబాద్ డివిజన్ డిఎస్పి రామ్మోహన్ రెడ్డి, పట్టణ సిఐ శివలింగం, గ్రామీణ సీఐ జక్కుల హనుమంతు, పర్యవేక్షణలో ఆరుగురు ఎస్సైలు, పదుల సంఖ్యలో పోలీసుల భారీ భద్రత మధ్య గ్రామసభ కొనసాగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన గ్రామ సభలో.. గ్రామానికి చెందిన పలువురు భూ నిర్వాసితులు హాజరై పలు అభ్యంతరాలను స్పష్టం చేశారు. ఎంతో సారవంతమైన భూముల్లో వివిధ రకాల వాణిజ్య పంటలను సాగుచేసే భూములను పరిశ్రమల ఏర్పాటు కోసం గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టడం ఎంత మాత్రం సరికాదని రైతులు వాపోయారు. ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. గ్రామానికి చెందిన అసైన్డ్ భూముల పట్టాదారులు ఈ పాటికే తమ భూములను లాక్కున్నారని, ఇంతవరకు పరిహారం అందలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పలువురు పట్టాదారులు, అసైన్డ్ భూముల పట్టాదారుల మధ్య వాక్వాదం చోటు చేసుకుంది. అసైన్డ్ భూములైన, పట్టా భూములైన ఇచ్చే ప్రసక్తి లేదని పలువురు రైతులు సభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ ఎస్.రాజు రైతులను సముదాయిస్తూ.. రైతుల సమస్యలు, అభ్యంతరాలను ఉన్నతాధి కారులకు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామంలో 900 ఎకరాల పట్టాభూమి, 300 ఎకరాలకు అసైన్ భూమిని నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం భూ సేకరణ చేపట్టేందుకు అధికారులు తాజాగా గ్రామంలో రెండోసారి గ్రామ సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప తహసిల్దార్ రాజిరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్ రావు, సిద్ధారెడ్డి, గ్రామానికి చెందిన రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు గాంధీ కుటుంబం బాధ్యత వహించాలి

## గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదు
## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (జనంసాక్షి)**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు గాంధీ కుటుంబం బాధ్యత వహించాలని, హామీల అమలుపై బాధ్యత తీసుకోని సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గాంధీ కుటుంబానికి కేవలం ఎన్నికల సమయంలోనే తెలంగాణ గుర్తొస్తుందా ? అని నిలదీశారు. గాంధీ కుటుంబం సంతకా లు చేసిన గ్యారెంటీలను చూసే ప్రజలు ఓట్లు వేశారని, స్థానిక కాంగ్రెస్ నాయకులను చూసి ప్రజలు ఓట్లు వేయలేదని, కాబట్టి బాధ్యత తీసుకొని గాంధీ కుటుంబం తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. గరవ్నర్ ప్రసంగంపై స్పందిస్తూ ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదని, ఎన్నికల సమయంలో గాంధీ కుటుంబం వచ్చి ఇచ్చిన హామీల అమలుపై ప్రస్తావనే లేదని విమర్శించారు. అబద్దాలనే మళ్లీ అందమైన భాషలో చెప్పే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఎండగడుతామని స్పష్టం చేశారు. రూ. లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసినా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయలేదని, దీని మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ 2500 ఇస్తామన్న హామీని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, ఈ హామీని అమలు చేయకుండానే మహాలక్ష్మీ పథకం గేమ్ చెంజర్

అని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రాన్ని వెనక్కి నడిపిస్తూ పురోగమిస్తుందని శుద్ధ అబద్ధాలు చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాళాకోరు తనానికి అద్దంపడుతోందని తీవ్రంగా విమర్శి ంచారు. రైతులకు సంపూర్ణంగా రుణ మాఫీ, రైతు భరోసా అమలు చేయకుండానే గొప్పగా అమలు చేశామని చెప్పుకోవడం దారు ణమని, ఇది ప్రభుత్వ అసమర్థతను తేట తెల్లం చేస్తున్నదని తెలిపారు.

ఎన్నికల సమయంలో

ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

# 79.50 క్వింటాళ్ళ పీడీఎస్ రైస్ పట్టివేత

**గోదావరిఖని (జనంసాక్షి)**



రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్సు సిబ్బంది కలిసి పెద్దపల్లి జోన్ గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 ఇంక్లైన్ వద్ద, మంథని నుండి గోదావరిఖని మీదుగా మహారాష్ట్ర కి వెళ్తున్న డీసీఎం వ్యాన్ (టీఎస్-02-యూఏ 1517) ద్వారా అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, డీసీఎం వ్యాన్ లో తరలిస్తున్న సుమారు 79.50 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది. వాటి విలువ సుమారు రూ. 3,08,100 వుంటుందన్నారు. పట్టుబడిన నిందితుడి వివరాలు : మంథని శ్రీపాద కాలనీకి చెందిన ఏ-2) దేశెట్టి మారుతి,పరారిలో ఉన్న నిందితుల వివరాలు మంతానికి చెందిన ఏ-1) రాచర్ల రమేష్, సిరోంచకు చెందిన యెల్లంకి వీరన్, మంతనికి చెందిన ఏ-4) ఓదెల మహేందర్ స్వాదినపరుచుకున్న 79.50 పిడిఎస్ రైస్, డీసీఎం వ్యాన్, నిందితున్ని తదుపరి విచారణ నిమిత్తం గోదావరిఖని 1 టౌన్ పోలీస్ లకు అప్పగించమన్నారు.

# సామాజిక సాంకేతిక రంగాలలో పురోగతిని ప్రోత్సహించాలి

## మహిళల మేధో శక్తి చాలా గొప్పది
## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్

**భువనగిరి కలెక్టరేట్ ,మార్చ్ 12 (జనం సాక్షి)**



అభివృద్ధి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ ఉద్బోధించారు. బుధవారం కలెక్టరేట్ లో స్త్రీ శిశు సంక్షేమ వయోవృద్ధు ల శాఖ, ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు .కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు ఎదిగితే సమాజం అభివృద్ధి చెందుతుందని, మహిళలు అన్ని రంగాల్లో ముందు కు రావాలి అన్నారు. మహిళా సాధికారతకు తోడ్పడాలని సూచించారు. అదనపు కలెక్టర్ గంగాధర్ జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా దినోత్సవాన్ని ప్రారంభి మాట్లాడుతూ.. మహిళలు విద్య, ఉపాధి రంగాల్లో లింగ సమానత్వం, మహిళా సాధికారత, సాధించాలనీ, మహిళల హక్కులను కాపాడడం సామాజిక, సాంకేతిక రంగాల్లో పురోగతిని ప్రోత్సహించాలని,విద్య, ఉపాధి భద్రత వంటి రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా మహిళలు ముందుంటారని, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక స్వావలంబన, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు, ఒక మహిళ విద్యవంతురాలు అయితే కుటుంబంతో పాటు సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని, మహిళల మేధాశక్తి చాలా గొప్పదన్నారు. మహిళా సంఘాల ద్వారా జిల్లాలోని మహిళలు ఆర్థికంగా ఎదగలన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ చిస్తీ మాట్లాడుతూ అమ్మను పూజించాలి , భార్యను గౌరవించాలి అన్ని విధాలుగా మహిళలను అన్ని రంగాల్లో ముందుకు పోవాలన్నారు. మహిళలు కోటీశ్వరులు కావాలనే ఉద్దేశం మన ముఖ్యమంత్రి ది అని అందుకు ప్రభుత్వం మహిళల కొరకు అనేక సంక్షేమ పథకాలు ఇస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసాలు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ప్రదర్శన, మహిళ ఉత్తమ ఉద్యోగులకు బహుమతుల ప్రధానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి సీఈవో శోభ రాణి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సఖి కేంద్రం నిర్వాహకురాలు ప్రమీల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, జిల్లా పౌర సంబంధాల అధికారి అరుంధతి, జిల్లా ట్రెజరీ అధికారికి సంపూర్ణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితీ, సీడీపీఓలు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపండి

## విధుల పట్ల నిర్లక్షం వహిస్తే కఠిన చర్యలు
## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి)**



జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను రూపు మాపేందుకు పోలీసులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం ఆయన జిల్లాలోని జైనథ్ మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్టేషన్ లో ఉన్న చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పక్కనే మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న నేపథ్యంలో పోలీసులు ఎప్పుడు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు. విధుల పట్ల నిర్లక్షం వహిస్తే ఉపేక్షించేది లేదని పోలీసులకు తెలిపారు. అనంతరం అక్కడే ఉన్న పురాతన వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించి ఆలయంలో గోడపై చెక్కి ఉన్న పురాతన ఆనాటి లిపి భాషను ఆసక్తిగా చూస్తూ మంత్ర ముగ్ధులయ్యారు.

# ఆకట్టుకున్న పారమిత ఎక్సలెన్షియా అవార్డుల ప్రధానోత్సవం

**కరీంనగర్ బ్యూరో, మార్చి 12 (జనంసాక్షి) :**




స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరి ప్రతిభ ఆధారంగా రాష్ట్ర , జాతీయ , అంత ర్జాతీయ స్థాయిలో సాధించిన విజయా లను, పారమిత ఎక్సలెన్షియా 2024-25 పేరుతో అవార్డుల ఉత్సవ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద రావు జ్యోతి ప్రజ్వలన చేసే కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ ఒలంపియాడ్స్, క్రీడలు , సాంస్కృతిక రంగాలలో విశేష ప్రతిభ కనబర్చి టాప్ ర్యాంకులను సాధించిన విద్యార్థులను వారి తల్లి దండ్రుల సమక్షంలో అవార్డులు, మెడల్స్ తో సత్కరించి ప్రశంశా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో బహుమతులు అందుకున్న విద్యార్థు లను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద రావు ప్రత్యేకంగా అభినం దించారు.ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, టి.యస్. వి.రమణ, వినోద రావు, వి.యు.ఎం. ప్రసాద్, హనుమంత రావు, ప్రధానోపాధ్యా యులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రాము ఉపా ధ్యాయుని, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

**రేవల్లి, మార్చి 12 (జనంసాక్షి)**



61 సంవత్సరాలు పూర్తయిన వీఆర్ఏల వారసులకు జీవో నెంబర్ 81, 85 ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్ ఏల జేఏసీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. గోపాల్ పేట్ మండలానికి చెందిన వీఆర్ఏల వారసులు హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా జేఏసీ ప్రతినిధి గోపి మాట్లాడుతూ వీఆర్ఏలు 80 రోజుల పాటు పోరాటం చేయగా ప్రభుత్వం చర్చలు జరిపి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు ప్రభుత్వ ఉద్యోగ ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో వీఆర్ఏల వారసులు బొందయ్య, లక్ష్మీ, బాలమ్మ, తదితరులు ఉన్నారు.

# అవసరమైన వారికి కళ్ళజోళ్ళు అందించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 12 (జనం సాక్షి)**



కంటి చూపు సమస్యలను పరిశీలించి అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందించడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం భిక్నూర్ మండలం జంగంపల్లి మహాత్మా జ్యోతి రావు పూలే బాలికల రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో దృష్టి లోపం కలిగిన విద్యార్థినులకు కళ్ల జోళ్ళ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రీయ బాల సదన్ కార్యక్రమం క్రింద జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుచున్నదని, దృష్టి లోపం కలిగిన విద్యార్థులకు కళ్ల జోళ్ల ను ఉచితంగా అందించడం జరుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కళ్ల స్క్రీనింగ్ నిర్వహించడంతో పాటు అవసరమైన కళ్లద్దాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలల్లో 77 మంది విద్యార్థులకు కళ్ళద్దాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం రెసిడెన్షియల్ స్కూల్ లోని కిచెన్, స్టోర్ రూంలను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం జారీ చేసిన కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. అనంతరం పదవ తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లా డుతూ, ఈ నెల 21 నుండి ప్రారంభం అయ్యే వార్షిక పరీక్షలో మంచి ప్రతిభ కనబర చి, ఉత్తమ మార్కులను పొందా లని,

హార్డ్ వర్క్ చేయాలని తెలిపారు. స్కూల్ లో ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా

వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఆప్తమాలిస్ట్ డాక్టర్ రవీందర్, ఆర్బ్ ఎస్కే డాక్టర్ మనోజ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ మహాలక్ష్మి, ప్రిన్సిపాల్ విమలా దేవి, తహసీల్దార్ శివ ప్రసాద్, ఎంపీడీఓ రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
13 మార్చి 2025

# సమస్యను మనదిగా భావించాలి

- అప్పడే పరిష్కారం సులభమౌతుంది
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) : ప్రజలు అనేక సమస్యలతో మన వద్దకు వస్తుంటారు.. వాటిని పరిష్కరించడం మన బాధ్యతగా ప్రభుత్వ ఉద్యోగులు మరీ ముఖ్యంగా అధికారులు భావించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. పౌర కేంద్రీకృత పాలన లో ప్రజావాణి, ప్రజాపాలన పాత్ర అనే అంశంపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్ హెచ్ఆర్డీ)లో బుధవారం జరిగిన ఒక్కరోజు చర్చా కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పాల్గొని పలు అంశాలను ప్రస్తావించారు. ప్రజల సమస్యలకు పరిష్కారం ప్రజావాణి వేదికగా నిలుస్తుందని, సత్వర న్యాయం జరిగేందుకు దోహదపడడమే కాకుండా.. ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగేలా ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు అనేక సమస్యలతో వస్తుంటారని.. వాటిని మన సమస్యగా భావించినప్పుడే సరైన పరిష్కారం చూపగలమన్నారు. ఇక్కడికి వెళ్లు.. అక్కడి అధికారిని కలువు అని వారిని తిప్పరాదని సూచించారు. అందుకే తాను పని చేసే ప్రతి చోట ప్రజాఫిర్యాదులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చామని.. దీని ద్వారా కింది స్థాయిలో సిబ్బంది ఎలా పని చేస్తున్నారో తెలుసుకునేందుకు వెసులుబాటు లభించిందని అన్నారు. ప్రజల సమస్యలన్నీ దాదాపు సంప్రదింపులతో.. సరైన సూచనలతో పరిష్కారం అవుతాయని.. కేవలం 20 శాతం మాత్రమే జఠిలంగా ఉంటాయని, సమస్యలు పరిష్కారం కానప్పుడే ప్రజలు తీవ్రంగా పరిగణిస్తారని.. నక్సలిజం వైపు వెళ్లిన కొంతమందితో మాట్లాడినప్పుడు చిన్న కారణాలు చాలా వరకూ కనిపించాయని, కింది స్థాయిలోనే సమస్యల పరిష్కారం అయితే.. అవి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వద్దకు రావు.. ఆ మెకానిజంను పటిష్టం చేయాల్సినవసరం ఉందని, అందుకే ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేశారని ఈ క్రమంలోనే ప్రజాపాలన, ప్రజావాణికి ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. స్టేట్ ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ డా. చిన్నారెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వెళ్తున్నారని తెలిపారు. పరిపాలన విధానం ఎలా ఉంది, సమస్యలపై కింది స్థాయి అధికారుల స్పందన ఇలా.. ప్రజల పల్స్ తెలుసుకోడానికి ప్రజావాణి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అందుకే ప్రజావాణిని హైడ్రా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని ప్రతి సోమవారం ఓ ముఖ్యమైన కార్యక్రమంగా భావించి ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని గూగుల్, ఎన్ఆర్ ఎస్సీ, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌ల ద్వారా చూపించి సమస్యపై వారికి అవగాహన కల్పించడంతో పాటు.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. చట్టాలను, న్యాయస్థానాలను గౌరవిస్తూనే.. చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించడానికి మార్గాలను అన్వేషించాలి... వాటిని చాకుగా చూపించి ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని, నిజాంపేటలో ఇటీవల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను హైడ్రా తొలగించింది. ఈ విషయంలో కోర్టు ఉత్తర్వులున్నా అమలు కాలేదు. హైడ్రా కూల్చివేతలతో దాదాపు 10 కాలనీలకు మార్గం సులభమైందని, చెరువులు పరిరక్షణ విషయంలో హైడ్రా అన్ని జాగ్రత్తలు తీసుకుని ముందుకు వెళ్తోంది. చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణకు హైడ్రా కంకణబద్ధమైందని తెలిపారు. చెరువులు, కుంటలు, నాలాలను చెరబట్టిన వారిపై నిబంధనల మేరకు చర్యలు హైడ్రా తీసుకుంటోందని, ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగిస్తున్నామని, ప్రభుత్వ భూములు, ఆస్తులను కబ్జా చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం హైడ్రాకు చాలా అధికారాలిచ్చిందని, వాటిని సద్వినియోగం చేసుకుని బలవంతుల నుంచి సామాన్యులకు రక్షణ కల్పించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను ప్రాంతాలవారీ అధికారులకు కేటాయించడమే కాదు.. వాటి పరిష్కారం ఎంత వరకు వచ్చిందనే విషయమై.. ప్రతి వారంలో రెండు రోజులు రివ్యూ చేస్తామని తెలిపారు. హైడ్రా చర్యలవల్ల.. ప్రతి ఒక్కరికీ చెరువు ఎఫ్‌టీఎల్(ఫుల్‌ట్యాంక్ లెవెల్), బఫర్ (ఎఫ్‌టీఎల్ పరిధి తర్వాత చెరువును ఆనుకుని ఉన్న భూమి) ఇలాంటి అంశాలపై అవగాహన వచ్చిందని ఇప్పుడు ఇల్లు, స్థలం కొనేవారు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల గురించి వాకబు చేసి కొంటున్నారని, ఇది హర్షించదగ్గ విషమని అన్నారు. ఈ సందర్భంగా హైడ్రా ప్రజావాణి నిర్వహిస్తున్న తీరును, పరిష్కారం చేసిన అంశాలను, ప్రజలకు కలిగే మేలును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

## తొందరగా పిల్లలను కనండి

- పెళ్లయిన జంటకు ఉదయనిధి సూచన



చెన్నై, మార్చి12 (జనంసాక్షి) : లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే, రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని అక్కడి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా ఉదయనిధి 72 మంది జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు. అయితే ఎక్కువ మందిని మాత్రం కనొద్దని సూచించారు. ' 2026 తర్వాత అమల్లోకి వచ్చే ఈ డీలిమిటేషన్ పక్రియ జనాభా ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాలను తిరిగి రూపొందిస్తుంది. రాష్ట్రాల్లోని జనాభాకు సరైన ప్రాతినిధ్యం లభించేలా పార్లమెంటులో , అసెంబ్లీల్లో సీట్లుండేలా చూసే పక్రియలో ఎక్కువ సీట్లు ఇవ్వాలంటే , కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు జనాభా సంఖ్యను పర్యవేక్షిస్తోంది. తమిళనాడుతోసహా దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా జననాల రేటను నియంత్రిస్తూ వస్తున్నాయని, దీని మూలంగా పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో వాటి వాటా తగ్గే అవకాశం ఉంది ' అని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమిళనాడు నుంచి 39 మంది ఎంపీలు ఉన్నారని, రాష్ట్ర జనాభబూ 7 కోట్లు కాబట్టి , డీలిమిటేషన్ పక్రియ అమల్లోకి వస్తే ఆ సంఖ్య 31 కి తగ్గుతుందని ఆయన అన్నారు. అయితే ఎక్కువ జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం 100 కు పైగా సీట్లు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని ప్రకారం చూస్తే రాష్ట్ర జనాభా కూడా అధికంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## బంగ్లా నుంచి అక్రమ చొరబాట్లు





- 2601 మంది బంగ్లాదేశీయుల అరెస్ట్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్

న్యూఢిల్లీ, మార్చి 12 (జనంసాక్షి) : భారత్‌లోకి బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ సరిహద్దులో భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన 2601 మంది బంగ్లాదేశీయులను భారత బలగాలు అరెస్టు చేసినట్లు 2024 జనవరి నుంచి ఈ ఏడాది జనవరి మధ్య కాలంలో వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజ్యసభలో ఈమేరకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత్-బంగ్లా సరిహద్దు ప్రాంతంలో భద్రతను బలోపేతం చేయడానికి అధునాతన నిఘా, సాంకేతిక వ్యవస్థ, సమగ్ర ఇంటిగ్రేటెడ్ బోర్డర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటివి వినియోగిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా నిరంతర పెట్రోలింగ్, చొరబాటుకు అవకాశం ఉన్న ప్రదేశాల్లో ఫ్లడ్‌లైట్లు, సోలార్ లైట్లు ఏర్పాటు, నదీ ప్రాంతాల్లో నిరంతరం పడవలతో పహారా చేపడుతున్నామన్నారు. బీఎస్ఎఫ్ నేతృత్వంలోని 15 మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేస్తున్నాయని వెల్లడించారు. గతేడాది ఆగస్టు 5న హసీనా ప్రభుత్వం పతనమైన అనంతరం తాజాగా ఇరు దేశాల భద్రతా బలగాల అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారుల మధ్య చర్చలు జరిగాయని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా భారత్-బంగ్లా మధ్యనున్న 4,096 కిలోమీటర్ల పొడవైన సరిహద్దులో కంచె లేని ప్రాంతాల్లో కంచె వేయడానికి అంగీకారం కుదిరిందని పేర్కొన్నారు.

## రోబోటిక్ సహాయంతో మట్టి తొలగింపు

- ఎస్ఎల్‌బీసీలో ముమ్మరంగా సహాయక చర్యలు ముమ్మరం
- టన్నెల్ ప్రమాదంలో మృతి చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని అతని భార్య రజ్వీందర్ కౌర్‌కు అప్పగింత





నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, మార్చి12(జనంసాక్షి): ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో బుధవారం రోబోటిక్ సహాయంతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్ఎల్‌బిసి టన్నెల్ కార్యాలయంలో సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు అన్వీ రోబోటిక్స్ సంస్థకు చెందిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోను ప్రమాద ప్రదేశానికి తీసుకెళ్లారు. రోబో ద్వారా టన్నెల్ లోపల ఉన్న శిథిలాలను తొలగించడం, భూమిని తవ్వడం వంటి సహాయక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రోబో మానవ సహాయక సిబ్బంది చేరలేని ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేయడం, ,మనుషుల కన్నా 15 రెట్లు అత్యధిక సామర్థ్యంతో రోబో పనిచేయడం ప్రత్యేకత అని, ఎస్ ఎల్ బిసి టన్నెల్ లో సహాయక చర్యలను వేగంగా పూర్తి చేయడానికి ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు సహాయక చర్యలను మరింత వేగంగా, సమర్థంగా ముందుకు తీసుకెళ్లే తీసుకెళ్లడానికి రోబోలు ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. టన్నెల్ లోపల ఉన్న శిథిలాలు, మట్టి కుప్పలు, తేమ, ఆక్సిజన్ సమస్యలు వంటి అడ్డంకులను దృష్టిలో పెట్టుకొని, రోబోలను రంగంలోకి దించినట్లు తెలిపారు. అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా 40 హెచ్ పి పంపు సహాయంతో బురదను బయటికి పంపనున్నారు. ఈ రోబో గంటకు 5000 క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించే సామర్థ్యం కలిగి ఉందని అధికారులు తెలిపారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, రోబోను పరిశీలించిన అనంతరం, అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోతో విజయ్, అక్షయ్ తమ బృందంతో కలసి లోకో ట్రైన్ ద్వారా టన్నెల్ లోపల ప్రమాద ప్రదేశానికి వెళ్లారు. ప్రస్తుతం సహాయక చర్యల్లో 12 కేంద్ర, రాష్ట్ర సంస్థలకు చెందిన బృందాలు 24 గంటలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. మానవ సహాయక బృందాలకు అవసరమైన సామాగ్రి, నీరు, మెడికల్ సపోర్ట్, ఆక్సిజన్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

### మృతి చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని అతని భార్య రజ్వీందర్ కౌర్‌కు అప్పగింత


నాగర్ కర్నూల్ జిల్లా దోమల పెంట వద్ద జరిగిన ఎస్ ఎల్ బిసి టన్నెల్ ప్రమాదంలో మృతి చెందిన రాబిన్స్ ఇండియా కంపెనీలో ఎరెక్టర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న పంజాబ్‌కు చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని అతని స్వగ్రామానికి తరలించి, భార్య రజ్వీందర్ కౌర్‌కు అప్పగించినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. గురుప్రీత్ సింగ్ కుటుంబానికి ఆర్థిక సహాయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన 25 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ను అందజేసినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

## ఐటీ, పరిశ్రమల శాఖ రాష్ట్ర ఇమేజ్‌ను పెంచింది

- రాష్ట్రానికి హైదరాబాద్ తలమానికం
- పెరుగుతున్న వలసలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించండి
- వేసవిలో విద్యుత్తు డిమాండ్ కు అనుగుణంగా ప్రణాళికలు చేసుకోండి



హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) : ఐటీ, పరిశ్రమల శాఖ సంవత్సర కాలంగా రకరకాల సమ్మిట్స్ నిర్వహించి భారీగా పెట్టుబడులు సాధించి తెలంగాణ రాష్ట్ర ఇమేజ్ ను పెంచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ప్రజాభవన్లో ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఇంధన శాఖల ప్రీ బడ్జెట్ సమావేశాలు జరిగాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి డిప్యూటీ సీఎం ఐటీ, పరిశ్రమల శాఖ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు కార్పొరేట్ సంస్థలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్వాణ బాధ్యతను ఒక్కో కార్పొరేట్ కంపెనీకి సీఎస్ఆర్ నిధులు భాగంగా అప్పగిస్తామని పరిశ్రమల శాఖ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. భారీ పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాకాలను దశలవారీగా విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో మెగా లెదర్ పార్కులు, మినీ లెదర్ పార్కుల ప్రగతిని సమీక్షించారు. లెదర్ పార్కులకు కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా విలువైన స్థలాలను కాపాడాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. మూడవ శ్రేణి పట్టణాలకు ఐటీ టవర్స్ విస్తరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రానికి హైదరాబాద్ తలమానికం అందుకు అనుగుణంగా మహానగరం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని, ప్రగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఉపాధి, పెట్టుబడుల దృష్ట్యా పెద్ద ఎత్తున ప్రతి ఏటా వలసలు పెరుగుతున్నాయి అందుకు అనుగుణంగా రహదారులు, విద్యుత్తు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మున్సిపల్, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ఆ మేరకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తే పట్టణీకరణ వేగవంతం అవుతుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. గ్రీన్ పవర్ కు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఇంధన శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సప్లై కాస్ట్ తగ్గించుకోవాలని, రెప్ప పాటు కూడా కరెంటు అంతరాయం లేకుండా చూసుకోవాలి, వేసవిలో పంటలు ఎండిపోకుండా విద్యుత్ ఉన్నత అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రాధాన్యత రంగమైన ఇంధన శాఖకు ఆ మేరకు బడ్జెట్లో కేటాయింపులు ఉంటాయని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశాల్లో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, జయేష్ రంజన్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ మార్ సుల్తాన్య, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, పరిశ్రమల శాఖ అధికారులు విష్ణువర్ధన్ రెడ్డి, మెట్రో వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 'డెవిల్ పక్షి' అను నేను..

జిల్లాలో డెవిల్ పక్షులు క్రమంగా అంతరిస్తున్నాయి. ఈ పక్షులు పెద్ద ఆకారంలో ఉండి వివిధ రంగులో ఉంటాయి. మెడ అచ్చం నాగు పామును తలపిస్తుంది. మెడను అచ్చం పాము మాదిరిగా అటూ ఇటూ తిప్పుతుంది. అదే దీని ప్రత్యేకత దీనికి ఇంకో పేరు "పాము పక్షి" అని కూడా పిలుస్తారు. ఇవి ఎక్కువగా అటవీ ప్రాంతాల్లో చెరువు ప్రాంతాల వద్ద ఒకటి లేదా రెండు మాత్రమే కనిపిస్తుంటాయి. ఇవి నీటిలో చేపలను పట్టి అమాంతం మింగేస్తాయి. కానీ ఇప్పుడు ఇవి కనిపించకుండా పోతున్నాయి.

**వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ**
**-ఆదిలాబాద్ ప్రతినిది (జనంసాక్షి)**

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370